ఈనాడు

హైదరాబాద్ 25-1-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 165

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



చారడేసి కనుల చందమామ ఇకలేరు

బెంగళూరులో తుదిశ్వాస విడిచిన బహుభాషా నటి కృష్ణకుమారి

నలుపు తెలుపు చిత్రలోకపు మహారాణి... బహు భాషానటి కృష్ణకుమారి కన్నుమూశారు..

ఈ సువిశాల రంగుల లోకాన్ని, సినీ అంతఃపురాన్ని వదిలివెళ్లారు...

అందం, అమాయకత్వం కలబోసిన ఆ అభినయం... ఇక తీపి గురుతుగా మిగిలిపోనుంది.

కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణకుమారి(85) బుధవారం బెంగళూరులోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. వివిధ భాషల్లో సుమారు 110 చిత్రాలలో నటించిన ఆమెకు అలనాటి అందాల నటిగా, ఏ పాత్రలోనైనా ఇట్టే ఇమిడిపోయే సత్తాగల కళాకారిణిగా గుర్తింపు ఉంది.

పూర్తి వివరాలు సినిమా పేజీలో



యువకుడి దుస్సాహసం

- రైలు వస్తుండగా..సెల్ఫీ వీడియో
- ఢీకొట్టడంతో గాయాలపాలు

6లో



అశేష భక్తుల మధ్య సూర్యప్రభ వాహనంలో ఊరేగుతున్న శ్రీమలయప్పస్వామి

సప్త వాహనాలపై సర్వాంతర్యామి

- తిరుమలలో వేడుకగా రథసప్తమి

6లో





లాకప్‌లో కోడిపుంజులు

నేరస్థులు తప్పించుకోకుండా లాకప్‌లలో పెడుతుంటారు. అదే లాకప్‌లో పోలీసులకు కోడిపుంజులను ఉంచాల్సిన పరిస్థితి విశాఖ జిల్లాలో ఎదురైంది. 6లో

అసైన్డ్‌కూ ‘సాయం’

- ఆ భూములు సాగుచేస్తున్నవారికీ ఇవ్వాలి
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదనలు
- మొత్తం కోటీ 62 లక్షల ఎకరాలకు పంపిణీ
- ఎకరానికి రూ.4 వేల చొప్పున రూ. 9,727 కోట్లు
- సాగుకు యోగ్యం కాని వాటికి ఇవ్వవద్దని సిఫార్సు

ఈనాడు - హైదరాబాద్

అసైన్డ్ భూముల్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే పెట్టుబడి సాయం కింద పంపిణీ చేయాల్సిన సాగు భూమి మరో 20 లక్షల ఎకరాలు పెరిగినట్లు వ్యవసాయశాఖ తాజాగా ప్రభుత్వానికి తెలిపింది. రెవెన్యూ రికార్డుల పరిశీలన అనంతరం 1.42 కోట్ల ఎకరాలకు ఇవ్వాలని తొలుత ప్రతిపాదించారు. అవన్నీ పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులవి మాత్రమే. అసైన్డ్ భూముల్ని కలపలేదు. కానీ అసైన్ భూముల్లో కొన్నింటినీ ఇతరులకు అనధికారికంగా అమ్మేశారు. వాటిని మినహాయించి పేదలే సాగుచేస్తున్నవి 20 లక్షల ఎకరాలున్నాయని వాటినీ పెట్టుబడి సాయం పథకంలో చేర్చాలని తాజాగా నిర్ణయించారు. ఈ లెక్కన మొత్తం సాగుభూములు 1.62 కోట్ల ఎకరాలున్నట్లు వ్యవసాయశాఖకు తెలిపింది. మొత్తం విస్తీర్ణంలో 56 లక్షల ఎకరాలకు వానాకాలం (ఖరీఫ్), యాసంగి (రబీ) సీజన్‌లలో రూ. 4,000 చొప్పున మొత్తం రూ. 8 వేలు ఇస్తారు. మిగిలిన కోటీ 31 లక్షల ఎకరాలకు వానాకాలంలో మాత్రమే రూ. 4,000 ఇస్తారు. రెండు సీజన్లకు కలిపి రూ.9,727 కోట్లు కేటాయించాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. వాస్తవానికి తొలుత 1.42 కోట్ల ఎకరాలున్నప్పుడు రూ. 7,959 కోట్లు సరిపోతాయని భావించారు. కానీ విస్తీర్ణం పెరుగుదలతో నిధులు మరో రూ. 1,768 కోట్లు అదనంగా కావాలని లెక్కలు తేల్చారు. ఈ పథకానికి సంబంధించిన పలు అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏడాది పత్తి పంట 47 లక్షల ఎకరాల్లో సాగైంది. వచ్చే ఏడాది అరకోటి ఎకరాలకు చేరవచ్చని వ్యవసాయశాఖ అంచనా. ఈ పంట ఏడాది మొత్తం సాగులో ఉంటుంది. దీనిని రెండు సీజన్ల పంటగా భావించి రూ. 8,000 ఇస్తారా లేక ఒకే సీజన్‌కు రూ. 4,000 ఇస్తారా అన్నది ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంది. పత్తి, సోయాచిక్కుడు, కంది వంటి పంటలను ఏడాదికి ఒకసారి మాత్రమే సాగుచేస్తారు. ఈ పంటలకు రెండు సీజన్లకు వేర్వేరుగా పరిగణించి రూ. 8,000 చొప్పున ఇస్తే (మిగతా 6లో)



ఆచార్యుల భర్తీ... జూన్‌కు పూర్తి

- 1061 ఉద్యోగాల భర్తీకి రెండు నెలల క్రితం ఉత్తర్వులు
- త్వరలో పాలకమండలి సమావేశాల్లో ఆమోదం
- రోస్టర్ పాయింట్ల ఖరారు తర్వాత ప్రకటనలు జారీ

14లో

గడువు పెంచాల్సిందే

16లో

- నత్తనడకన పాలమూరు-రంగారెడ్డి, డిండి, సీతారామ ఎత్తిపోతల పథకాలు

ఆమె కోపంగా ఉంది



9 వేల ఏళ్ల నాటి యువతి ముఖాన్ని పునఃనిర్మించిన శాస్త్రవేత్తలు

దిల్లీ: మధ్య రాతి యుగం నాటి మనుషులు ఎలా ఉండి ఉంటారు? వారి రూపు రేఖలు ఎలా ఉంటాయి? ఈ కుతూహలం చాలా మందికి ఉండడం సహజం. ప్రస్తుత గ్రీకు ప్రాంతంలో 9వేల ఏళ్ల నాడు జీవించిన ఒక కౌమార ప్రాయ యువతి ముఖాన్ని శాస్త్రవేత్తలు పునఃనిర్మించి చూపించారు. డాన్ (ప్రభాతం- గ్రీకులో అవ్‌గి) అని ఆమెకు పేరు పెట్టారు. వయస్సు 15-18 ఏళ్లు ఉండి ఉండొచ్చని ఆమె ఎముకలు, పళ్లను విశ్లేషించి అంచనాకు వచ్చారు. ఆమె ముఖం సంతోషంగా లేదు. దవడ ముందుకు పొడుచుకొచ్చింది. జంతు చర్మాన్ని మృదువైన తోలుగా మార్చేందుకు బాగా నమలడం వల్ల దవడ ఆ విధంగా ముందుకు పొడుచుకొచ్చి ఉండొచ్చు. అప్పటి జనంలో ఇది సాధారణంగా కనిపించే పోకడే. భృకుటి ముడిచి కాస్తంత కోప కవళికలతో కనిపించింది. డాన్ పుర్రె ఆధారంగా (మిగతా 6లో)

తెలంగాణనే ఎంచుకోండి

- పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం
- అన్ని విధాలా అనుకూలతలు
- ఆదర్శవంతమైన పారిశ్రామిక విధానం
- దావోస్‌లో పారిశ్రామికవేత్తల భేటీలో కేటీఆర్
- పలు సంస్థలతో సమావేశాలు
- జపాన్ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తాం
- నొవార్టిస్ విస్తరణకు అంగీకారం
- మిత్సుబిషి, హిటాచి ప్రతినిధులతో భేటీ



దావోస్‌లో బుధవారం నోవార్టిస్ సంస్థ ప్రజావిధాన విభాగాధిపతి పెట్రా లక్స్‌తో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

ప్రస్తుతం ప్రపంచ దేశాలకు తెలంగాణ అత్యంత ఆకర్షణీయంగా మారిందని, ఏ దేశానికైనా పరిశ్రమల స్థాపనకు తమ రాష్ట్రమే అత్యుత్తమ గమ్యస్థానమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ తెలిపారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు హాజరైన కేటీఆర్ బుధవారం రెండోరోజు దాదాపు 12 ప్రసిద్ధ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త పరిణామాలను పరిగణనలోనికి తీసుకొని తెలంగాణ పారిశ్రామిక విధానాన్ని ఆదర్శవంతంగా రూపొందించామని, సత్వర అనుమతులు, స్వీయధ్రువీకరణలు, (మిగతా 6లో)



మానవ జీవిత కాలం 140 ఏళ్లు!

మానవ జీవితకాలం మహా అయితే వందేళ్లు. వైద్య రంగంలో నూతన ఆవిష్కరణల పుణ్యమా అని అది 140 ఏళ్లవరకు పెరిగే అవకాశం ఉందట. ఇది పదేళ్లలో సాధ్యమవుతుందని దావోస్‌లో శాస్త్రవేత్తలు అంటున్నారు.

6లో



ఇంజినీరింగ్‌లో మార్పులు

సాంకేతిక కోర్సుల్లో కాలేజీకి రోజూవెళ్లి చదివితేనే కొలువులొచ్చే పరిస్థితి లేదు. ప్రాక్టికల్స్ మీద దృష్టి పెట్టాల్సిందే. ఈమేరకు మార్పులు చేసి కేంద్రం కొత్త బోధనాప్రణాళికను విడుదల చేసింది

6లో

ఇదీ సంగతి!



టీవీ వార్తలతో అనుసంధానించాం సార్. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరగ్గానే దానంతట అదే ధర పెంచుతుంది.

నేను ప్రజా పక్షపాతిని

- కాంగ్రెస్ నేతలతో శత్రుత్వంలేదు
- వీహెచ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే ఆ పార్టీతో కలిసి నడుస్తా
- బాధ్యతాయుత రాజకీయాలే ముఖ్యం
- భద్రాద్రి, ఖమ్మం జిల్లాల పర్యటనలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్



ప్రజలకు అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

14లో



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఛత్తీస్‌గఢ్‌లో కాల్పుల మోత

- ఎదురు కాల్పుల్లో నలుగురు పోలీసుల మృత్యువాత
- వారిలో ఇద్దరు ఎస్సైలు

చర్ల, చింతూరు, న్యూస్‌టుడే: కాల్పుల మోతతో ఛత్తీస్‌గఢ్ బుధవారం మరోసారి దద్దరిల్లింది. ఎదురుకాల్పుల్లో నలుగురు పోలీసులు మృత్యువాత పడ్డారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ ప్రాంతంలో భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. మరో 9 మంది సిబ్బంది గాయపడ్డారు. ఇర్పనార్ గ్రామ అడవుల్లో ‘డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ ఆఫ్ పోలీస్ -డీఆర్‌జీ’, ప్రత్యేక కార్యదళం(ఎస్‌టీఎఫ్) సిబ్బంది గస్తీ తిరుగుతుండగా ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. మృతుల్లో డీఆర్‌జీకి చెందిన (మిగతా 6లో)



మతిమరుపునకు పసుపు మందు

మీకు తెలుసా! భారతీయులు తమ వంటల్లో విరివిగా వాడే పసుపు అల్జీమర్స్ (మతిమరుపు)కు దివ్యౌషధం. ఈ విషయాన్ని అమెరికా శాస్త్రవేత్తలు 40 మందిపై పరిశోధన చేసి కనుగొన్నారు.

6లో

జాతీయ ఓటర్ల దినోత్సవం 25 జనవరి 2018

ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం, 2018



ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గారి సందేశం
25 జనవరి 2018

ప్రియమైన ఓటరు మహాశయులారా!

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో 8వ జాతీయ ఓటర్ల దినోత్సవం అనే ఒక అద్వితీయ సంబరం సందర్భంగా మన దేశ పౌరులందరినీ అభినందించుటకు నేను గర్వపడుతున్నాను మరియు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. నేను నూతన ఓటర్లకు ప్రత్యేకించి ఇప్పుడిప్పుడే నమోదైన సహస్రాబ్ది ఓటర్లకు స్వాగతం పలుకుతున్నాను మరియు స్వేచ్ఛగా మరియు నిర్భయంగా తమ ఆయా నియోజక వర్గంలో రాబోవు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవల్సిందిగా వారికి పిలుపునిస్తున్నాను. భారత ఎన్నికల సంఘం 1950వ సంవత్సరంలో ఇదే రోజు స్థాపించబడినది. 2011వ సంవత్సరం నుండి జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించబడినది. ఈ దినం భారత ఓటర్లకు అంకితమీయబడినది మరియు మతం, జాతి, కులం, వర్గం, భాష, ప్రాంతం లేదా సామాజిక ఆర్థిక అంశాలతో సంబంధంలేకుండా ప్రతి భారత పౌరుడికి ఇవ్వబడిన వయోజన ఓటు హక్కు అనే రాజ్యాంగపరమైన హక్కులను మనకు గుర్తుకు తెస్తున్నది. ఈ రోజున '
ప్రతిజ్ఞ" ద్వారా ప్రజాస్వామ్యం పట్ల మన విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ, స్వేచ్ఛాయుత, పారదర్శకమైన మరియు ప్రశాంత ఎన్నికల పవిత్రత మరియు మనదేశపు ఘనమైన ప్రజాస్వామ్య సాంప్రదాయాలను నిలిపే మన తీర్మానాన్ని నవీకరిద్దాం.

ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం అనేది ఓటర్ల జాబితాలో నమోదుతో ప్రారంభమై పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకొనుటతో ముగుస్తుంది. స్థిర ప్రయత్నాల వలన, మనం సుమారు 87.53 కోట్ల ఓటర్లు గల ఓటర్ల జాబితాను మరియు నలువైపులా 9.97 లక్షల పోలింగ్ కేంద్రాలను సాధించాము. ఇవి మన దేశంలోని దూర సుదూర ప్రాంతాలకు విస్తరించి ఉన్నవి.

అన్ని కేటగిరీల ఓటర్లు ఎన్నికల్లో కలిసికట్టుగా, విజ్ఞతతో మరియు నైతికంగా పాల్గొనేలా చేయుటకు వారిని ప్రోత్సహించుటకై ఎన్నికల సంఘం తన నిరంతర కృషిలో కొన్ని చర్యలను చేపట్టినది. "ఏ ఓటరునూ వదిలివేయరాదు" అనే ఇతివృత్తానికి అనుగుణంగా ఓటర్లను పోలింగ్ స్టేషన్‌కు అనుసంధానం చేసే సామర్థ్యం మరియు సార్థకతకై సామాజిక మాధ్యమంతో సహా సాంకేతికత మరియు సమాచార మాధ్యమాన్ని సదరు చర్యలు సంఘటితం చేస్తాయి.

ఓటర్ల చైతన్యం ఎన్నికల ప్రక్రియను ఓటరుతో అనుసంధానం చేస్తుంది. ప్రత్యేకించి భవిష్యత్ మరియు రాబోవు ఓటర్లను భాగస్వాములను చేయుటకు వ్యవస్థీకృత ఓటర్ల అవగాహన మరియు ఓటర్ల భాగస్వామ్య కార్యక్రమం **(SVEEP)** అనే అత్యంత ప్రధాన ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఇంకనూ పటిష్టపరచబడినది. పరస్పర చర్య పాఠశాల భాగస్వామ్యం మరియు **ECI** జాతీయ ఎన్నికల క్విజ్‌కు మన పాఠశాలల్లో భవిష్యత్ ఓటర్ల నుండి అద్భుతమైన ప్రతిస్పందన లభించినది. విద్యాసంస్థల ద్వారా ఎన్నికల పట్ల అవగాహనను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం ప్రవేశపెట్టబడినది, దీనిక్రింద ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల మొదటి బ్యాచ్ నేడు వెలుగులోకి వచ్చినది.

VVPATలతో **EVM**ల 100% కవరేజి ద్వారా ఓటరు విశ్వాసాన్ని బలపరచుటకు గణనీయమైన మరియు ముఖ్యమైన చర్యలు తీసుకోబడినవి. భాగస్వాములకు **e-**సేవలను అందజేయుటకు **ERO-** నెట్ ప్రవేశ పెట్టబడినది. ఓటర్ల సర్వీసు యొక్క రిజిస్ట్రేషన్ కొరకు కూడా ప్రత్యేక చర్యలు ప్రారంభించబడినవి. పెరిగిన భాగస్వామ్యం రూపంలో ఈ చర్యల ఫలితం కనిపిస్తున్నది.

దివ్యాంగుల **(PWD**లు) రిజిస్ట్రేషన్ మరియు వారి విస్తృత భాగస్వామ్యానికి వీలు కల్పించుటకు 2018 సంవత్సరంలో సదరు సంఘం "ఎన్నికల్లో భాగస్వామ్యం" అనే ఇతివృత్తాన్ని ప్రవేశపెట్టినది.

ఈ జాతీయ ఓటర్ల దినోత్సవం, 2018ని పురస్కరించుకొని దేశ పౌరులందరికీ మరొకసారి నా హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

జై హింద్!

ఓమ్ ప్రకాష్ రావత్
భారత ప్రభుత్వ ప్రధాన ఎన్నికల కమిషనర్

ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌పై సౌకర్యాలు

క్రమ సంఖ్య	సదుపాయము	http://www.ceotelangana.nic.in
1	ఓటరు పేరు వెదకటానికి	హోమ్ పేజ్‌లో "Search Your Name" అనే లింక్
2	మీ పోలింగ్ స్టేషన్ ఏదో తెలుసుకోవటానికి	హోమ్ పేజ్‌లో "Know your PS/BLO" అనే లింక్
3	మీ బూత్ స్థాయి అధికారి ఎవరో తెలుసుకోవటానికి	హోమ్ పేజ్‌లో "Know your PS/BLO" అనే లింక్
4	అసెంబ్లీ నియోజకవర్గం యొక్క ఓటర్ల జాబితాలలో చిరునామా నమోదు/సవరింపు/తొలగింపు/మార్పు కొరకు (ఫారం 6,7,8 & 8A దరఖాస్తులు)	హోమ్ పేజ్‌లో "e-Registration" లింక్ మీద క్లిక్ చేయండి. "Assembly Constituency"ని ఓపెన్ చేయండి. "Form-6..." లేదా "Form-7" లేదా "Form-8" లేదా "Form-8A" మీద క్లిక్ చేయండి.
5	ఆన్‌లైన్ ఫారం-6,7,8 & 8A దరఖాస్తు స్థితి గురించి తెలుసుకోవటానికి	హోమ్ పేజ్‌లో e-Registration లింక్ క్రింద "Know your Status"
6	పేర్ల తొలగింపు, మీ సేవా కేంద్రాల వద్ద సర్వీసు మరియు దరఖాస్తుల పెండింగ్/తిరస్కరణ, వగైరాలకు సంబంధించిన ఫిర్యాదులను రిజిస్టరు చేయటానికి	హోమ్ పేజ్‌లో "Register Your Complaint" అనే లింక్
7	ఇ-సేవా/మీ సేవా కేంద్రం గురించి తెలుసుకోవటానికి	హోమ్ పేజ్‌లో "Mee Seva Centers" అనే లింక్
8	అసెంబ్లీ నియోజకవర్గాలు/ కౌన్సిల్ నియోజకవర్గాల PDF ఓటర్ల జాబితాలను చూడటానికి/ప్రింట్ చేయటానికి	హోమ్ పేజ్‌లో "PDF Electoral Rolls" అనే లింక్
9	సిట్టింగ్ MLAs/MPs/MLCs యొక్క అఫిడవిట్లను చూడటానికి	హోమ్ పేజ్‌లో "Affidavits" అనే లింక్
10	విద్యార్థుల నమోదుకు సంబంధించిన సూచనలను చూడటానికి	హోమ్ పేజ్‌లో "Students' enrollment" అనే లింక్
11	విదేశాలలో ఉన్న ఓటర్ల (NRIs) నమోదు కొరకు దరఖాస్తు చేయటానికి	"ECI Home Page" అనే లింక్ మీద క్లిక్ చేసి, "National Voters Service Portal (NVSP)"ని సెలెక్ట్ చేయండి
12	జాతీయ ఓటర్ల దినోత్సవం వివరాలు తెలుసుకోవటానికి	హోమ్ పేజ్‌లో "National Voters Day" అనే లింక్
13	ఎన్నికల చట్టాలు మరియు హ్యాండ్‌బుక్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవటానికి	హోమ్ పేజ్‌లో "Election Laws & Handbooks" అనే లింక్
14	C.E.O. యొక్క E-Mail ID	ceo-telanganaeci.gov.in

ఓటర్ల జాబితా, 2018 యొక్క ఇంటెన్సివ్ రివిజన్:

ఓటర్ల జాబితాలోని లోపాలను సరిచేయటానికి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలు కలిగిన 36 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్ల జాబితా యొక్క ఇంటెన్సివ్ రివిజన్ 2017లో చేపట్టబడినది. ట్యాబ్లెట్ PC ని ఉపయోగిస్తూ బూత్ స్థాయి అధికారులచే ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో ప్రతి ఇంటిని సందర్శించి పరిశీలన చేపట్టబడినది. డాటాబేస్ నుండి సంబంధిత డాటాను పొందేందుకు మరియు తప్పొప్పులను సరిచేయటానికి లేదా తాజా డాటాను ఎంట్రీ చేయటానికి ఒక వెబ్ ఆధారిత దరఖాస్తు ఇవ్వబడినది. సేకరించబడిన డాటా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయబడినది.

భారత ఎన్నికల సంఘం 25 జనవరి 2011 నుండి తన వ్యవస్థాపక దినోత్సవమైన 25 జనవరిని ప్రతియేటా జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నది. "ఎన్నికలలో పాల్గొనటం" అనే ఇతివృత్తంతో 25 జనవరి 2018న 8వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకోబడుతున్నది. భారత ప్రజాస్వామ్య ఘనతను పెంపొందించుటకు మరియు సార్వత్రిక వయోజన ఓటు హక్కును పరిపూర్ణం చేయుటకై ఈ సందర్భాన్ని వినియోగించుకోవడం ద్వారా ఓటర్ల నమోదును పెంచడమే ఈ సంఘం ఉద్దేశ్యం.

తెలంగాణ రాష్ట్రంలో 31,253 పోలింగ్ స్టేషన్లను పరిధిలోకి తెస్తూ 24,736 పోలింగ్ స్టేషన్ ప్రదేశాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేయబడినవి. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో నూతనంగా రిజిస్టరైన ఓటర్లు లోగో గల బ్యాడ్జి మరియు "ఓటరుగా గర్వించండి- ఓటేసేందుకు సిద్ధంకండి" అనే నినాదంతోపాటు కొత్త PVC (కలర్) EPIC (ఓటరు కార్డు)తో సన్మానించబడతారు.

విద్యార్థులకు / మహిళలకు పోటీలు

నేడు అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద విద్యార్థుల కొరకు - జూనియర్ స్థాయి (ఉన్నత పాఠశాల వరకు) మరియు సీనియర్ స్థాయి (ఉన్నత పాఠశాలలకు మించి) (i) వక్తృత్వంలో మరియు (ii) వ్యాసరచనలో మరియు (iii) మహిళల కొరకు రంగోలీలో పోటీలు నిర్వహించబడినవి. అన్ని స్థాయిలలో విజేతలకు మరియు పాల్గొన్న వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేయబడతాయి.

అంతేకాక, విద్యార్థుల కొరకు జాతీయ స్థాయి క్విజ్ పోటీ నిర్వహించబడింది. దిగువ తెలిపిన విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం నుండి రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేయబడ్డారు మరియు న్యూఢిల్లీలో సౌత్‌జోన్ రౌండ్‌లో పాల్గొన్నారు:

(i) CH. గోపీనాథ్ X వ తరగతి, ZPSS, ఎర్రుపాలెం, ఖమ్మంజిల్లా

(ii) P. స్వాతి, IX వ తరగతి, నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్, మధిర, ఖమ్మం జిల్లా.

ఆన్‌లైన్‌లో నమోదు సౌకర్యము

ఓటరు నమోదును పౌరులకు అత్యంత అనువుగా ఉంచేందుకు దరఖాస్తుదారుని ఇంటి వద్ద నుండే లేదా రాష్ట్రంలోని ఎట్టి మారుమూల ప్రదేశంలోని సమీప నెట్‌కెఫె/ ఇ-సేవ/మీ-సేవ/ పౌర సేవల కేంద్రాలనుండైనా ఓటరు నమోదు/దిద్దుబాట్లు/తొలగింపులు చేసుకొనేందుకు CEO యొక్క వెబ్‌సైట్ (http://www.ceotelangana.nic.in) నందు అవకాశం కల్పించబడినది. 75% పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయి. మిగతా దరఖాస్తులు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు భౌతికంగా ఇవ్వబడ్డాయి.

ఓటరు అక్షరాస్యత క్లబ్‌లు

పాఠ్య ప్రణాళికేతర విధానాల ద్వారా భవిష్యత్ మరియు కొత్త ఓటర్లను పాల్గొనేట్లు చేసేందుకు నియత విద్యా వ్యవస్థ పరిధిలోలేని విద్యా సంస్థలు మరియు కమ్యూనిటీలలో ఓటరు అక్షరాస్యత క్లబ్‌లను (ELCs) నెలకొల్పాలని సంఘం ఆదేశించింది. ELC ల మొదటి బ్యాచ్ 8వ NVD, అనగా 25 జనవరి 2018న ప్రారంభించబడుతుంది. ఓటరు నమోదు, ఎన్నికల పూర్తి, ప్రక్రియ మరియు సంబంధిత విషయాల గురించి లక్షిత జనాభాకు అవగాహనను కల్పించటమే ఈ ELC ల ధ్యేయం.

NVD ప్రతిజ్ఞ

నేడు, NVD ప్రతిజ్ఞ విద్యా సంస్థలు/ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో చేపట్టబడుతుంది. ఈ ప్రతిజ్ఞ పోలింగ్ కేంద్రం, అసెంబ్లీ నియోజకవర్గం వద్ద (జిల్లా మరియు రాష్ట్ర స్థాయి) NVD ఫంక్షన్లలో హాజరయ్యే పౌరులందరితో కూడా చేయించబడుతుంది.

భారతదేశ పౌరులమయిన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము.





CEO సందేశం

ప్రియమైన పౌరులారా !

మన దేశం రాజ్యాంగపరంగా గణతంత్ర దేశంగా అవతరించడానికి కేవలం ఒక రోజు ముందు అనగా 25 జనవరి 1950న రూపుదిద్దుకున్న ఒక ప్రఖ్యాత ఇనిస్టిట్యూషన్ అయిన భారత ఎన్నికల సంఘం యొక్క వ్యవస్థాపక దినోత్సవం నేడే. NVD ప్రతి భారతీయ ఓటరు యొక్క సాధికారతకు అంకితం చేయబడినది. ప్రతి యువ భారతీయుడు ఓటరుగా నమోదుకావాలనే నిబద్ధతను పాటించడం మరియు మతం, జాతి, కులం, కమ్యూనిటీ, భాష, ప్రాంతానికి అతీతంగా లేదా ప్రలోభాలకు గురికుండా ప్రతి ఎన్నికలో ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ రోజు గుర్తుకు తెస్తున్నది. ఈ ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, ప్రపంచంలో అతిపెద్ద మరియ అత్యంత ప్రభావశీల ప్రజాసామ్యంలో భాగస్వాములయిన పౌరులందరికి మరియు కొత్తగా నమోదయిన ఓటర్లందరికి నేను శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

సగర్వంగా నేను ప్రకటించునదేమనగా ట్యాబ్లెట్ డివైస్‌లను ఉపయోగిస్తూ ఇంటెన్సివ్ రివిజన్‌ను నిర్వహించుట ద్వారా అర్బన్ మున్సిపల్ బాడీస్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టబడుట ఒక ప్రత్యేకమైనది మరియు సాహసోపేతమైన చర్య. బూత్‌స్థాయి అధికారులు ప్రతి ఓటరు ఉన్న ప్రదేశముతో సహా (iat.long) వివరములను నమోదు చేయటానికి ఓటర్ల యొక్క ప్రతి ఇంటిని సందర్శించారు. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలలో ఇలాంటి చర్యలను చేపట్టడం దేశంలోనే ప్రప్రథమం. ఓటర్ల జాబితాలో భారీ ప్రక్షాళన మరియు పౌరుల సాధికారతకు ఈ చర్యలు సత్ఫలితాలిచ్చినవి.

ఎనిమిదవ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జరిగే సంబరాలు అసెంబ్లీ నియోజకవర్గం మరియు జిల్లా ప్రధాన కార్యాలయాలతోపాటు అన్ని 24,736 పోలింగ్ స్టేషన్ కేంద్రాలలో జరుగుతున్నాయి. ఫారాలు (6,7, 8 & 8A) పంపిణీ కొరకు మరియు సదరు కేంద్రాల వద్ద భర్తీ చేసిన దరఖాస్తుల స్వీకరణ కొరకు అన్ని పోలింగ్ స్టేషన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయబడినవి. నేటి జాతీయ ఓటర్ల దినోత్సవ సంబరాలలో పాల్గొనాలని పౌరులందరికీ నేను విజ్ఞప్తి చేస్తునాను.

మన దేశం యొక్క ప్రజాస్వామ్య సాంప్రదాయాలను ఇనుమడింపజేయటానికి మరియు మతం, జాతి, కులం, కమ్యూనిటీ, భాషకు అతీతంగా లేదా ఎట్టి ప్రలోభానికి గురికాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొనే నిబద్ధతను పాటించాలని జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ పూనవలసినదిగా పౌరులందరికీ నేను విజ్ఞప్తి కూడా చేస్తున్నాను.

అనూప్ సింగ్, IFS
ప్రధాన ఎన్నికల అధికారి (FAC), తెలంగాణ

ఎలక్టొరేట్ / ఓటర్లు

మున్సిపల్ కార్పొరేషన్లతో కూడిన తెలంగాణ రాష్ట్రంలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలలో 1-1-2018ను అర్హతా తేదీగా పేర్కొని ఓటర్ల జాబితా యొక్క ప్రత్యేక సవరణ చేపట్టబడింది మరియు తుది జాబితా 20-1-2018న ప్రచురించబడింది. 1-1-2018ని అర్హతా తేదీగా పేర్కొని ఓటర్ల జాబితా సవరణ యొక్క ప్రత్యేక సంగ్రహం క్రింద మిగిలిన 83 అసెంబ్లీ నియోజక వర్గాలలోని ముసాయిదా ఓటరు జాబితాలు 23-1-2018న ప్రచురించబడినవి. పైన తెలిపిన ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్ల మరియు పోలింగ్ స్టేషన్ల వివరాలు దిగువతెలిపిన విధంగా ఉన్నాయి.

జిల్లాల సంఖ్య	31
పార్లమెంటరీ నియోజకవర్గాల సంఖ్య	17
అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య	119
పోలింగ్ స్టేషన్ల సంఖ్య	31,253

ప్రచురణ తేది	23-1-2018 (83 అసెంబ్లీ నియోజక వర్గాలు -SSR, 2018 క్రింద ముసాయిదా జాబితా)	20-1-2018 (36 అసెంబ్లీ నియోజక వర్గాలు -IRER, 2018 క్రింద తుది జాబితా)	మొత్తం (టి.యస్)
సాధారణ ఓటర్ల సంఖ్య	1,54,55,451	95,05,786	2,49,61,237
పురుషులు	77,27,162	49,34,319	1,26,61,481
మహిళలు	77,27,076	45,69,924	1,22,97,000
మూడవ వర్గం	1,213	1,543	2,756

ఓటరు ఐడిని ఎలా పొందాలి?

ఇ-సేవ/మీ-సేవ/పౌర సేవల కేంద్రాల ద్వారా కలర్ PVC/ బ్లాక్ అండ్ వైట్ EPIC లను (ఓటరు కార్డులు) మూల్యం చెల్లింపుపై ఓటర్లకు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఎలక్టోరల్ ఆఫీసుల ద్వారా ఉచితంగా లభ్యమయ్యే సాధారణ సేవలతోపాటు, కొత్త కార్డు పొందాలనుకుంటున్న లేదా తమ కార్డును పోగొట్టుకున్న ఓటర్లు ఈ కేంద్రాల నుండి వాటిని పొందవచ్చును.


ఫారం-6ను వాడండి
18సం॥లు పూర్తయిన లేదా ఓటరుగా ఇతర నియోజకవర్గంలో నమోదైన వారు ఇటీవలి ఫోటో, వయస్సు రుజువు ధృవీకరణ పత్రం లేదా తల్లిదండ్రులు నిరక్షరాస్యులు అయినచో వారి నుండి డిక్లరేషన్‌తో దరఖాస్తు చేయండి

ఫారం-7ను వాడండి
ఇతర ఓటర్ల (మరణించిన/ షిఫ్ట్అయిన) పేర్లను తొలగించుటకు

ఫారం-8Aను వాడండి
అదే నియోజకవర్గంలో మరొక పోలింగ్ ప్రదేశానికి మారినట్లైతే

ఫారం-8ను వాడండి
ప్రస్తుతమున్న జాబితాలోని ఎంట్రీలను సరిచేసుకొనుటకు (తప్పుడు ఫోటో/పేరు/ ఆద్యక్షరాలు, తండ్రి/భార్య లేదా భర్త పేరు వగైరా లాంటి ఇతర వివరాలు)

జాతీయ ఓటర్ల దినోత్సవం 25 జనవరి 2018



సంప్రదించండి

ఫారాలు పొందడం / దాఖలు చేయడం మరియు ఫోటో ఓటర్ల జాబితాల్లో పేర్లను తనిఖీ చేసుకొనుటకు బూత్ స్థాయి అధికార్లు (BLOలు)/ తహసీలుదారు/ మండల/ RDO కార్యాలయాలను మరియు www.ceotelangana.nic.in వద్ద ఫారాలు పొందండి మరియు జాబితాల్లో పేర్లను తనిఖీ చేసుకోండి. ఇప్పటికే నమోదైనట్లైతే EPICని పొందుటకు e- సేవ/మీ-సేవ/AP ఆన్‌లైన్ కేంద్రాలను సంప్రదించండి.

ఓటరు గుర్తింపు కార్డు వలన ఇతర ప్రయోజనాలు:

నివాస ఫోటో ID రుజువు: బ్యాంక్ ఖాతా తెరవడం/ పాస్‌పోర్టు/ డ్రైవింగ్ లైసెన్స్/ PAN కార్డు/ విద్యా సంస్థల్లో ప్రవేశాలు/ మొబైల్ కనెక్షను పొందడానికి వీలు కల్పిస్తుంది.



భారత ఎన్నికల సంఘం
నిర్వాచన సదన్, అశోకా రోడ్, న్యూఢిల్లీ-110001
వెబ్‌సైట్: www.eci.nic.in

అనూప్ సింగ్, IFS
ప్రధాన ఎన్నికల అధికారి (FAC), తెలంగాణ
H-బ్లాక్, సచివాలయం, హైదరాబాద్-500022

వివరాలకై కాల్‌చేయండి **1950**
(ఉ. 8 గం. నుండి రా 8 గం.లు, టోల్ ఫ్రీ)

సైబర్ నేరస్థుల కొత్త ఎత్తుగడ

• విదేశాలకు వెళ్తున్న వారే లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: తప్పుడు సమాచారం ఇచ్చారని బెదిరించడం ద్వారా.. విదేశాలకు వెళ్తున్న భారతీయులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్ల ముఠా భారీగా వసూళ్లకు పాల్పడుతోంది. ఇమ్మిగ్రేషన్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మించి రూ.లక్షల్లో లూటీ చేస్తున్న ఈ ముఠా వ్యవహారాలపై సింగపూర్, మలేసియాల్లో కేసులు నమోదయ్యాయి. ఆయా దేశాల పోలీసులు ఇంటర్‌పోల్ ద్వారా కేంద్ర హోంశాఖను ఆశ్రయించడంతో తెలుగు రాష్ట్రాల్లోనూ దర్యాప్తు మొదలైంది.

హైదరాబాద్‌కు చెందిన అవినాశ్ ఉద్యోగం పనిపై ఇటీవల సింగపూర్ వెళ్లారు. వారం తర్వాత అతనికి భారత్ నుంచి వచ్చిన ఒక ఫోన్‌లో తాము ఇమ్మిగ్రేషన్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామనీ, సింగపూర్ వెళ్లేటప్పుడు సమర్పించిన వ్యక్తిగత వివరాల్లో తప్పులు ఉన్నాయనీ, ఇది తీవ్రమైన నేరం కాబట్టి వెంటనే తిరిగొచ్చి సమాధానం ఇవ్వాలన్నది దాని సారాంశం. ఒకవేళ సమాధానం ఇవ్వకపోతే పాస్‌పోర్టు రద్దు చేస్తామనీ, వీసా కూడా రద్దు చేయాలని సింగపూర్ ప్రభుత్వానికి లేఖ రాస్తామని హెచ్చరించారు. తక్షణం రావడం సాధ్యంకాదనీ, సమయం కావాలని అవినాశ్ కోరారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవచ్చునీ, అందుకు అవసరమైన డబ్బు చెల్లిస్తే సరిపోతుందని అగంతకులు చెప్పడంతో అవినాశ్ రూ.3 లక్షలు సమర్పించుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఇమిగ్రేషన్ అధికారులను సంప్రదించారు. తామెప్పుడూ అలా ఫోన్ చేయమని, సదరు వ్యవహారంతో తమకు సంబంధం లేదని వారు తేల్చి చెప్పడంతో అవినాశ్ సింగపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సింగపూర్ పోలీసులు ఇంటర్‌పోల్ ద్వారా భారత ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇలాంటి కేసులు దాదాపు 15 వరకూ వచ్చాయని తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన అవినాశ్ పాస్‌పోర్టు వివరాలు, అతని సింగపూర్ ఫోన్ నెంబరు నేరగాళ్లకు ఎలా తెలిసిందన్న దానిపై ఇక్కడి పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ ముఠా మనుషులు హైదరాబాద్‌లోనూ ఉండి ఉండొచ్చనీ, విదేశాలకు వెళుతున్న వారి వివరాలు చాకచక్యంగా తస్కరిస్తూ ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫోన్ చేయరు

ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎప్పుడూ ఈ తరహా ఫోన్లు చేయరని, తప్పుడు సమాచారం ఇచ్చి ఉంటే విదేశాలకు వెళ్లే ముందే ఆపివేస్తారని పోలీసులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరికైనా ఇలాంటి ఫోన్లు వస్తే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు.

గుండెపోటుతో మోహన్‌రెడ్డి బాధితుడి మృతి

ఇల్లు దక్కలేదన్న మనస్తాపంతోనేనని కుటుంబ సభ్యుల ఆరోపణ



ముజీబ్ (దాచిన చిత్రం)

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు వడ్డీ సహా చెల్లించినప్పటికీ తన ఆస్తి తిరిగి ఇవ్వడం లేదని మనస్తాపానికి గురైన మోహన్‌రెడ్డి బాధితుల్లో ఒకరు గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. . కరీంనగర్‌కు చెందిన ఎం.డి.ముజీబ్(45) గోదాంగడ్డలోని తన ఇంటిని 2005లో ఏఎస్సై మోహన్‌రెడ్డి వద్ద తనఖా ఉంచి రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2006 నాటికి వడ్డీ రూ.3 లక్షలతో కలిపి రూ.8 లక్షలు ముట్టజెప్పి ఆస్తి పత్రాలు ఇవ్వాల్సిందిగా కోరాడు. అడ్డం తిరిగిన మోహన్‌రెడ్డి మరో రూ.10 లక్షలు ఇస్తేనే పత్రాలు ఇస్తానంటూ సదరు ఇంటిని స్వాధీనం చేసుకున్నాడు. తన బినామీ నిమ్మ మాలతి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. మోహన్‌రెడ్డి అక్రమాలు వెలుగులోకి వచ్చిన తర్వాత తనకు జరిగిన అన్యాయంపై ముజీబ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు ప్రస్తుతం విచారణలో ఉంది.

ఈ పరిణామాల అనంతరం కుంగిపోయిన ముజీబ్ భార్య, ముగ్గురు పిల్లలతో హైదరాబాద్ చేరుకున్నాడు. కుమారుడు మరణించడంతో ఏడాది కిందట తిరిగి కరీంనగర్ వచ్చి ప్రస్తుతం సప్తగిరి కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఇల్లు తనకు దక్కుతుందో లేదోనన్న మనస్తాపంతో మంచం పట్టిన భర్త మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇంటిని తిరిగి దక్కించుకోవడమే తన చివరి కోరిక అని ముజీబ్ తరచూ చెప్పే వాడని, దాని కోసం మోహన్‌రెడ్డి బాధితుల సంఘం పోరాడుతుందని సంఘం అధ్యక్షుడు ముస్కు మహేందర్‌రెడ్డి' బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'గాంధీ'లో నేడు సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రి స్త్రీ సంబంధ వైద్య విభాగం ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన సంతాన సాఫల్య కేంద్రాన్ని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ తరహా కేంద్రాన్ని ప్రారంభించడం ఇదే తొలిసారి అని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

రూ.85 కోట్ల నిషేధిత టర్కీ కరెన్సీ పట్టివేత!

ఉప్పల్, న్యూస్‌టుడే: టర్కీ దేశంలో నిషేధించిన కరెన్సీని మార్చేందుకు ప్రయత్నించిన ముఠాను మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నలుగురు సభ్యుల ముఠా నుంచి పెద్దమొత్తంలో ఈ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్‌కు చెందిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ కోరకుప్పల లక్ష్మణ్(48), వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్ కొల్లోజు రాజశేఖర్(25), సిదిపేట జిల్లా దౌల్తాబాద్‌కు చెందిన ఐత శ్రీనివాస్(35), కర్నూలుకు చెందిన ఎస్కే నూర్ మహ్మద్(28) కలిసి ముఠాగా ఏర్పడ్డారు. టర్కీ దేశంలో కొన్నేళ్ల క్రితం నిషేధించిన లీరా(కరెన్సీ)ని పట్టుకొని మార్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ముఠా ఉప్పల్‌కు వచ్చినట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి టర్కీ నిషేధిత కరెన్సీ 100 నోట్లను, 4 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ దేశంలో ఒక్కో నోటు విలువ రూ.5 లక్షలు ఉంటుంది. అదే మన రూపాయలలో అయితే ఒక లీరా రూ.17 వరకు ఉంటుంది. వీటి విలువ సుమారురూ. 85కోట్ల వరకు ఉంటుంది. ముఠా సభ్యులను ఉప్పల్ పోలీసులకు అప్పగించారు.

అవినీతి అధికారి ఆస్తులు రూ.8 కోట్లు

• అనిశా డిప్యూటీ డైరెక్టర్ టి.సుదర్శన్‌గౌడ్ వెల్లడి

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు పట్టుబడిన అధికారి ఆస్తుల విలువ సుమారు రూ.8 కోట్లకు చేరింది. బుధవారం వరకు కరీంనగర్, జగిత్యాల జిల్లాలో తనిఖీలు చేశామని, హైదరాబాద్‌లోని బ్యాంకు ఖాతాలు, ఒక లాకర్‌లో సోదాలు చేయాల్సి ఉందని అనిశా డిప్యూటీ డైరెక్టర్ టి.సుదర్శన్‌గౌడ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మూసివేసిన (సీజ్) వాటర్‌ప్లాంట్‌కు అనుమతి ఇవ్వడానికి నిర్వాహకుని వద్ద నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం ఆర్మూర్



బ్యాంకు లాకర్‌లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు

ఆర్డీవో బాలె శ్రీనివాస్ అనిశా అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే.. మంగళవారం కరీంనగర్‌లోని ఆయన బంధువుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించి బొమ్మకల్‌లోని గృహం, ఓ అపార్ట్‌మెంటులో ఫ్లాట్, భగత్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంటులో ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించారు. జగిత్యాలలో మూడు అపార్ట్‌మెంట్లు ఉన్నట్లు, రాయికల్ మండలం అల్లిపూర్‌లో ఇళ్లు, రూ.2.85 లక్షల నగదు గుర్తించారు. బుధవారం కరీంనగర్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న లాకర్‌ను తెరవగా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.21లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించిన పత్రాలు, 17 తులాల బంగారు ఆభరణాలు, బ్యాంకులో రూ.1.34 లక్షల నగదు లభ్యమయ్యాని అనిశా డిప్యూటీ డైరెక్టర్ టి.సుదర్శన్‌గౌడ్ తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో 2వేల గజాల స్థలాలు, దిల్‌సుఖ్‌నగర్, బోడుప్పల్‌లో ఫ్లాట్లు ఉన్నట్లు తెలిసిందన్నారు. హైదరాబాద్‌లోని కాకతీయ గ్రామీణ బ్యాంకులో మరో లాకర్, 13 బ్యాంకుల ఖాతాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం వరకు ఆర్డీవో బాలె శ్రీనివాస్‌కు సంబంధించిన సుమారు రూ. 8కోట్ల ఆస్తులు గుర్తించినట్లు చెప్పారు.

గజల్ శ్రీనివాస్‌కు షరతులతో బెయిలు.. విడుదల

• నిర్దోషిగా బయటపడుతానని వెల్లడి

ఆబిడ్స్, చంచల్‌గూడ, న్యూస్‌టుడే: లైంగిక వేధింపుల కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైలులో ఉన్న గజల్ శ్రీనివాస్‌కు బుధవారం నాంపల్లి న్యాయస్థానం షరతులతో బెయిలు మంజూరు చేసింది. ఈ కేసులో ఏ-2 నిందితురాలు పార్వతికి కూడా ముందస్తు బెయిలిచ్చింది. శ్రీనివాస్‌కు బెయిలు మంజూరు చేయాలంటూ ఆయన తరఫు న్యాయవాది వేసిన పిటిషన్‌పై బుధవారం పలుమార్లు విచారణ జరిగింది. ఆయనకు బెయిలు ఇవ్వొద్దంటూ పంజాగుట్ట పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఇంకా చాలామందిని విచారించాల్సి ఉందని, నిందితుడికి బెయిలిస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని పోలీసుల తరఫు న్యాయవాది వాదించారు. ఎ-2 నిందితురాలు పార్వతిని ఎందుకు అరెస్టు చేయలేదంటూ న్యాయమూర్తి ప్రశ్నించగా.. పరారీలో ఉన్నందున అరెస్టు చేయలేకపోయామని న్యాయవాది విన్నవించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఆయనకు బెయిలు మంజూరు చేశారు. ప్రతి బుధ, ఆదివారాల్లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలంటూ షరతు విధించారు. రూ.10 వేల పూచీకత్తు సమర్పించాల్సిందిగా ఆదేశించారు. అలాగే పార్వతి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పైనా విచారణ జరిపిన న్యాయస్థానం ఆమెకూ బెయిలు మంజూరు చేసింది. బుధవారమే జైలు నుంచి విడుదలైన గజల్ శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటపడతానన్నారు. అభిమానుల ఆశీర్వాదం తనకు ఉందన్నారు.

పని ప్రదేశాల్లో సురక్షిత పద్ధతుల్ని పాటించాలి

• కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి గోయెల్

ఈనాడు, హైదరాబాద్: పని ప్రదేశాల్లో ప్రమాదాల్ని పరిహరించేందుకు సురక్షిత పద్ధతుల్ని పాటించాలని తెలంగాణ కార్మిక, ఉద్యోగిత, శిక్షణ, కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి డా.శశాంక్ గోయెల్ సూచించారు. బల్క్‌డ్రగ్ ఉత్పత్తి, అత్యవసర పరిస్థితులు.. అంశంపై బుధవారం ప్రారంభమైన రెండు రోజుల కార్యశాలలో ఆయన మాట్లాడారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణల గురించి వివరించారు. పని ప్రదేశాల్లో సురక్షిత పద్ధతులు అనుసరించాలనీ, ప్రమాదకర రసాయనాలతో పని చేసేటప్పుడు నియంత్రణల్ని పాటించాలని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా హాజరైన సువెన్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ఛైర్మన్, సీఈవో వెంకట్‌జాస్తి మాట్లాడుతూ.. కార్మికుల్లో సురక్షిత చైతన్యాన్ని నెలకొల్పాలన్నారు. దీనిపై అవగాహన పెంచేందుకు హెల్పర్లు, ఒప్పంద కార్మికుల స్థాయి నుంచే శిక్షణ కార్యక్రమాల్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కర్మాగారాల్లో కనీసం రెండు వారాలైనా ఈ అంశంపై కార్యక్రమాల్ని నిర్వహించాలన్నారు. తెలంగాణ కర్మాగారాల శాఖ సంచాలకులు పి.ఎం.చంద్రమోహన్ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు పలు పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు క్రియాశీలంగా పాల్గొనేలా చేయడం ద్వారా తమ శాఖ సురక్షిత సంస్కృతిని వ్యాప్తి చేస్తోందన్నారు. కార్యశాల సందర్భంగా వార్షిక సురక్షిత కాలమానిని ఆవిష్కరించినట్లు కర్మాగారాల సంయుక్త ముఖ్య ఇన్‌స్పెక్టర్ బి.రాజగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కర్మాగారాల శాఖ, జాతీయ సురక్షిత మండలి సంయుక్తంగా.. డా.రెడ్డీస్ లేబరేటరీస్ లిమిటెడ్‌లోని లీడర్‌షిప్ అకాడమీలో నిర్వహించిన కార్యశాలలో తెలంగాణలోని పలు బల్క్‌డ్రగ్ పరిశ్రమలకు చెందిన సుమారు 207 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యశాల ప్రారంభం సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి శశాంక్‌గోయెల్, చిత్రంలో ఆ శాఖ సంచాలకులు చంద్రమోహన్, సువెన్‌లైఫ్‌సైన్సెస్ సంస్థ ఛైర్మన్,సీఈవో వెంకట్ జాస్తి తదితరులు

గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ శిక్షణ: రామన్న

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: బీసీ గురుకుల విద్యార్థులకు ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల కోసం శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ(బీసీ గురుకులం)లో బుధవారం జాతీయ స్థాయి పరీక్షలకు శిక్షణ అందించేలా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మరో 119 గురుకులాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అనితరాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'బతుకమ్మ'లో మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల సాయం

ఈనాడు, హైదరాబాద్: గత సెప్టెంబరులో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో మహాబతుకమ్మ ఉత్సవాలకు వచ్చి ప్రమాదవశాత్తు మృతి చెందిన సూర్యాపేట జిల్లా నూతనకల్‌కు చెందిన గుండ్లపల్లి సృజన కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, తెలంగాణ జాగృతి రూ.5 లక్షల చొప్పున ఈ సాయాన్ని ఇచ్చారు. రూ.10 లక్షల మొత్తాన్ని సృజన కుమారుడు, కుమార్తెల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షులు మేడే రాజీవ్‌సాగర్ బుధవారం హైదరాబాద్‌లో సృజన తండ్రి సూర్యనారాయణ, కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జాగృతి నేతలు నవీన్ ఆచారి, రంగినేని ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కవిత చొరవ వల్లనే ఆర్థిక సాయం అందిందని సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు 3,485 మందికి అర్హత

ఈనాడు, హైదరాబాద్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకానికి తెలంగాణ నుంచి మొత్తం 3,485 మంది అర్హత సాధించారు. వారిలో చివరకు 2,921 మందిని ఎంపిక చేస్తారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ఈ ఉపకార వేతనానికి ఎంపిక చేస్తారు. నెలకు రూ.500 చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యేవరకు అందజేస్తారు. 192 ఆదర్శ పాఠశాలల నుంచి 1,131 మంది అర్హత సాధించడం గమనార్హం.

ఈనాడు

ఉగ్రభూతానికి కొత్త కోరలు

భారత గణతంత్రంపై గురిపెట్టిన రాక్షసగణ తంత్రాన్ని ఛేదించడం, కసిగా కాటేయడానికి కాచుకొన్న ముష్కర మూకల ఆటకట్టించడం ఏటా భద్రతాబలగాలకు కత్తిమీద సాములా మారింది. ఆగ్నేయాసియా దేశాల అధినేతలంతా గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథులుగా హాజరవుతున్న నేపథ్యంలో- ఇండియాలో అరాచకం సృష్టించడానికి ఉగ్రవాద నిద్రాణకణాల్ని (స్లీపర్ సెల్స్) పొరుగు దేశం ఉసిగొలుపుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. వాటిని ఏమాత్రం తేలిగ్గా తోసిపుచ్చే వీల్లేదని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. 2006-'14 నడుమ కాలంలో అహ్మదాబాద్, ముంబయి, వారణాసి వంటిచోట్ల భయానక బాంబుదాడులకు పాల్పడిన అబ్దుల్ సుభాన్ ఖురేషి ఎట్టకేలకు దిల్లీ పోలీసులకు పట్టుబడటం గొప్ప ఊరట కలిగించేదే అయినా, ఏళ్ల తరబడి పరారీలో ఉన్న కీలక ఉగ్రవాది ఇప్పుడెందుకు దిగబడ్డాడన్న సందేహం ఆందోళన కలిగిస్తోంది. ముంబయి ముట్టడి తరహా దాడులకు ఉగ్రవాదులు తెగబడే ప్రమాదం ఉందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ పలు రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. సరిహద్దుల్లో తన మోర్టారు దాడుల్ని భారత బలగాలు దీటుగా తిప్పికొట్టడంతో పాక్ పంచమాంగ దళాలు అసహనంతో ఊగిపోతున్న వేళ ఇది. గణతంత్ర దినోత్సవానికి సరిగ్గా వారం రోజుల ముందు సరిహద్దు భద్రతా దళ శిబిరాలు, పౌర ఆవాసాలపై విచ్చలవిడి కాల్పులతో పాకిస్థాన్ రెచ్చిపోయింది. భారత్ పాకిస్థాన్ల మధ్య 3,323 కిలోమీటర్ల సరిహద్దు ఉండగా; జమ్మూ-కశ్మీర్లో అంతర్జాతీయ సరిహద్దు 221 కి.మీ., అధీన రేఖ వెంబడి 740 కి.మీ. పరిధిలో అడపాదడపా పాక్ హద్దుమీరుతోంది. నిరుడు సరిహద్దు కాల్పులతో 19మంది జవాన్లను, 12మంది పౌరుల్ని, నలుగురు బీఎస్ఎఫ్ సిబ్బందిని పొట్టన పెట్టుకొన్న పాక్ మళ్ళీ నెత్తుటి నెగళ్లు రాజేయడానికి విశ్వప్రయత్నం చేసింది. కుక్కకాటుకు చెప్పుదెబ్బలా భారత ప్రతిఘటనకు బెంబేలెత్తిన పాక్- ఇంటా బయటా ఒత్తిళ్లు పెరిగే కొద్దీ ఇండియాపై ఉగ్రవాద మిన్నాగుల్ని ఉసిగొల్పుతూనే ఉంటుంది!

జమ్ము, సాంబ, కథువా, రాజౌరి, పూంచ్ జిల్లాల్లోని సరిహద్దు గ్రామాలపై పాక్ సైన్యం జరిపిన కాల్పులు- 1965, 1971 నాటి యుద్ధకాలంలోనూ కనీవినీ ఎరుగని స్థాయిలో ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. 'హమారా జీనా హరామ్ హోగయా హై' (మా జీవనం నరకంలా మారింది) అని మొత్తుకొంటున్న గ్రామీణులు 40వేల మంది కొంపాగోడూ వదిలి బతుకు జీవుడా అని రక్షణ శిబిరాల్లో తలదాచుకోవాల్సిరావడంకన్నా దుర్భరమేముంది? పంటల్ని, పశువుల్ని, ఇళ్లను, కుటుంబ సభ్యుల్ని కోల్పోయి అలమటిస్తున్న నిరుపేదల గోడు గుండెల్ని మెలిపెడుతోంది. సరిహద్దుల్లోని 457 గ్రామాల్లో నాలుగున్నర లక్షలమందికిపైగా జనావళి- ఎప్పుడు ఏ విధంగా మృత్యువు దూసుకొస్తుందోనని బెంగటిల్లుతున్న తరుణంలో- రూ.415 కోట్ల వ్యయంతో 14,460 భూగర్భ బంకర్ల నిర్మాణానికి మోదీ ప్రభుత్వం సమ్మతించింది. పాక్ 'కాల్పుల పరిధి'లో ఉన్న గ్రామాల ప్రజలకు కుటుంబానికి అయిదు మర్లాలు (1,361 చ.అ.) స్థలాన్ని రక్షిత ప్రాంతంలో కేటాయించేదుకు లోగడే భాజపా వాగ్దానం చేసినా- జాతి ప్రయోజనాల దృష్ట్యా గ్రామీణుల తరలింపు సరికాదని మెహబూబా ప్రభుత్వం అసెంబ్లీలో నిరుడు ప్రకటించింది. తమ ప్రాణాలు గాలిలో దీపాలవుతున్నాయన్న గ్రామీణుల గుండె ఘోషకు రాష్ట్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. 2010 తరవాత కీలక సరిహద్దు రాష్ట్రంలో ఉగ్రవాదం ఆ స్థాయిలో జడలు విరబోసుకుందని నిరుడే చెప్పారు! పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు కార్యక్షేత్రంగా మారిన కశ్మీర్లో నిరుడు 56మంది పౌరులు, 215మంది మిలిటెంట్లు, 78మంది భద్రతా సిబ్బంది మృత్యువాతపడ్డారు. కశ్మీర్కోసం వెయ్యేళ్ల యుద్ధానికైనా సిద్ధమంటున్న పాక్ ఏలికల నెత్తుటి దాహం తీరేది కాదని రోజుల తరబడి దాడుల మారణ హోమం రుజువు చేస్తోంది!

కశ్మీరును కబళించడానికి పాకిస్థాన్ పలు అంచెల్లో చేస్తున్న యుద్ధం బహుముఖీనమైనది. భారత్పై ఉగ్రవాద ముద్ర వేసే ఐక్యరాజ్య సమితిలో యాగీ చెయ్యడం ద్వారా అంతర్జాతీయ మద్దతు కూడగట్టడం, ఇండియాపై కత్తికట్టిన ఉగ్రవాద శక్తులకు సమస్త తోడ్పాటు అందించడం, హురియత్ నేతలకు నిధులందించి తన భావజాలాన్ని కశ్మీరీ యువజనంలో వ్యాప్తి చెయ్యడం, 2003 నాటి కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాలరాచి సరిహద్దుల్ని రక్తసిక్తం చెయ్యడం... ఇలా ఎన్నెన్నో చేస్తున్న పాక్ ఏలికల ఎత్తుల్ని చిత్తు చెయ్యడంలో మోదీ ప్రభుత్వం దీటుగా స్పందిస్తోంది. హురియత్ నేతలకు అందుతున్న అక్రమ నిధుల ప్రవాహాల గుట్టు రట్టు చెయ్యడం ద్వారా వాళ్ల ముసుగులు తొలగించడంతోపాటు కేసులు పెట్టడం- పాక్ కౌటిల్యానికి చెంపపెట్టు. 2016లో ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమారిపోయాక ఉద్ధృతంగా ఎగిసిన నిరసనల అగ్గిని సమర్థంగా చల్లార్చడం- మరో మెట్టు! ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అధిపతి దినేశ్వర్ శర్మను అన్ని వర్గాలతో చర్చలకు మధ్యవర్తిగా నియమించడం, తప్పుదారి పట్టిన యువతను జనజీవన స్రవంతిలోకి తీసుకురావడం మెచ్చదగినవే అయినా, ఉగ్రభూతం కొత్త కోరలు దరిస్తున్న వైపరీత్యం కళ్లకు కడుతోంది. కశ్మీర్లో ఆరు ఉగ్రసంస్థలు కొత్తగా కలిసినట్లు భద్రతాదళాల హెచ్చరికలు వెల్లడిస్తున్నాయి. జగమెరిగిన ఉగ్రవాది హఫీజ్ సయీద్ కొత్త పార్టీ పెట్టి ఈ ఏడాది పాక్ పార్లమెంటరీ ఎన్నికల్లో దిగనున్న వాస్తవం మింగుడుపడేది కాదు. 'సయీద్ సర్' అంటూ పాక్ ప్రధానే గౌరవిస్తున్న ఆ ఉగ్రభూతం- తన నిర్బంధం కోసం వస్తున్న అంతర్జాతీయ ఒత్తిళ్లను కోర్టు కేసులతో అడ్డుకోవాలనుకొంటోంది. రేపు అక్కడ ఉగ్రవాదులే గెలిచి, అణ్వాయుధాల్ని అధికారికంగా దక్కించుకొంటే పరిస్థితి ఏమిటన్న కీలకాంశంపైనా ప్రపంచ దేశాల మద్దతుతో ముందస్తు వ్యూహాన్ని మోదీ ప్రభుత్వం సిద్ధం చెయ్యాలి!

తూరుపు వాకిట రజత కాంతులు



పులిపాక సంజయ్

దిల్లీలో ఈ నెల 25, 26వ తేదీల్లో ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్) సమావేశం కానుండటం ఆనవాయితీగా జరిగే వ్యవహారమేనని అనుకుంటే పొరపాటే. పది దేశాల అధినేతలు హాజరవుతున్న ఈ సమావేశం ఆసియా భౌగోళిక, రాజకీయ, ఆర్థిక వ్యవహారాల్లో భారత్ ఒక మూలస్తంభంగా ఎదుగుతోందనడానికి ప్రతీక. భారతదేశం గతంలో అనుసరించిన 'తూర్పు వైపు చూపు', తాజాగా చేపట్టిన 'తూర్పు దిశగా కార్యాచరణ' విధానాలు ఫలిస్తున్నాయనడానికిది సంకేతం. భారత్-ఆసియాన్ల మధ్య సంబంధాలు ఏర్పడి 25 ఏళ్లవుతున్న సందర్భంగా 10 ఆసియాన్ దేశాల అధినేతలు దిల్లీకి వచ్చి ఆనందం పంచుకోనున్నారు. ఆసియాన్ శిఖరాగ్ర సభల భాగస్వామిగా భారత్ చేరి 15 ఏళ్లు, ఉభయుల మధ్య వ్యూహాత్మక సంబంధాలు ఏర్పడి మూడేళ్లు అయిన దృష్ట్యా సంబరం చేసుకోవడానికి వస్తున్నారనీ చెప్పాలి. జనవరి 26న భారత రిపబ్లిక్ దినోత్సవ సంబరాల్లో మొత్తం పది మంది దేశాధినేతలు గౌరవ అతిథులుగా పాలుపంచుకోనుండటం విశేషం.

ఆతిథ్యంలో నూతన ఒరవడి

భారత ప్రభుత్వం ఏటా రిపబ్లిక్ దినోత్సవ కవాతులో గౌరవ అతిథిగా వందనం స్వీకరించడానికి మిత్రదేశ నాయకులను ఆహ్వానిస్తుంది. ఈ వందన స్వీకారానికి గౌరవ అతిథి ఎంపిక ప్రక్రియకు ఎంతో రాజకీయ ప్రాధాన్యం ఉంది. ఉదాహరణకు 2015 సంవత్సర రిపబ్లిక్ కవాతుకు అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా గౌరవ అతిథిగా హాజరయ్యారు. 1950 నాటి కవాతులో అప్పటి ఇండొనేసియా అధ్యక్షుడు సుకర్ణో పాల్గొన్నారు. ఈ ఏడాది ఈ గౌరవం ఒక్కరికి కాకుండా పదిమందికి దక్కనుంది. వీరిలో సింగపూర్ ప్రధాని లీ సియేన్ లూంగ్, ఇండొనేసియా అధ్యక్షుడు జోకో విడోడో, మియన్మార్ నాయకురాలు ఆంగ్‌సాన్ సూకీలూ అంతర్జాతీయంగా విఖ్యాతులు. ఇలాంటివారంతా కలిసి ఒకే ఉత్సవంలో సమాన ఫాయాలో పాలుపంచుకోవడం ఎంతో ప్రాముఖ్యం సంతరించుకొంది. ప్రస్తుతం ఆసియాన్ అధ్యక్ష స్థానాన్ని సింగపూర్ అలంకరిస్తోంది. వీరి ఆగమనానికి ముందు భారత విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ థాయ్‌లాండ్, ఇండొనేసియా, సింగపూర్ దేశాలను సందర్శించారు. ఆసియాన్, భారత్‌ల మధ్య అనేకసార్లు మేధావులు, విధానకర్తల సమావేశాలు, పాత్రికేయుల చర్చలు జరిగాయి. బ్రునై, కాంబోడియా, ఇండొనేసియా, లావోస్, మలేసియా, మియన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం- ఆసియాన్‌లో సభ్యదేశాలు. వీటి మధ్య సహకారం ఆసియాన్‌ను బలీయ ఆర్థిక శక్తిగా నిలుపుతోంది. ఆ సంఘ దేశాల అధినేతలందరినీ సాదరంగా ఆహ్వానించడం ద్వారా ఈ ప్రాంత సుస్థిరత, అభివృద్ధికి భారత్ తన నిబద్ధత చాటుకొంది. గతంలో భారతీయులు తూర్పు, ఆగ్నేయాసియా దేశాలతో, హిందూ మహాసముద్ర తీరంలోని ఆఫ్రికా దేశాలతో వాణిజ్యం నెరపారని చరిత్ర చెబుతోంది. బ్రిటిష్ వలస పాలన వల్ల మొదట ఆ సంబంధాలు తెగిపోయినా తరవాత కొత్త అవకాశాలను ముందుకు తెచ్చింది. భారత్ నుంచి అనేకమంది కార్మికులు, వర్తకులను బ్రిటిష్‌వారు మియన్మార్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు తీసుకెళ్ళారు. మియన్మార్ (బర్మా), ఫిజీల పాలన యంత్రాంగంలో దిగువ, మధ్యశ్రేణి సిబ్బందిగా భారతీయులు పనిచేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఆక్రమణ నుంచి పలు ఆగ్నేయాసియా దేశాలను విముక్తం చేయడానికి బ్రిటిష్ సైన్యంలో భాగంగా లక్షలాది భారతీయ జవాన్లు పోరాడారు. మొత్తం మీద వలస పాలన వల్ల భారత్‌లో పేదరికం తాండవించి, ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలు విచ్ఛిన్నమయ్యాయి. భారత్ నుంచి విదేశీ వాణిజ్యమంతటినీ ఆంగ్లేయులు గుత్తకు తీసుకున్నారు. ఇక దేశ విభజన సృష్టించిన ఆర్థిక, ప్రాణ నష్టాలు ఇంతా అంతా కావు. స్వాతంత్ర్యం వచ్చాక భారత నాయకులు దారిద్ర్య నిర్మూలన పథకాలకు, నవ భారత నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. అమెరికా, సోవియెట్ కూటముల మధ్య రేగిన ప్రచ్ఛన్న యుద్ధంలో ఎవరి పక్షమూ వహించకుండా భారత్ అలీనోద్యమ నిర్మాణానికి నడుం కట్టింది. ప్రచ్ఛన్న యుద్ధం పరిసమాప్తమయ్యాక బయటి ప్రపంచంతో సుదృఢ సంబంధాలను ఏర్పరచుకోసాగింది. 1980లు, 1990లలో ఆర్థిక సంక్షోభాలు సంభవించడంతో విధాన సరళీకరణ ద్వారా కొత్త అవకాశాల అన్వేషణ ముమ్మరమైంది. భారత ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలతోపాటు, 1992లో తూర్పు వైపు చూపు విధానాన్నీ ప్రారంభించారు. భారత్ ఎంతసేపటికీ పశ్చిమాసియా, పాశ్చాత్య దేశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తోందని, ఇక నుంచి తూర్పు ఆసియా దేశాలతోనూ ఆర్థిక బంధాన్ని బలపరచుకొంటేనే స్థిరంగా ప్రగతి సాధిస్తుందని పీవీ భావించారు. జపాన్, దక్షిణ కొరియా తదితర తూర్పు ఆసియా దేశాలు భావి ఆర్థిక చోదక శక్తులుగా వర్ధిల్లుతాయన్న పీవీ అంచనా నూటికి నూరుపాళ్లూ నిజమైంది. ఆయన తరవాత వచ్చిన ప్రధానమంత్రులూ తూర్పు వైపు చూపు విధానాన్ని కొనసాగించారు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టాక ఈ విధానంలో మలి అడుగు కింద తూర్పు దిశగా కార్యాచరణ విధానాన్ని చేపట్టి, తూర్పు ఆసియా దేశాలతో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలను, అనుసంధానాన్నీ విస్తరించసాగారు. నేడు 16 భారతీయ నగరాలకు, సింగపూర్‌కు మధ్య ప్రతి వారం 484 విమాన ప్రయాణాలు సాగుతున్నాయంటే వ్యాపార, వ్యక్తిగత సంబంధాలు ఏ స్థాయిలో విస్తరిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకూ విమానాల సంఖ్య పెరుగుతోంది. 2012లో భారత్-ఆసియాన్ వాణిజ్యం 1,000 కోట్ల డాలర్లు. 2016-17లో అది 7,000 కోట్ల డాలర్లకు పెరిగింది. వియత్నాం వంటి ఆసియాన్ దేశాలకు చమురు అన్వేషణలో భారత్ తోడ్పడుతోంది. ఇటీవలి కాలంలో చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పుడు ఈ తరహా సంబంధాలు అనుకున్నంత వేగంగా పెరగలేదు. ఇప్పుడు మళ్ళీ ధరలు పెరుగుతున్నందువల్ల చమురు అన్వేషణలో భారత్ మరింత చురుగ్గా భాగస్వామ్యం వహించనుంది. 2008 ఆర్థిక సంక్షోభం తరవాత ఇతర దేశాల నుంచి చైనా దిగుమతి చేసుకునే ముడిసరకుల పరిమాణం కుంగి వాటి ధరలూ తగ్గిపోయాయి. ఫలితంగా ఆసియాన్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే బొగ్గు దిగుమతుల విలువ కూడా తగ్గి, ద్వైపాక్షిక వ్యాపార విలువ క్షీణించడానికి కారణమైంది. అయినప్పటికీ 2016-17 ఆసియాన్-భారత్‌ల మధ్య 7,000 కోట్ల డాలర్ల మేరకు వాణిజ్యం జరగడం చిన్న విషయం కాదు. ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్సెప్)లో భారత్‌కు తోడుగా ఆసియాన్ దేశాలూ చేరితే మొత్తం వాణిజ్యం 10,000 కోట్ల డాలర్లకు, ఆపై 20,000 కోట్ల డాలర్లకు చేరినా ఆశ్చర్యం లేదు.



భారత్-ఆసియాన్... పాతికేళ్ల మైత్రీబంధం

బహుముఖ సహకారం

ప్రస్తుతం ఆసియాలో చైనా, జపాన్, ఆసియాన్, భారత్‌లు ప్రధాన శక్తులుగా ఉన్నాయి. ఇక్కడ అమెరికా ప్రాబల్యం మొదటి నుంచీ ఉన్నదే. చైనా దూకుడుకు పోటీగా అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియాల చతుర్భుజ కూటమి రూపుదిద్దుకొంటున్న సంగతి తెలిసిందే. ఆసియాన్ సభ్యదేశమైన వియత్నామ్‌కు భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఎగుమతి చేయడానికి, ఆ దేశ ఫైటర్ విమాన పైలట్లకు శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. వియత్నామ్‌తోపాటు సింగపూర్, థాయ్‌లాండ్, మలేసియా, ఇండొనేసియా దేశాలతోనూ భారత నౌకాదళం సమన్వయం కనబరుస్తోంది. భద్రతా వ్యవహారాల్లో ఆసియాన్ దేశాలన్నీ ఒకే కూటమిగా వ్యవహరించడం లేదు. కాంబోడియా, లావోస్‌లు చైనాకు చాలా సన్నిహితం. థాయ్‌లాండ్ అమెరికా మిత్రదేశమే అయినా ఇటీవల చైనాకు దగ్గరవుతోంది. దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్ నిర్మించిన కృత్రిమ దీవులపై వియత్నాం మాదిరిగా మొదట్లో నిరసన వ్యక్తీకరించిన ఫిలిప్పీన్స్, ఈమధ్య చైనా విషయంలో కొంత మెత్తబడుతున్న సూచనలు కనిపించాయి. ఆసియాన్‌లో అత్యధిక సభ్యదేశాలు మాత్రం చైనా దూకుడుపై కలవరపడుతూ సైనిక సంబంధాలు పెంచుకొంటున్నాయి. ఆసియాన్‌తో భారత్ సాంస్కృతిక సంబంధాలు వర్ధిల్లుతున్నాయి. అసలు ఈ దేశాల్లో ప్రాచీన కాలం నుంచే హిందూ, బౌద్ధ మతాలు పరిఢవిల్లాయి. కాంబోడియాలోని అంగ్ కర్ వాట్ జగద్విఖ్యాత హిందూ ఆలయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. వియత్నామ్‌లోనూ పురాతన కాలంలో చామ్ (చంపా) హిందూ రాజ్యం విలసిల్లింది. ఆగ్నేయాసియా దేశాల్లో రకరకాల రామాయణాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ దేశాల్లోని రామాయణ నాటక బృందాలు భారత్ ఆహ్వానంపై అనేకసార్లు దిల్లీ వచ్చి ప్రదర్శనలు ఇచ్చాయి. దేశంలోని ఇతర నగరాల ప్రేక్షకులనూ అలరించాయి. ఈ దేశాల్లోని బౌద్ధ పీఠాలతోనూ భారత్ సంబంధాలను బలపరచుకొంది. మియన్మార్‌లో ప్రసిద్ధ బౌద్ధ పగోడాల సంరక్షణలో భారత్ భాగస్వామి అయింది. భారత్‌లో పురాతన బౌద్ధ విశ్వవిద్యాలయమైన నలంద పునరుద్ధరణలో పాలుపంచుకోవడానికి ఆసియాన్ దేశాలూ సిద్ధంగా ఉన్నాయి. మనదేశంలోని బౌద్ధ క్షేత్రాలను ఆగ్నేయాసియా బౌద్ధులు సందర్శించడానికి ప్రభుత్వం అన్ని వసతులూ కల్పిస్తోంది. మొత్తం మీద ఆగ్నేయాసియాతో భారత్ సంబంధాలు కొంత ఆలస్యంగా ప్రారంభమైనా నేడు అవి బలీయంగా మారాయి. అన్ని రంగాల్లో సహకారం విస్తరిస్తోంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్య ధోరణులను అడ్డుకోవడానికి భారత్, ఆసియాన్ దేశాలు సంయుక్తంగా ముందుకు కదులుతున్నాయి.

(రచయిత- దిల్లీలోని 'ఐసీఆర్ఐఈఆర్'లో సీనియర్ సలహాదారు)



వాణిజ్య మార్గాలు

ఈశాన్య భారతం, ఆగ్నేయాసియాల మధ్య మియన్మార్ ద్వారా భూమార్గం ఉంది. ఈశాన్య భారత్ నుంచి వాణిజ్యం పెంచడానికి 2003లో కాలడాన్ బహుళవిధ రవాణా ప్రాజెక్టు (కేఎమ్‌టీటీ)ని ప్రారంభించారు. కోల్‌కతా రేవు నుంచి మియన్మార్‌లోని సిట్వేకి నౌకల ద్వారా రవాణా, మిజోరం నుంచి సిట్వే వరకు అంతర్గత జలమార్గాలు, రోడ్డు మార్గం ద్వారా సరకుల తరలింపు వంటివి ఈ ప్రాజెక్టులో అంతర్భాగాలు. ఒకవేళ చైనా నుంచి ముప్పు ఎదురైనా, బంగ్లాదేశ్ సహాయ నిరాకరణ చేసినా ఈ ప్రాజెక్టు ప్రత్యామ్నాయ మార్గాలను అందిస్తుంది. దీనికితోడు భారత్-మియన్మార్-థాయ్‌లాండ్ త్రైపాక్షిక రహదారీ సిద్ధమవుతోంది. ఈ దారిలో భారత్ 69 వంతెనలు నిర్మిస్తోంది. బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్ ఒప్పందం (బీబీఐఎన్), బంగాళాఖాత దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సహకార ఒప్పందం (బిమ్‌స్టెక్) పూర్తిస్థాయిలో అమలైనప్పుడు ఆసియాన్‌తో భారత్ వ్యాపారం మరింత వృద్ధి చెందుతుంది.

హైదరాబాద్‌కు కొత్త రాజసం

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన మరోసారి తెరమీదకు వచ్చింది. దశాబ్దాల క్రితమే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఏర్పాటు సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ చేసిన సూచన ఇది. నాలుగేళ్ల క్రితం రాష్ట్ర విభజన సందర్భంగా హైదరాబాద్ ఎవరికి దక్కాలన్న చర్చ జరిగింది. అప్పట్లో హైదరాబాద్‌ను రెండు తెలుగు రాష్ట్రాలకు శాశ్వత ఉమ్మడి రాజధానిగా ఉంచాలని, కేంద్రపాలిత ప్రాంతం చేయాలని, గ్రేటర్ హైదరాబాద్‌ను దిల్లీలాగా స్వయంప్రతిపత్తిగల ప్రాంతంగా మార్చాలని అనేక ప్రతిపాదనలు వచ్చాయి. అలాగే దేశానికి రెండో రాజధానిగా చేయాలన్న వాదనలూ వినిపించాయి. దేశానికి రెండో రాజధాని చేయాలన్నవారు అంబేడ్కర్ సూచనను గుర్తు చేశారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా ఉండాలని నిర్ణయించింది. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలన్న ప్రతిపాదన 2013లో తెలంగాణేతర తెలుగుదేశం నాయకులు లేవనెత్తారు. 'ఈ విషయం అంబేడ్కర్ ఏనాడో చెప్పారు. ఏమవుతుందో చూద్దాం' అని అప్పుడు చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని విభజించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 2013 జులై 30న నిర్ణయించిన తరవాత రాష్ట్రానికి చెందిన అప్పటి కేంద్ర మంత్రులు, ఆంధ్ర-రాయలసీమ నాయకులు కొందరు కూడా ఈ మాటే చెప్పారు. హైదరాబాద్‌ను రెండో రాజధానిగా మార్చడానికి భాజపా అధ్యక్షుడు అమిత్ షా బృహత్ ప్రణాళిక రూపొందిస్తున్నారన్న వార్తలు 2015 జనవరిలోనే వెలుగు చూశాయి. హైదరాబాద్ కేంద్రం పరిధిలో ఉంటే భాజపా బలం పుంజుకొనేలా చేయడం సులభమన్న ఆలోచనతోనే ఈ ప్రతిపాదన తీసుకొచ్చారని కొందరు భావించారు. 2019 ఎన్నికల్లో హైదరాబాద్ రెండో రాజధాని అయితే దక్షిణాదిన భాజపా బలపడటానికి బాటలు పడతాయన్న విశ్లేషణలు వినవచ్చాయి.

పెరుగుతున్న మొగ్గు

ఓ దేశానికి రెండు రాజధానులు ఉండటమన్నది కొత్తేమీ కాదు. మొగలుల కాలంలో దిల్లీ, శ్రీనగర్‌లు రాజధానులుగా ఉండేవి. బ్రిటిష్ హయాములో కోల్‌కతా, సిమ్లా రాజధానులయ్యాయి. దక్షిణాఫ్రికాకు మూడు నగరాలు ప్రిటోరియా, కేప్‌టౌన్, బ్లూఫాంటెయిన్‌లు రాజధానులుగా ఉన్నాయి. ప్రిటోరియాలో పరిపాలన విభాగం, కేప్‌టౌన్‌లో చట్టసభ, బ్లూఫాంటెయిన్‌లో న్యాయవ్యవస్థలు కేంద్రీకృతమయ్యాయి. శ్రీలంక, యెమెన్ దేశాలకు రెండేసి రాజధానులున్నాయి. ఇజ్రాయెల్ రాజధాని జెరూసలెం అయినప్పటికీ, దౌత్య కార్యాలయాలన్నీ టెల్‌అవీవ్‌లోనే నెలకొన్నాయి. బ్రెజిల్ రాజధాని 1960లో రియో డి జెనిరియో నుంచి బ్రసీలియాకు మారింది.

దిల్లీలో ప్రకృతి వైపరీత్యాలు అధికమవుతున్నాయి. వేసవిలో ఎండలు మండుతున్నాయి. శీతకాలంలో చలిపులి తీవ్రంగా వణికిస్తోంది. గత నవంబర్‌లో కళ్లు పొడుచుకున్నా కనిపించనంతగా విపరీతమైన మంచు దిల్లీని కప్పేసింది. రైళ్లు, విమానాల రాకపోకలకు రోజుల తరబడి అంతరాయం ఏర్పడింది. విద్యాసంస్థలు మూతపడ్డాయి. దిల్లీ నగరం అంతకంతకూ కాలుష్య కాసారంగా మారిపోతోంది. అందువల్లే హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలన్న ప్రస్తావన ఊపందుకుంది. దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను మార్చాలన్న ప్రతిపాదన తమకూ సమ్మతమేనని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టీకరించారు. ఆచరణరీత్యా హైదరాబాద్ రెండో రాజధానే అని తెలంగాణ మంత్రి కేటీ రామారావు సైతం వ్యాఖ్యానించారు. గతంలో హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయాలన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించినవారూ ఇప్పుడు అభ్యంతరం చెప్పడంలేదు.



తెరపైకి దేశ రెండో రాజధాని చర్చ

నిజానికి దిల్లీ దేశ రాజధానిగా స్థిరంగా ఉన్నది 1931 నుంచే. ప్రాచీనకాలంలో దిల్లీ ఎన్నడూ రాజధాని కాదు. 12వ శతాబ్దంలో తుర్కుల దాడి నేపథ్యంలోనే దిల్లీ పేరు ప్రముఖంగా వినిపించింది. తరవాత ముస్లిం చక్రవర్తులు అనేకమంది దిల్లీ ప్రాంతం కేంద్రంగా పాలన కొనసాగించారు. సిరి, తుగ్లకాబాద్ వంటి నగరాలు నిర్మించారు. ఇప్పుడివి దిల్లీలో భాగమయ్యాయి. దిల్లీని ప్రాశస్త్యంలోకి తీసుకొచ్చింది మొగల్ చక్రవర్తులు. 1638లో మొగల్ పాలనలో దిల్లీ రాజధాని అయింది. అప్పటికి మొగల్ రాజులు దక్షిణ భారతాన్ని తప్ప మిగతా ప్రాంతాన్నంతా తమ ఏలుబడిలోకి తెచ్చుకున్నారు. ఆపై ఔరంగజేబు హయాములో దక్షిణాదిలో చాలా భాగం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది. బ్రిటిష్‌వారు వచ్చిన తరవాత కోల్‌కతా అధికార కేంద్రమైంది. అప్పటికి కోల్‌కతా సుందర్బన్ ప్రాంతంలోని చిత్తడి నేల మాత్రమే. దాన్ని రేవుగా వినియోగించుకోవచ్చునని బ్రిటిష్‌వారు గ్రహించడం వల్లే కోల్‌కతా అభివృద్ధి చెందింది. మొగలుల రాజధానిగా ఉన్న దిల్లీ కన్నా కోల్‌కతా అనేక రెట్లు పెరిగింది.



ఆనాటి అంబేడ్కర్ మాట

'భాషాప్రయుక్త రాష్ట్రాలపై ఆలోచనలు' అన్న గ్రంథంలో అంబేడ్కర్ హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలని ప్రతిపాదించారు. రెండో రాజధాని ఆవశ్యకత గురించి ఆయన ప్రత్యేక అధ్యాయమే రాశారు. ఉత్తర-దక్షిణ భారతాల మధ్య ఉద్రిక్తతల నివారణకు ఈ చర్య ఉపకరిస్తుందని భావించారు. దిల్లీలోని వాతావరణ పరిస్థితుల వల్ల దక్షిణాదివారు ఇబ్బంది పడతారని అంబేడ్కర్ ముందే ఊహించారు. పొరుగు దేశాలు దాడిచేస్తే దిల్లీకి భద్రత తక్కువ. కోల్‌కతా నగరం టిబెట్‌కు దగ్గర కాబట్టి రక్షణావసరాల దృష్ట్యా అదీ తగదన్నారు. ముంబై సముద్ర తీరంలో ఉన్నందువల్ల అనుకూలం కాదన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, బొల్లారమ్‌లను కలిపి రెండో రాజధానిగా చేయాలని ఆయన సూచించారు.

సర్వ హంగుల శోభిత నగరం

హైదరాబాద్ ఉత్తర-దక్షిణ భారతాలకు వారధి. భూకంపాలు, భారీ వర్షాలు ఉండవు. సునామీల అవకాశమే లేదు. ఏడాది పొడుగునా వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక రాజధాని ముంబయికి మరీ దూరం కాదు. అంతగా సారవంతం కాని రాతి నేలలు అందుబాటులో ఉన్నాయి. సకల భాషలు, మతాలు, సంస్కృతులు, ఆచారాలు ఇక్కడ కనిపిస్తాయి. అందువల్లే దేశానికి రెండో రాజధాని ప్రతిపాదన ఎప్పుడు వచ్చినా హైదరాబాద్ నగరమే ముందుగా అందరి దృష్టిలోకి వస్తుంది. బెంగళూరును రెండో రాజధాని చేయాలని కోరుతూ కర్ణాటక ప్రభుత్వం మొన్న జనవరి అయిదున ప్రధానమంత్రికి లేఖ రాసింది. 2020 కల్లా అమెరికాలోని సిలికాన్ వ్యాలీని అధిగమించడానికి బెంగళూరు ప్రయత్నిస్తోంది. ఈ విషయంలో హైదరాబాద్ సైతం వడివడిగా అడుగులేస్తోంది. ఆకాశ హర్మ్యాలు, అంతర్, బాహ్యవలయ రహదారులు, పటిష్ఠమైన రవాణా మార్గాలు, శంషాబాద్, బేగంపేట విమానాశ్రయాలు ఇక్కడ ఉన్నాయి. సరికొత్తగా మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. దక్షిణ మధ్య రైల్వే ఆదాయంలో అధికభాగం హైదరాబాద్ నుంచే సమకూరుతోంది. అనేక జాతీయ రహదారులు హైదరాబాద్ ద్వారానే వెళ్తాయి. సైన్యానికి, వైమానిక దళానికి కీలకమైన స్థావరాలు, అనేక విశ్వవిద్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. రక్షణశాఖ పరిశోధన కేంద్రాలున్నాయి. సాంకేతిక దిగ్గజమైన గూగుల్‌కు అమెరికా, సియోల్ తరవాత హైదరాబాదే నెలవు. అంకుర పరిశ్రమల్లో ఏ రాష్ట్రానికీ తీసిపోని స్థితిలో ఈ నగరముంది. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఔషధ తయారీ సంస్థలు, నూలు, వస్త్ర పరిశ్రమలు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు, లోహ పరిశ్రమలు అపారంగా ఉన్నాయి. హైదరాబాద్ కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలకు ఆటపట్టు. ఆధునిక నగర జీవితానికి అవసరమైన వినోద పరిశ్రమలూ కొల్లలుగా ఉన్నాయి. అన్నింటినీ మించి ఇక్కడ గరీబులూ బతకొచ్చు. షరాబులూ జల్సాలు చేయొచ్చు. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయడానికి ఏ వర్గం నుంచీ వ్యతిరేకత లేకపోవడం మరో సానుకూలాంశం. లోటు ఒక్కటే- సముద్ర తీరం లేకపోవడం. ఉన్న అవకాశాలు మాత్రం సకల సముద్రాలంత విశాలమైనవి!

– ఆర్వీ రామారావ్

పూల బాట

మనిషి నడవటానికే కాదు, జీవన యానానికీ మంచి బాట ఉండాలి. అది కనిపించేది కాదు. మనసుతో అనుభూతి చెందేది. జీవన గతి సవ్య ప్రస్థానానికి అది దోహదపడుతుంది.

ఏ బాట అయినా గమ్యం దగ్గర ముగిసిపోతుంది. అందరి గమ్యాలూ ఒక్కటిగా ఉండవు. జ్ఞానం కలిగాక, ఎవరి గమ్యం వారు ఎంపిక చేసుకోవాల్సిందే. అందులోనే మనిషి విజ్ఞత వెల్లడవుతుంది.

విజ్ఞత అంటే, మంచి చెడుల విచక్షణ. అది బాగుంటే, సరైన గమ్యం ఎంపిక చేసుకుంటాం. అంతమాత్రానికే గమ్యం చేరుకున్నట్లు కాదు. టికెట్టు కొనగానే ప్రయాణం చేసినట్లు భావించకూడదు.

ప్రయాణంలో తోడుగా నీరు, ఆహారం ఉంచుకుంటాం. అవి దేహపీడల నుంచి కాపాడతాయి. జీవన యానంలోనూ తోడుగా కొన్ని ఉపకరణాలు ఉంచుకోవాలి. అవి- సద్గుణాలు, స్థిరమైన బుద్ధి.

స్థిరబుద్ధి లేనివారు సద్గుణ సంపదను సవ్యంగా ఉపయోగించుకోలేరు. ఫలితంగా కష్టాలు అనుభవించక తప్పదు. 'చాలా మంచి వ్యక్తి, కానీ కష్టాలు పడక తప్పడంలేదు' అనే సానుభూతి వచనాలు వినాల్సి ఉంటుంది. ధర్మరాజు సద్గుణశీలుడైనా- జూదం వల్ల అనర్థం తప్పదని తెలిసీ మళ్ళీమళ్ళీ పందేలు కట్టి, సర్వం కోల్పోయాడు. స్థిరబుద్ధి లేకపోవడమే అందుకు కారణం.

మనిషికి రెండు నేత్రాలు, రెండు చేతుల్లా ద్వంద్వ గుణాలూ ఉంటాయి. గుణం అంటే చర్యల ద్వారా తెలిసేది. కంటికి కనిపించేది కాదు. సద్గుణాలు వ్యక్తిత్వానికి ఆభరణాలు. దుర్గుణాలు మనిషికి, వ్యక్తిత్వానికి దోషం ఆపాదిస్తాయి.

సద్గుణశీలుడికి సత్కారాలు ఉండకపోవచ్చు. దుర్గుణ పీడితుడికి లభించే దూషణ తిరస్కార దండనలు అతడికి ఉండవు. మనిషి తన బాటలో ఇబ్బంది కలిగించే రాళ్లు, ముళ్లు తొలగించి మార్గం సుగమం చేసుకొని ముందుకు సాగుతాడు. దుర్గుణాలనే గాజుపెంకుల్నీ జీవనయానమనే బాట నుంచి తొలగించుకోవాలి. ఆ పని ఎవరికి వారే చేసుకోవాలి.



అంతర్యామి

వేరెవరో చేయరు. దేహంలోని ముళ్లు తీయవచ్చుగానీ మనసులోని ముళ్లు ఎవరు తీయగలరు? ఎవరికి వారే తొలగించుకోవాలి. అందరికీ ఆ నేర్పు ఉండదు. కారణం- చాలామంది తాము ఎలాంటి తప్పులూ చేయడం లేదనే భ్రమలోనే జీవిస్తుంటారు. తమ మనసులో దుర్గుణాలనే ముళ్లు ఉన్నాయన్న సంగతి సైతం తెలియనంతగా, వారి అజ్ఞానం ఉంటుంది. ఇక వాటిని తొలగించుకోవాలని ఎవరైనా ఎలా అనుకుంటారు?

అధిక శాతం మానవుల్లో అసూయ, ద్వేషం అనే రెండు ముళ్లు అశాంతిని కలిగిస్తుంటాయి. ఎదుటివారు స్వశక్తి, కృషి, అంకితభావంతో అభివృద్ధి సాధిస్తుంటే చూడలేరు. అసూయతో రగిలిపోతుంటారు. సందర్భం ఉన్నా లేకపోయినా వారి గురించి ద్వేషంతో విషం కక్కుతుంటారు. పాముకు కోరల్లోనే ఉండే విషం వీరికి అణువణువునా నిండి విషవృక్షంలా కనిపిస్తారు. 'ఖలునకు నిలువెల్ల విషము కదరా సుమతీ' అన్నాడు శతక కవి. ఈ కారణం వల్లనే ఆధునిక ప్రపంచం ప్రేమలేని ఎడారిలా మారింది.

విషానికి విరుగుడుగా సంజీవని ఉన్నట్లే, అసూయా ద్వేషాలకు విరుగుడుగా 'అవ్యాజ ప్రేమ'ను చెప్పుకోవాలి. మనసుకు ప్రేమను నేర్పాలి. అది పెరిగే కొద్దీ అసూయ, ద్వేషం మంచులా కరిగిపోతాయి. అప్పుడు జీవన యానం పూలబాటలోనే సాగుతుంది!

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

కందుల కొను 'గోలుమాల్'

- రైతుల నుంచి తక్కువ ధరకు కొని పక్క జిల్లాలకు తరలింపు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయం
- జనగామలో లారీల పట్టివేత
- వెలుగుచూసిన అక్రమాలు


జనగామ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన కందులు

ఈనాడు-హైదరాబాద్, న్యూస్‌టుడే-జనగామ

కందుల క్రయవిక్రయాల్లో వ్యాపారులు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొని పక్క జిల్లాలకు తరలించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) కందుల కొనుగోలుకు ముందుకొచ్చింది. నాఫెడ్ తరఫున రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య (మార్క్‌ఫెడ్) రాష్ట్రంలో 80 కొనుగోలు కేంద్రాలు తెరిచి 4.84 లక్షల క్వింటాళ్ల కందులు కొన్నది. ఈ కేంద్రాలకు రైతు కందులు తీసుకొస్తే చాలావరకు నాణ్యత లేదని తిరస్కరిస్తున్నారు. అదే సాకుగా చూపి వ్యాపారులు అతి తక్కువ ధరలకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.

వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతంలో నాణ్యమైన కందులు క్వింటాలు రూ.4,500కే దొరుకుతున్నాయని వ్యాపారులు చెబుతూ ఇతర ప్రాంతాల్లో మరింత తగ్గించేస్తున్నారు. తాండూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో కంది సాగు అధికంగా ఉంది. అక్కడ వ్యాపారులు లారీల కొద్దీ కందులు తక్కువ ధరకు కొంటున్నారు. జనగామ వంటి ప్రాంతాలకు తరలించి బోగస్ రైతుల పేర్లతో మద్దతు ధర రూ.5,450కి అమ్మేస్తున్నారు. ఇటీవల జనగామలో రైతుల పేరుతో మార్కెట్‌కు తెచ్చి మద్దతు ధరకు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. 80 క్వింటాళ్ల కందులను అక్కడే వదిలేయడంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో, చిల్లర దుకాణాల్లో, ప్రైవేటు వ్యాపారులు కొన్నవి రికార్డుల్లో నమోదు కాకపోవడంతో తిరిగి మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. పలు కేంద్రాల్లో ఇలా రైతుల పేరిట వ్యాపారులే రీసైక్లింగ్ విధానంలో అమ్ముతున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా చూడండి: హరీశ్‌రావు

కందుల కొనుగోలులో అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు కలెక్టర్లను ఆదేశించారు. జనగామ ఉదంతంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసగిస్తే ఎవరినీ వదలొద్దని హెచ్చరించారు. ప్రతి మార్కెట్‌ను తనిఖీ చేసి, రైతులకు మద్దతు ధర ఇచ్చేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కందుల దిగుబడి 2.84 లక్షల టన్నులు వచ్చిందని, తొలి అంచనాలకన్నా భారీగా పెరగడంతో మద్దతు ధరకు మరిన్ని కొనేందుకు అనుమతించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి ఆయన లేఖ రాశారు. అధిక దిగుబడి వస్తే తప్పకుండా కొంటామని కేంద్ర వ్యవసాయ శాఖ సమాధానం ఇచ్చింది.

నష్టాలే మిగిలాయి



రెండు ఎకరాల్లో పత్తి, కంది మిశ్రమ పంటగా సాగు చేశాను. పత్తి సరిగా పండలేదు. రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. మార్కెట్‌కు 4 క్వింటాళ్ల కందులు తెస్తే నల్లగింజ, తేమ ఉందని మార్క్‌ఫెడ్ అధికారులు తీసుకోలేదు. ఓ వ్యాపారికి క్వింటా రూ.4250 చొప్పున అమ్ముకోవాల్సి వచ్చింది. సాగు ఖర్చుల వరకైనా ధర రాలేదు. ప్రైవేటు వ్యాపారులకు పనికొచ్చే సరకు ప్రభుత్వానికి ఎందుకు పనికిరాదో అర్థం కావడం లేదు.

- ఆరెల్ల యాదగిరి, కంది రైతు, వెల్ది గ్రామం, జనగామ జిల్లా

లోగుట్టు తేలేనా?

జనగామ మార్కెట్‌లో ఈ నెల 2 నుంచి 22 వరకు ప్రైవేటు వ్యాపారులు 119 మంది రైతుల నుంచి 302 క్వింటాళ్ల కందులను చాలా తక్కువ ధరకు కొన్నారు. అంటే సగటున ఒక్కో రైతు 2.5 క్వింటాళ్ల కందులను అమ్మారు. ఈ నెల 10న ఇదే మార్కెట్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. 11 నుంచి 22వ తేదీ వరకు 390 మంది రైతుల నుంచి 3,338 క్వింటాళ్లు మద్దతు ధరకు కొన్నట్లు లెక్కలు రాశారు. అంటే ఒక్కో రైతు అమ్మిన కందులు సగటున 8.5 క్వింటాళ్లు. ఇందులో అధిక భాగం వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి అమ్మినవేనని తెలిసింది. ఈ కేంద్రంలో అమ్మిన రైతుల చిరునామాల ఆధారంగా విచారణ జరిపితే గుట్టు రట్టవుతుంది.

అమరావతికి కృష్ణా బోర్డు

- అనువైన భవనం చూసి తరలించండి
- బోర్డు ఛైర్మన్‌కు కేంద్రం లేఖ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తరలనుంది. ఈ మేరకు కార్యాలయం తరలింపునకు చర్యలు తీసుకోవాలని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ. కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాసింది. బోర్డు కేంద్ర కార్యాలయాన్ని ఏపీలోని వెలగపూడికి తరలించాల్సిందిగా కోరుతూ ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. విజయవాడకు సమీపంలోని వెలగపూడికి కార్యాలయాన్ని తరలించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 85(2) ప్రకారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డును ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఏర్పాటు చేయాల్సి ఉందని, కార్యాలయానికి అనువైన భవనాన్ని ఎంపిక చేసి తరలించేందుకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ అధికారి అరుణ్‌కుమార్ బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. అయితే ఈ నెలాఖరున ప్రస్తుత బోర్డు ఛైర్మన్ శ్రీవాత్సవ పదవీవిరమణ చేయనున్నారు. కొత్త ఛైర్మన్ వచ్చిన తర్వాతే దీనిపై కదలిక వచ్చే అవకాశం ఉంది.

బోర్డు ఆదేశాల ప్రకారమే నీటి విడుదల: శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి తమ ఆదేశాల ప్రకారమే నీటి విడుదల జరగాలని కృష్ణా బోర్డు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సూచించింది. ఇందుకు భిన్నంగా ఎవరైనా వినియోగిస్తే తర్వాత జారీ చేసే ఆదేశాల్లో ఆ నీటిని పరిగణనలోకి తీసుకుంటామంది. ఒక రాష్ట్రం ఉల్లంఘించినట్లు ఇంకో రాష్ట్రం ఫిర్యాదు చేస్తే దానిని బోర్డు ఆదేశాలను ఉల్లంఘించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంటూ సభ్య కార్యదర్శి పరమేశం లేఖ రాశారు. మరోవైపు నాగార్జునసాగర్ మూడో జోన్‌కు నీటి విడుదల జరగక పంటలు దెబ్బతింటున్నాయంటూ రైతులు బుధవారం బోర్డు అధికారులను, తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను కలిశారు. బోర్డు నిర్ణయం ప్రకారం నీటి విడుదల జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రానికి 21 రాష్ట్రపతి పతకాలు

ఈనాడు, హైదరాబాద్: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీసులకు కేంద్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. రాష్ట్రం నుంచి 21 మంది ఈ పతకాలు పొందిన వారిలో ఉన్నారు.

రాష్ట్రపతి ఉత్తమ సేవాపతకం: జితేందర్ (సంచాలకులు, రాజా బహద్దూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ), నరేంద్ర నారాయణ రావు (డీఎస్పీ,చుంగి)

రాష్ట్రపతి సేవాపతకం: మస్తీపురం రమేశ్(గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్), డి.శివప్రసాద్‌రెడ్డి, పి.వీరస్వామి, (సహాయ కమాండెంట్లు, తెలంగాణ పోలీసు ప్రత్యేక పటాలం (టి.ఎస్.ఎస్.పి.)), ఎస్.రంగారావు, (ఏసీపీ, హైదరాబాద్), తుల్జారాం నరేంద్రసింగ్ (డీఎస్పీ, హైదరాబాద్), చట్లూరు శ్రీనివాస్ శాంతి, జి.రణ్‌వీర్‌రెడ్డి (సీఐలు, హైదరాబాద్), పల్లె శంకర్‌రెడ్డి (ఎస్సై, హైదరాబాద్), ఎండీ ఫయాజ్ అహ్మద్ షరీఫ్ (ఎస్సై, సాయుధ బలగాలు (ఎ.ఆర్.)), వేమూరి శివానందరావు(హెడ్ కానిస్టేబుల్, హైదరాబాద్), రాథోడ్ రహిదాస్ నాయక్(అసిస్టెంట్ అస్సాల్ట్ కమాండర్),పి.శ్రీనివాస్ (జూనియర్ కమాండో, హైదరాబాద్), ఎం.సిద్దయ్య (హెడ్ కానిస్టేబుల్, హైదరాబాద్).

రాష్ట్రపతి శౌర్యపతకం: జి.సురేష్, ఎం.మురళి, పి.లక్ష్మణుడు, హరీశ్ (జూనియర్ కమాండోలు), బి.శ్రీరాములు, వెంకట శ్రీనివాసరెడ్డి (అసిస్టెంట్ అస్సాల్ట్ కమాండర్లు). ఈ పతకాలన్నీ తెలంగాణ గ్రేహౌండ్స్ విభాగానికే రావడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్‌కు ఎయిర్‌బస్?

- సి-295 విమానాల ఉత్పత్తి కేంద్రం
- సంస్థ సీఈవోతో చంద్రబాబు చర్చలు
- వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానాలపై యూపీఎల్ సీఈవోతో భేటీ


దావోస్‌లో ఎయిర్‌బస్ డిఫెన్స్ సంస్థ సీఈవో డిర్క్ హోక్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నారా లోకేష్, యనమల రామకృష్ణుడు తదితరులు

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సి-295 విమానాల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకి ఎయిర్‌బస్ సంస్థకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, అన్ని అనుమతులూ వెంట వెంటనే ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దావోస్‌లో ఆయన బుధవారం ఎయిర్‌బస్ డిఫెన్స్ సంస్థ సీఈవో డిర్క్ హోక్ తదితరులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఎయిర్‌బస్ సంస్థ టాటా గ్రూప్‌తో కలిసి ఈ విమాన తయారీ కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటు చేయనుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని ఏపీ కోరుతోంది. ఎయిర్‌బస్ సంస్థ ప్రతినిధులు గత సంవత్సరమే రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించారు. రాష్ట్రాన్నీ సందర్శించారు. "ఈ ఏడాది చివరిలోగా ఎట్టిపరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు నెలకొల్పుతాం" అని డిర్క్ హోక్ పేర్కొన్నారు. వివిధ దేశాల్లోని తమ ఉత్పాదక యూనిట్లను ఒకసారి సందర్శించాలని చంద్రబాబుని ఆయన ఆహ్వానించారు.

విశ్వవిద్యాలయ టౌన్‌షిప్ ఏర్పాటుకి ఆహ్వానం: భారత్‌లో బోస్టన్ తరహాలో ఒక విశ్వవిద్యాలయ టౌన్‌షిప్ నెలకొల్పే ఉద్దేశంతో ఉన్నామని వేదాంత సంస్థ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని, అన్ని విధాలా సహకరిస్తామని సీఎం విజ్ఞప్తి చేశారు.

కరవు నియంత్రణ ఆవిష్కరణలపై చర్చ: భూమిలోని నీటిని గ్రహించి, ఆ నీటిని కరవు సమయంలో తిరిగి విడుదల చేసే సరికొత్త సాంకేతికతపై యూపీఎల్ సంస్థ గ్లోబల్ సీఈవో జైష్రాఫ్‌తో చంద్రబాబు చర్చించారు. ఈ సంస్థ ఒక ఎకరం విస్తీర్ణంలో 2 వేల లీటర్ల నీటిని గ్రహించే పరికరాల్ని ఉత్పత్తి చేస్తోంది. ఇది కరవుని నియంత్రించేందుకు దోహదం చేయడమే కాకుండా, 30 నుంచి 40 శాతం వరకు ఉత్పాదకతా పెంచుతుందని జైష్రాఫ్ వివరించారు. భూమిపై చల్లిన ఎరువులు భారీ వర్షాలకు కొట్టుకుపోయి వృథా కాకుండా సంరక్షించే మరో పరిజ్ఞానాన్ని సైతం తాము రూపొందించినట్టు ఆయన పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించండి మీ ఉత్పత్తులకు రాష్ట్రాన్ని ప్రయోగశాలగా చేసుకోండి" అని చంద్రబాబు కోరారు.

రాష్ట్రం మొత్తం స్మార్ట్..!: సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ అధ్యక్షుడు సుబ్రా సురేష్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ ప్రాంగణాన్ని స్మార్ట్ క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమది ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ అనుకూల క్యాంపస్ అని, ఒకసారి సందర్శించాలని ఆయన చంద్రబాబును కోరారు. ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని స్మార్ట్ రాష్ట్రంగా మార్చాలని భావిస్తున్నట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ కోర్సు: రాష్ట్రంలోని ఏదో ఒక విశ్వవిద్యాలయంలో 3 నెలల బ్లాక్‌చైన్ టెక్నాలజీ కోర్సు ప్రారంభించాలని 'ఎథేరియం' సంస్థ వ్యవస్థాపకుడు జో లుబిన్‌ను చంద్రబాబు కోరారు.

విరివిగా త్రీడీ ముద్రణ కేంద్రాలు: ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా త్రీడీ ముద్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఈ పరిజ్ఞానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని హెచ్‌పీ సంస్థను ముఖ్యమంత్రి కోరారు. హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్ స్టీఫెన్ నిగ్రోతో ఆయన సమావేశమయ్యారు.

ఫ్రాన్‌హోఫర్ ప్రతినిధితో భేటీ: లీప్‌ఝిగ్ కేంద్రంగా పనిచేస్తున్న టెక్నాలజీ రీసెర్చ్ సంస్థకు సంబంధించిన ఫ్రాన్‌హోఫర్ ప్రతినిధి తొబియాస్ డౌత్ తదితరులతో చంద్రబాబు సమావేశమయ్యారు. లీప్‌ఝిగ్‌ను సందర్శించాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆ సంస్థ ప్రతినిధులు కోరారు.

పనిచేసే ముఖ్యమంత్రి లభించడం ఏపీ అదృష్టం

- గవర్నర్ నరసింహన్ కితాబు


ఎస్‌ఆర్‌పురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న నరసింహన్

పెందుర్తి, న్యూస్‌టుడే: 'ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది... ఇక్కడి ప్రజలను చూస్తుంటే సంక్షేమ ఫలాలు వారి ముఖాల్లో కనిపిస్తున్నాయి... ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉన్నారనేందుకు ఇదే నిదర్శనం...ఈ విషయం గణతంత్ర వేడుకల వేదికపై ప్రస్తావిస్తాను... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకెళ్తాను' అని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా బుధవారం పెందుర్తి మండలంలోని సౌభాగ్య రాయపురం (ఎస్ఆర్‌పురం) గ్రామంలో గవర్నర్ పర్యటించారు. గ్రామసభలో ప్రసంగించారు. గ్రామంలో రోడ్లు, ఇళ్లు ఎంతో స్వచ్ఛంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ఎంతో మేలు చేస్తున్న నేపథ్యంలో... ఇప్పుడు ప్రజల వంతు వచ్చిందని అభిప్రాయపడ్డారు. దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా, స్వచ్ఛంగా నిలపడానికి ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలని పిలుపునిచ్చారు. పనిచేసే ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి లభించడం అదృష్టమన్నారు. సాధారణంగా ఎవరైనా 24××7 పనిచేస్తారని... మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 25××8 పనిచేస్తారని కితాబునిచ్చారు. తాను చంద్రబాబును కలిసినప్పుడు ఇదే విషయం చెబుతుంటానన్నారు.

దేశానికే ప్రతిభా కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

ఈనాడు, విశాఖపట్నం: ఉన్నత విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం విశేష ప్రగతి సాధించిందని, ఆంధ్రప్రదేశ్ దేశానికే ప్రతిభా కేంద్రంగా మారుతోందని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ పేర్కొన్నారు. బుధవారం విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశ మందిరంలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వీసీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ హబ్‌గా చేయాలన్న సీఎం చంద్రబాబు ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాల్లో బోధన, పరిశోధనలు సాగుతున్నాయన్నారు.

సీఎం స్థానంలో బాలయ్య!



ఈనాడు, అమరావతి: విజయవాడలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ బుధవారం పర్యటక, సాంస్కృతిక, రవాణా శాఖ అధికారులు, అనంతపురం జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులతో లేపాక్షి ఉత్సవ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించే సమయంలో సీఎం స్థానంలో కూర్చోవడం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది.

వచ్చే నెల అమరావతి బౌద్ధ వారసత్వ ఉత్సవాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: విశ్వశాంతి పేరుతో అమరావతి బౌద్ధ వారసత్వ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఏపీ మంత్రి అఖిలప్రియ తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు ఈ వేడుకలు కొనసాగుతాయన్నారు. ఫిబ్రవరి 4న వెయ్యి మంది బౌద్ధ భిక్షువులు ప్రార్థన చేయనున్నారని, ఇది ప్రపంచ రికార్డు అవుతుందని ప్రకటించారు. ఉత్సవాల లక్ష్యం అమరావతిని సాంస్కృతిక రాజధానిగా చాటిచెప్పడమేనని ఆమె అన్నారు. బుధవారం విలేకరులతో మంత్రి మాట్లాడారు.

సప్త వాహనాలపై సర్వాంతర్యామి

తిరుమలలో వేడుకగా రథసప్తమి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల క్షేత్రంలో రథసప్తమి వేడుక బుధవారం అతి వైభవంగా జరిగింది. సప్త వాహనాలపై సర్వాంతర్యామి ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ పర్వదినం బ్రహ్మోత్సవాలను తలపించింది. శ్రీవారి ప్రాభవాన్ని ఒకేరోజు సప్త వాహనాలపై చూసి భక్తులు తరించారు. ఉషోదయాన సూర్యప్రభ వాహనంతో ప్రారంభమైన సప్తవాహన సేవోత్సవం చంద్రప్రభ వాహనంతో రాత్రి పరిసమాప్తమైంది. సూర్యనారాయణమూర్తిగా, జగదోద్ధారకునిగా, సర్వభూపాలునిగా వివిధ అవతార విశ్వరూప వైశిష్ట్యం ప్రదర్శిస్తూ శ్రీమలయప్ప స్వామి సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. తిరువీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సూర్యభగవానుని అనుగ్రహంతో సంపూర్ణారోగ్యం సిద్ధించి, శుత్రునాశనమవుతుందనే విశ్వాసంతో రథసప్తమి ఉత్సవంలో వేలాది భక్తులు పాల్గొనడంతో తిరుమల జన సంద్రమైంది. శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది.

యువకుడి దుస్సాహసం

నాంపల్లి, న్యూస్‌టుడే: యువతలో సెల్ఫీల పిచ్చి కాస్తా వారి ప్రాణాల మీదికి తెస్తోంది. ఇప్పటికే అనేక మంది పలు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయినా.. వారిలో మార్పు రావడం లేదు. తాజాగా ఓ యువకుడు పట్టాల పక్కనే నిలబడి సెల్ఫీ వీడియో తీసుకుంటూ రైలు ఢీకొని తీవ్రంగా గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వరంగల్ జిల్లాకు చెందిన శివ (25) ఇటీవలే నగరంలోని బోరబండ పర్వత్‌నగర్‌లో నివాసం ఉండే బావ వద్దకు వచ్చాడు. ఈ నెల 21న సాయంత్రం బోరబండ రైల్వేస్టేషన్ సమీపానికి వచ్చాడు. ఫలక్‌నుమా నుంచి లింగంపల్లి వైపు వెళ్లే ఎంఎంటీఎస్ రైలు వస్తుండగా పట్టాల పక్కనే నిలబడి సెల్ఫీ వీడియో తీసుకునే ప్రయత్నం చేశాడు. స్థానికులు హెచ్చరిస్తున్నా లక్ష్యపెట్టలేదు. రైలు తొలుత అతని చేతిని, తర్వాత తలని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో భరత్‌నగర్ ఆర్‌పీఎఫ్ పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్వే కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి రూ.500 జరిమానా విధించడంతో పాటు.. కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిందిగా ఆదేశించారు.

క్షమాభిక్షలను వినియోగించుకోండి

- తెలంగాణకు తిరిగి రండి
- కువైట్‌లోని ప్రవాస తెలంగాణ కార్మికులకు కేటీఆర్ పిలుపు
- కొనసాగాలంటే జరిమానాలు చెల్లించి ధ్రువపత్రాలు పొందాలని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: కువైట్‌లో అక్రమంగా జీవిస్తున్న వారికి అక్కడి ప్రభుత్వం ఇచ్చిన క్షమాభిక్ష అవకాశాన్ని తెలంగాణ వలస కార్మికులు వినియోగించుకోవాలని, వీసాలు, పాస్‌పోర్టులు లేకుండా ఉంటున్న వారు వెంటనే స్వరాష్ట్రానికి తిరిగి రావాలని రాష్ట్ర ప్రవాసుల వ్యవహారాల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. వారు నేరుగా కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయాన్నిగానీ, హైదరాబాద్ సచివాలయం సాధారణ పరిపాలన శాఖలోని ప్రవాసుల (ఎన్‌ఆర్‌ఐ) విభాగాన్నిగానీ సంప్రదించాలన్నారు. కువైట్‌లోనే ఉండాలనుకునే వారు దీనికి అవసరమైన జరిమానాలు చెల్లించి ధ్రువపత్రాలను పొందాలన్నారు. న్యాయస్థానాల్లో కేసులున్న వారికి, ప్రయాణాలు నిషేధించిన వారికి ఈ అవకాశం ఉండదని తెలిపారు.

ఈ నెల 29 నుంచి వచ్చే నెల 22 వరకు క్షమాభిక్షల గడువు..

తమ దేశంలో సరైన ధ్రువపత్రాలు లేకుండా ఉన్న వారికి కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష పథకాన్ని మంగళవారం ప్రకటించింది. దీని ప్రకారం సరైన వీసాలు లేకుండా జీవిస్తున్న వారంతా తమతమ దేశాలకు వెళ్లాలి. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 22 వరకు అది అమల్లో ఉంటుంది. స్వదేశానికి వెళ్లాలనుకునే వారు ఎలాంటి జరిమానాలు, అనుమతులు లేకుండా వెళ్లవచ్చని పేర్కొంది. దీంతో పాటు అక్రమంగా ఉన్న వారు అన్ని రకాల జరిమానాలు చెల్లిస్తే వారి గురించి విచారణ జరిపిన తర్వాత అనుమతులు జారీ చేస్తామని పేర్కొంది. న్యాయస్థానాల్లో కేసులున్నవారు, ప్రయాణాలపై నిషేధం ఉన్న వారు క్షమాభిక్ష సమయంలో కువైట్‌లోని నివాస వ్యవహారాల శాఖను సంప్రదించి, వీసాలను పొందవచ్చని తెలిపింది. క్షమాభిక్ష సమయంలో తమకు ఎలాంటి పత్రాలు లేకుండా దొరికిన వారిని దేశం నుంచి బహిష్కరిస్తామని తెలిపింది. క్షమాభిక్షల పథకం కింద స్వదేశానికి వెళ్లకుండా సరైన అనుమతి పత్రాలు లేకుండా గడువు తర్వాత కొనసాగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కువైట్ ప్రభుత్వం హెచ్చరించింది. జరిమానాలతో పాటు ఇతర చట్టపరమైన చర్యలుంటాయని పేర్కొంది. వారికి వీసాలను మంజూరు చేయబోమని, దేశం నుంచి బహిష్కరిస్తామనీ, దేశ బహిష్కరణ తర్వాత మరోసారి కువైట్‌లోకి ప్రవేశించేందుకు అనుమతించబోమని తెలిపింది.

తెలంగాణనే ఎంచుకోండి



మిత్సుబిషి భారీ పరిశ్రమల సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయితో భేటీ అయిన మంత్రి కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

జవాబుదారీతనం వంటి అంశాల సమాహారంగా దాన్ని తీర్చిదిద్దామన్నారు. పారిశ్రామికవేత్తలు విదేశాల నుంచి సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఏక గవాక్ష విధానం కింద నేరుగా అన్ని అనుమతులు పొంది పరిశ్రమను స్థాపించవచ్చన్నారు.

కొత్తగా 150 మంది పరిశోధకులు: నొవార్టిస్

ప్రముఖ పారిశ్రామిక సంస్థ నొవార్టిస్ ప్రజావిధాన అధిపతి పెట్రా లక్స్‌తో బుధవారం కేటీఆర్ తెలంగాణ పెవిలియన్‌లో సమావేశమయ్యారు. తెలంగాణలోని ఔషధనగరిలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా లక్స్ మాట్లాడుతూ.. ఇప్పటికే నొవార్టిస్ హైదరాబాద్‌లో పరిశోధన అభివృద్ధి, డేటా సెంటర్, అనలిటిక్స్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అక్కడ తమ కార్యకలాపాలు చక్కగా సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న 90 వేల చదరపు అడుగుల ప్రయోగశాలను రెట్టింపు చేస్తామని, కొత్తగా మరో 150 మంది పరిశోధకులను నియమిస్తామన్నారు. లక్స్ ప్రతిపాదనను కేటీఆర్ స్వాగతించారు. నొవార్టిస్ విస్తరణ ద్వారా తెలంగాణలోని జినోమ్‌వ్యాలీ మరింత అభివృద్ధి సాధిస్తుందని వెల్లడించారు.

భారీ ప్రాజెక్టులు చేపడతాం:మిత్సుబిషి

తమ కంపెనీ భారీ ప్రాజెక్టులను చేపట్టేందుకు ఆసక్తితో ఉందని మిత్సుబిషి భారీ పరిశ్రమల సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు కెన్ కవాయి బృందం కేటీఆర్‌కు చెప్పింది. పారిశ్రామిక వాడలు, వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులను చేపడతామని తెలిపింది. రాష్ట్రంలో మంచి అవకాశాలున్నాయని, కంపెనీ ప్రతినిధి బృందం తెలంగాణలో పర్యటించాలని ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం జపాన్ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా చిన్న,మధ్యతరహా పరిశ్రమల పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, దీనికి మిత్సుబిషి చొరవ తీసుకోవాలన్నారు.

వైమానిక రంగంలో

ఎయిర్ ఏషియా సంస్థ సీఈవో ఆంథోని ఫెర్నాండెజ్, ఉప కార్యనిర్వహణాధికారి ఎయిరీన్ ఒమర్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. తెలంగాణలో వైమానిక రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని, పెట్టుబడులు పెట్టాలని కోరారు.

వివిధ రంగాల్లో పరిశ్రమలను స్థాపించాలని మరో ప్రసిద్ధ సంస్థ హిటాచి నకానిషి కంపెనీ ఛైర్మన్ నకానిషి సాన్, ఆయన ప్రతినిధి బృందాన్ని కేటీఆర్ కోరారు. కళ్యాణి సంస్థ ఛైర్మన్ బాబా కళ్యాణిని కేటీఆర్ కలిశారు. కువైట్‌కు చెందిన ఫవద్ అల్గానిం కంపెనీ సీఈవో మహ్మద్ అల్గానింతో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలోని విద్యుత్‌రంగంలో, వైద్య పరికరాల ఉత్పత్తి పార్కుల్లో పరిశ్రమలు స్థాపించాలన్నారు. అనంతరం ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో మహ్మద్ అల్‌షయిబానీ కేటీఆర్‌ను కలిశారు. తెలంగాణలో టెక్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆయనకు సూచించారు. హ్యులెట్ ప్యాక్టర్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీఈ) సంస్థ ఉపాధ్యక్షులు అనా పిన్కుజుక్‌తో కేటీఆర్ సమావేశమయ్యారు. హెచ్‌పీఈ, టీహబ్‌ల మధ్య భాగస్వామ్యం గురించి ప్రతిపాదించగా, అనా ఆమోదం తెలిపారు. ఫిన్లాండ్ క్లీన్ ఎనర్జీ సంస్థ అధ్యక్షుడు ల్యాండ్‌మార్క్‌తో, కేకేఆర్, దాల్మియా, డెలాయిట్ తదితర సంస్థల ప్రతినిధులతో కేటీఆర్ మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పురస్కారాన్ని గెలుచుకున్న టీహబ్ అంకుర సంస్థ బనయన్ నేషన్ సహ వ్యవస్థాపకుడు మణి వాజ్‌పేయిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. పురస్కారం ద్వారా టీహబ్‌కు ప్రపంచ గుర్తింపు దక్కిందన్నారు. ఆర్థిక వేదిక సదస్సులో క్రిస్టల్ పురస్కారం పొందిన షారూక్‌ఖాన్‌ను కేటీఆర్ అభినందించి, ఆయనతో ఫొటో దిగారు. తన అభిమాననటుడికి సరైన పురస్కారం లభించిందని ట్విట్టర్‌లో ఆనందం వ్యక్తంచేశారు.

అసైన్డ్‌కూ ‘సాయం’

(మొదటి పేజీ తరువాయి)


నిధులు మరిన్ని అవసరమవుతాయని అంచనా.

బీడు భూముల సంగతేమిటి?

కొన్నిచోట్ల సాగు భూమి సవ్యంగా ఉన్నా పంటలు వేయకుండా బీడుగా ఉంచుతున్నారు. నగరాలు, పట్టణాల్లో ఉండేవారు భూములు కొని ఎవరికీ కౌలుకు ఇవ్వకుండా వృథాగా ఉంచుతున్నారు. వీటిలో పంటలు సాగు చేయడానికి ముందుకొచ్చేవారికి పెట్టుబడి కింద నిధులు ఇస్తే అదనంగా పంటలు పండించడానికి మార్గం ఏర్పడుతుందని అంచనా. ఇవికాకుండా సాగుకు ఏమాత్రం అనుకూలంగా లేక రాళ్లు, రప్పలతో నిండి ఉన్న బీడు భూములను సైతం వ్యవసాయ భూముల కోటాలో చూపారు. ఇలాంటి వాటికి రూ. 4,000 వేల చొప్పున ఇవ్వడం వృథా అని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ పథకానికి బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయిస్తారనే దానిపై ఆర్థికశాఖతో వ్యవసాయశాఖ చర్చిస్తోంది. సాగుభూముల లెక్కల ఆధారంగానిధులివ్వాలని వ్యవసాయశాఖ కోరింది.

విడుదల పద్ధతి మార్చాల్సిందే

సాధారణంగా బడ్జెట్‌లో ఆర్థిక సంవత్సరం మొత్తానికి కేటాయించిన నిధులను ప్రతీ త్రైమాసికానికి 4వ వంతు చొప్పున ఆర్థికశాఖ విడుదల చేయడం ఆనవాయితీ. ఈ పద్ధతిలో పలు పథకాలకు ఏటా 4వ త్రైమాసికంలో నిధులివ్వకుండా ఆపేస్తారు. కానీ పెట్టుబడి పథకానికి ఆ నిబంధనలు వర్తించకుండా ప్రత్యేక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పథకానికి కేటాయించే మొత్తం నిధులు రూ. 9,727 కోట్లలో 54 శాతం (రూ. 5,247 కోట్లు) ఒకేసారి మే 15కల్లా వ్యవసాయశాఖకు విడుదల చేయాలి. తిరిగి అక్టోబరుకల్లా మిగతా 46 శాతం ఇచ్చేయాల్సి ఉన్నందున త్రైమాసికం నిబంధనల జాబితా నుంచి ఈ పథకానికి మినహాయించాలని ఆ శాఖ కోరింది.



మానవ జీవిత కాలం 140 ఏళ్లు!

- సుసాధ్యం చేయనున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం
- మరికొన్ని దశాబ్దాల్లోనే సాకారం

దావోస్: వైద్య రంగంలో నూతన ఆవిష్కరణల పుణ్యమా అని మానవులకు 140 ఏళ్లు బతికే అవకాశం కలుగుతుంది. వ్యాధుల నిరోధం సాధ్యమయి ఆసుపత్రులు కేవలం ప్రమాదాలకు చికిత్సలు చేసే కేంద్రాలుగా మారిపోతాయి. అంబులెన్స్‌లకు 5జీ సాంకేతిక పరిజ్ఞానం అమర్చనుండడంతో ప్రయాణంలోనే అన్ని పరీక్షలూ పూర్తవుతాయి. ఇవన్నీ మరికొన్ని దశబ్దాల్లోనే సాధ్యమవుతాయి. ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా ‘నాలుగో పారిశ్రామిక విప్లవ సాంకేతిక పరిజ్ఞానంతో ఆరోగ్యభద్రత రూపాంతీకరణ’ అనే అంశంపై బుధవారం జరిగిన చర్చలో పాల్గొన్న నిపుణులు వైద్య రంగ భవిష్యత్తును ఆవిష్కరించారు.



కృత్రిమ మేధస్సుతో మరిన్ని ఆవిష్కరణలు: సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు సాయంతో ఇంతవరకు జరిగిన పరిశోధనలకు కొనసాగింపుగా వైద్య శాస్త్రవేత్తలు మరిన్ని ఆవిష్కరణలు చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ‘వ్యాధిగ్రస్థుల మొత్తం సమాచారం శాస్త్రవేత్తలకు తక్షణమే అందుబాటులోకి వస్తుంది. ఆసుపత్రుల యాజమాన్య పద్ధతులే పూర్తిగా మారిపోతాయి. వ్యాధిగ్రస్థులతో జరిపే సంభాషణల ఫలితాలు వెంటవెంటనే నమోదవుతాయి. దీనివల్ల పరిపాలన యంత్రాంగం భారం, ఖర్చులు తగ్గుతాయ’ని వివరించారు.

నోకియా కార్పొరేషన్ అధ్యక్షుడు, సీఈవో రాజీవ్ సూరి ప్రసంగిస్తూ దీర్ఘకాలిక వ్యాధుల కారణంగానే 60 శాతం మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ముందుగా గుర్తిస్తే ఇవన్నీ నివారించదగ్గవేనని చెప్పారు. ముందస్తుగా గ్లూకోజ్, కార్టిసాల్ స్థాయి తెలుసుకునేందుకు పరికరాలు తయారు చేయనున్నట్టు చెప్పారు. వీటిని శరీరంపై ధరిస్తే సరిపోతుందని, దీంతో ప్రతిసారీ రక్త పరీక్షలు చేయాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. ఫైజర్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అల్బెర్ట్ బౌర్లా మాట్లాడుతూ ఇంతవరకు సాంకేతిక పరిజ్ఞానం, ఆరోగ్య పరిరక్షణ వేరువేరు ప్రపంచాల్లా ఉండేవని, ఇప్పుడు అవి ఢీకొననున్నాయని చెప్పారు. ఇది మంచికేనని, వ్యాధిగ్రస్థులకు త్వరగా వైద్యం అందుతుందని, వ్యాధి నిర్ధరణ సులువవుతుందని తెలిపారు.

మరో కేసులోనూ లాలుకు జైలు

దాణా కుంభకోణంలో ఐదేళ్ల శిక్ష విధించిన సీబీఐ న్యాయస్థానం



రాంచి: దాణా కుంభకోణానికి సంబంధించిన మరో కేసులో ఆర్‌జేడీ అధినేత లాలు(69)ను సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం దోషిగా తేల్చింది. మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రను కూడా దోషిగా తేల్చిన సీబీఐ జడ్జి ఎస్.ఎస్.ప్రసాద్ వీరికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. 1990ల్లో ప్రభుత్వ ఖజానా నుంచి అక్రమంగా రూ. 37.62 కోట్లను విత్‌డ్రా చేసిన వ్యవహారానికి సంబంధించిన కేసు ఇది. ఇదే కేసులో మరో 48 మందిని కూడా సీబీఐ జడ్జి ఎస్.ఎస్.ప్రసాద్ దోషులుగా నిర్ధారించారు. వీరిలో మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ఐఏఎస్ అధికారులు ఉన్నారు. తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని ఆర్‌జేడీ వెల్లడించింది. దాణా కుంభకోణానికి సంబంధించే మరో కేసులో లాలు ప్రస్తుతం బిర్సా ముందా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. అంతకు ముందు దాణా కుంభకోణానికే సంబంధించి మరో కేసులోనూ లాలును న్యాయస్థానం దోషిగా తేల్చింది.

లాకప్‌లో కోడిపుంజులు

కోర్టు వాయిదాతో స్టేషన్‌కు చేరిన కోళ్లు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఈమధ్య కాలంలో జరిగిన కోడి పందేలపై స్థానిక పోలీసులు వరసగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తొమ్మిది పుంజులతో పాటు ఎనిమిది మంది నిందితులను పట్టుకున్నారు. నిందితులను వ్యక్తిగత పూచీపై విడిచిపెట్టారు. తరువాత పుంజులను, నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. మిగిలిన ప్రాంతాల్లో పట్టుకున్న కోడిపుంజులతో సహా అన్నింటినీ ఒకేసారి ప్రవేశపెట్టాలన్న కోర్టు ఆదేశాల మేరకు వీటిని తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఎస్సై దీనబంధు తెలిపారు. దీంతో అచ్యుతాపురం పోలీసు స్టేషన్ పుంజులతో కళకళలాడుతుంది.

అల్జీమర్స్‌కు పసుపు దివ్యౌషధం!!

లాస్‌ఏంజెలిస్: జ్ఞాపకశక్తిని పెంపొందించడంలో పసుపు ఎంతో ఉపకరిస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా అల్జీమర్స్‌కు ఇది చక్కటి విరుగుడని అమెరికన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పసుపులో సమృద్ధిగా ఉండే ‘కుర్కుమిన్’కు వాపును తగ్గించే గుణాలు, యాంటీఆక్సిడెంట్ సుగుణాలు ఉన్నట్లు ఇదివరకే ప్రయోగాత్మకంగా రుజువైంది. అయితే, మతిమరుపు సమస్యకు కూడా ఇది చక్కటి విరుగుడని తాజాగా రుజువైనట్లు వారు వెల్లడించారు. శాస్త్రవేత్తలు తొలుత 50-90 ఏళ్ల వయసున్న...స్వల్ప మతిమరుపుతో ఇబ్బందిపడుతున్న 40 మందిని ఎంపిక చేసుకుని వారిపై పసుపు ప్రభావాన్ని అధ్యయనం చేశారు. మొదట వారి రక్తంలో కుర్కుమిన్ శాతాన్ని నమోదు చేసుకున్నారు. అంతేకాదు, వారి మెదడులో జ్ఞాపకశక్తిని ప్రభావితం చేసే అమిలాయిడ్, ప్రొటీన్ శాతాన్ని కూడా ‘పెట్’ స్కానింగ్ ద్వారా పరీక్షించారు. అనంతరం వారందరికీ కూడా 18 నెలల పాటు క్రమం తప్పకుండా ప్రతి రోజూ 90 మిల్లీగ్రాముల కుర్కుమిన్‌ను ఇచ్చారు. ఆ తర్వాత నిర్వహించిన పరీక్షల్లో వారిలో మతిమరుపు సమస్య గణనీయంగా తగ్గడంతో పాటూ.... ఏకాగ్రత కూడా పెరిగినట్లు వెల్లడైంది.

ఛత్తీస్‌గఢ్‌లో కాల్పుల మోత

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సైలు మాల్‌చందు, కౌశిక్‌లతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. మరోవైపు బీజాపూర్ జిల్లాలోని బాసగూడా అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఇందులో తీవ్ర గాయాలపాలైన లక్నాగడ్‌పాల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంజినీరింగ్, సాంకేతిక కోర్సుల బోధనాప్రణాళికకు మార్పుచేర్పులు!

ప్రాక్టికల్స్ మీదే ప్రధానంగా దృష్టి

దిల్లీ: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, సాంకేతిక కోర్సుల బోధనా ప్రణాళికకు ‘అఖిల భారత సాంకేతిక విద్యామండలి’(ఏఐసీటీఈ) మార్పుచేర్పులు చేసింది. సవరించిన బోధనా ప్రణాళికను కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ బుధవారం నాడిక్కడ విడుదల చేశారు. ఈ బోధనాప్రణాళిక ప్రకారం డిగ్రీకి అవసరమైన క్రెడిట్‌లను 220 నుంచి 160కి తగ్గించారు. కొత్త బోధనా ప్రణాళికలో అధికంగా ప్రయోగశాలలో ప్రాక్టికల్స్ మీదే దృష్టిపెట్టినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. థియరీ కంటే ప్రయోగశాల అసైన్‌మెంట్లకే అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు పేర్కొన్నారు. మారుతున్న అవసరాల మేరకు ఏటా బోధనా ప్రణాళికకు మార్పుచేర్పులు చేయడం తప్పనిసరన్న అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేశారు. సవరించిన బోధనా ప్రణాళిక ప్రకారం సంబంధిత పరిశ్రమలో విద్యార్థులు తప్పనిసరిగా రెండు నుంచి మూడునెలల పాటు ఇంటర్న్‌షిప్ చేయాల్సిందే. ఈ విషయంలో వేసవి సెలవుల్లోనూ మినహాయింపులేమీ ఉండవు. అంటే... , సదరు ఉద్యోగం కోసం తగిన నైపుణ్యాలను విద్యార్థులు సముపార్జించుకోవాలన్నదే లక్ష్యమని ఏఐసీటీఈ ఛైర్మన్ అనిల్ సహస్రబుధే తెలిపారు.

ఆమె కోపంగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)

టెర్రకోట పోత సాయంతో సిలికాన్‌తో ఆమె ముఖాన్ని పునఃనిర్మించారు.

ఆమె కోపంగా ఎందుకుందని ప్రశ్నించగా ముఖ పునఃనిర్మాణంలో పాలుపంచుకున్న ఆర్థోడాంటిక్స్ ప్రొఫెసర్ మనోలిస్ పపాగ్రికోరకిస్ సరదాగా స్పందిస్తూ ‘ఆ నాటి కాలంలో కోపంగా ఉండడం ఆమెకు సాధ్యం కాదు.’ అన్నారు. రక్తహీనత, స్కర్వీ (సి-విటమిన్ లోపంతో వచ్చే వ్యాధి)తో డాన్ బాధపడి ఉండొచ్చని పరిశోధకులు చెప్పారు. తుంటి, కీళ్ల సమస్యలుండొచ్చని కూడా ఆధారాలను బట్టి అంచనాకు వచ్చారు. ఈ కారణంగానే కదలలేకపోయి ఉండొచ్చని, ఫలితంగానే మరణించి ఉండొచ్చని విశ్లేషించారు. క్రీ.పూ 7వేల ఏళ్ల నాడు జీవించిన ఆమె అవశేషాలను 1993లో గ్రీస్‌లోని థెస్సలే ప్రాంతంలోని థియోపెట్రా అనే గుహలో కనుగొన్నారు. నాగరికత చివుళ్లు వేస్తున్న కాలంలో ఆమె జీవించింది కాబట్టి డాన్ అని పేరు పెట్టారు. ఈ గుహలో తొలుత పదివేళ్ల ఏళ్ల క్రితం మానవ సంచారపు ఆనవాళ్లు ఉన్నాయి. పాత రాతి యుగం, మధ్య రాతి యుగం, కొత్త రాతి యుగం నాడు ఉపయోగించిన రాతి ఉపకరణాలు, కొత్త రాతి యుగం నాటి మట్టి పాత్రలు ఆ గుహలో లభించాయి. ఏథెన్స్‌లోని ఆక్రోపాలిస్ ప్రదర్శనశాలలో డాన్‌ను ప్రదర్శనకు ఉంచారు.

గ్రహం అనుగ్రహం

25–1–2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
అష్టమి: ఉ. 10-39 తదుపరి నవమి
భరణి నక్షత్రం: తె. 3-34 తదుపరి కృత్తిక
అమృత ఘడియలు: రా. 10-56 నుంచి 12-29 వరకు
వర్జ్యం: మ. 1-40 నుంచి 3-13 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-19 నుంచి 11-04 వరకు
తిరిగి మ. 2-47 నుంచి 3-32 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-46

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.4	30.5
మెదక్	14.2	34.9
కరీంనగర్	15.0	32.0
నిజామాబాద్	16.0	30.0
హైదరాబాద్	16.2	31.4
రామగుండం	16.6	30.6
హన్మకొండ	17.0	31.0
మహబూబ్‌నగర్	18.5	32.4
ఖమ్మం	19.0	31.0
సూర్యాపేట	19.0	34.0

మకరందం

ఈనాడు 7

హైదరాబాద్, గురువారం
జనవరి 25, 2018

మా చిరునామా: మకరందం
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
makarandam@eenadu.in

జర్మన్ భాషావేత్త మాక్స్‌ముల్లర్‌ను అక్కడి విలేకరులు అడిగారు... 'పునర్జన్మ ఎలా ఉండాలని ప్రభువును కోరుకుంటారు' అని... 'భారత దేశంలో పుట్టించమని అడుగుతాను'... ఠక్కున సమాధానం చెప్పారాయన...

- ప్రఖ్యాత షెహనాయ్ విద్వాంసులు, రససిద్ధులు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌ను అమెరికాలో స్థిరపడమని, కోరినవన్నీ ఇస్తామని ఒత్తిడి చేశారు అక్కడి ప్రముఖులు 'అమెరికాకు నాతోపాటు గంగామాయి ఎలా వస్తుంది?' అని ప్రశ్నించారాయన.
- ఈ ప్రపంచాన్ని రైలుబండితో పోలుస్తూ సత్యసాయిబాబా 'భారతదేశం దానికి ఇంజిను' అన్నారు. అప్పుడు విదేశీ పాత్రికేయులు ఆయనను అడిగారు 'దేవతలందరూ మీ దేశంలోనే ఎందుకు పుడతారు?' అని దానికి బాబా బదులిస్తూ 'డ్రైవర్ ఇంజిన్‌లో కాకపోతే బోగీల్లో ఎక్కుతారా?' అని ప్రశ్నించారు.
- స్వామి వివేకానంద చికాగో ప్రసంగాలను సమీక్షిస్తూ "భారతీయమైన ఆత్మజ్ఞానం, ఆధ్యాత్మిక శక్తి ఆయనలో ఉప్పొంగాయి. ఆ దేశపు ప్రత్యేకత విశ్వానికి వెల్లడయింది' అని ఒక పత్రిక రాసింది.

మహాత్ములు, కారణజన్ములు సైతం ఈ దేశాన్ని అదే విధంగా దర్శించారు. తరించారు!

'నాదేశం భగవద్గీత..
నా దేశం అగ్ని పునీత
సీత... నా దేశం
కరుణాంతరంగ..
నా దేశం సంస్కార గంగ'
డా.సి. నారాయణరెడ్డి

అత్యున్నత ఆశయాలు, ఉదాత్త లక్ష్యాలు, ఉత్తమ భావాలు కలిగిన ఓ వ్యక్తి కోరుకునేవన్నీ భారతదేశంలో పుష్కలంగా ఉన్నాయి. ఇది నా దేశం కాబట్టి నేను ప్రేమించడం లేదు. విశిష్ట లక్షణాలను ఇక్కడ గమనించాను కాబట్టి ప్రేమిస్తున్నాను.
- మహాత్మాగాంధీ

జన గణ మనం ఆధ్యాత్మిక ఘనం

నిజానికి భారతదేశమే ఒక తత్త్వశాస్త్ర గ్రంథం. సనాతన ధర్మమనే పటిష్ఠ పునాదులపై వెలసిన నిలువెత్తు హర్మ్యం. ఆధ్యాత్మికత దాని జీవ రసాయనం. ఆధ్యాత్మికత అంటే మతం కాదు. అదో గొప్ప నాగరికత. సంఘ జీవన హుందాతనాన్ని పెంచే సామాజిక ఉద్యమం. మనిషిని అభివృద్ధి వైపు ప్రోత్సహించే మహా చైతన్యం. ఒక జాతి నాగరికతను అంచనా వేయాలంటే ఆ దేశ జనాభా లెక్కలు పనికిరావు. సంస్కృతీ స్వరూపమే దాన్ని నిర్ణయిస్తుంది. 'నాగరికత అనే పదార్థానికి రూపాన్నిచ్చేది సంస్కృతి' అని అరిస్టాటిల్ నిర్వచనం. చాలా దేశాలు పురుడు పోసుకోకముందే మన దేశ సంస్కృతి, నాగరికత సర్వసంపన్నంగా అలరారాయి. ఆ వైభవానికి మూలం మన ఆధ్యాత్మిక నేపథ్యమేనన్నది నిస్సందేహం. ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా.. భారతదేశాన్ని 'భగవంతుడి అనుగ్రహం పొందిన దేశాల్లో ముందు వరసలోని'దన్న నేపథ్యం ఇదే.

మనకు ఇష్టదైవం ఒకరు ఉంటారు. రాముడో, కృష్ణుడో, అల్లాహ్, క్రీస్తు ... ఇలా. వారిపై మన భక్తి వ్యక్తిగతం. కానీ దేశభక్తి నిర్వచనం వేరు. ఇక్కడ భక్తి అంటే ప్రేమ, గౌరవం. ఇక్కడున్న ప్రజలు, మట్టీ, నీరూ, చెట్టూ, పుట్టా, వనరులు అన్నిటిపై అవ్యాజమైన అనురాగం. ఇది నాది అనే భావన. ఈ దేశాన్ని ప్రేమించడమంటే దాని జీవ లక్షణాన్ని గురించి తెలుసుకోవాలన్న తపన పెంచుకోవడమే. ప్రజల అభిరుచులు, ఆచార వ్యవహారాలు, అన్నపానీయాలు, వస్త్రాభరణాలు, కళ, సంగీత, సాహిత్య, విజ్ఞాన విశేషాలు, భాషలు... ప్రజల మనుగడలో నుంచి తొంగిచూసే అన్ని అంశాలను కలిపి పోగేస్తే అది ఆ దేశపు సాంస్కృతిక స్వరూపమవుతుంది. ఓ జాతి నాగరికతను, ఔన్నత్యాన్ని అంచనా వేయాలంటే ఆ దేశంలో విలసిల్లిన సాంస్కృతిక వైభవాన్ని అర్థం చేసుకోవాలి.

పండగల్లో, పుష్కరాల్లో, కుంభమేళాల్లో ఈ దేశ సంస్కృతికి చెందిన విశ్వచైతన్యంతో పరిచయం కలుగుతుంది. అయితే భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో రెండు పండగలు మాత్రం అందరివీ. ఒకటి స్వాతంత్ర్య దినోత్సవం, రెండోది గణతంత్ర దినోత్సవం. ఈ పండగల సందర్భంగా దేశంపై కలిగిన భక్తిని కడదాకా కాపాడుకుంటున్నామా? ఈ సంస్కృతికి నిజమైన వారసులవుతున్నామా? అనేది నిరంతరం సమీక్షించుకోవాలి. 'నేనంతా ఓ పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలం ఎత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరు ఉంటుంది' అన్నారు కవి శేషేంద్రశర్మ. ఆ పోలిక ఆత్మగౌరవానికి పరాకాష్ఠ. జైహింద్ అనేది మామూలు పదం కానే కాదు. దేశమాతకు ఇష్టమైన సుస్వరవేదం. 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అన్న తిలక్ మహాశయుని పిలుపు స్వాతంత్రోద్యమానికి ఇచ్చిన ఊతం అంతా ఇంతా కాదు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలు అలాంటి ఉజ్వల ఘట్టాలను సంస్మరించుకోవాల్సిన రోజులు. జాతి ఉత్తేజానికి ఉత్ప్రేరకాలు. 'అనో భద్రాణి క్రతవోయన్తు విశ్వతః' అన్నది భారతీయ ఆధ్యాత్మిక సందేశం. దశ దిశల నుంచి సర్వోన్నతమైన ఆలోచనలు మానవాళిని ఆవరించుగాక అని రుగ్వేదం దీవించింది. ఆ భావ వైశాల్యం భారతదేశ సంపద.

భారతదేశం ఒక అద్భుత కూడలి. ఎన్నో సంప్రదాయాలు, ఆచారాలు, పండగలు, పబ్బాలు, విభిన్న సంస్కృతుల మేలు కలయిక. అవన్నీ అమూల్య మణిమాణిక్యాలనుకుంటే వాటిని దండలో దారంలా కలిపి ఉంచేది ఈ దేశ ఆధ్యాత్మిక చైతన్యం. దాని సమ్మోహనశక్తి అనన్య సామాన్యం. ఈ దేశం ఇప్పటికీ ఒక్కటిగా ఉందంటే ఆ చైతన్యమే మూల సూత్రం. దేశ విదేశాలు మనకేసి చూపు సారించడానికి ఆ శక్తే కారణం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తున్న ఆధ్యాత్మిక కాంతి పరివేషమే ఈ దేశ ప్రధాన ఆకర్షణ. ఈ ఆకర్షణే వివేకానందుణ్ణి అంతర్జాతీయ వేదికలపై విజేతను చేసింది. వివిధ దేశాల తత్త్వవేత్తలను విశేషంగా ఆకర్షించింది. భారతీయ ఆత్మను జాగృతం చేస్తోంది. ఈ దేశ సమైక్యతకు, సంఘీభావానికి మంత్ర దండమై నిలుస్తోంది. గెలుస్తోంది.

'సాటిలేని జాతి, ఓటమెరుగని కోట నివురుగప్పి నిదురపోతుండాది' అన్న కవి వాక్కు ఇప్పటికీ వర్తిస్తుండడం దురదృష్టకరం. 'దేశమనియెడి దొడ్డ వృక్షం ప్రేమలను పూలెత్తవలెనోయి నరుల చెమటను తడిసి మూలధనం పంటలు పండవలెనోయి' అన్న గురజాడ ప్రబోధం ఇప్పటికీ, ఎప్పటికీ జాతికి దిశానిర్దేశమే. 'ఏ పూర్వపుణ్యమో ఏ యోగ బలమో జనియించినాడనీ స్వర్గ ఖండమ్మున' అన్న దివ్యభావన గుండె పొరలను తాకితే మన ఖ్యాతి నిత్యస్మరణీయం అవుతుంది.

-ఎర్రాప్రగడ రామకృష్ణ



మేరా భారత్ మహాన్

కథా స్రవంతి



మరి ఆ దేవుడి మాటో!

ఈ ప్రపంచం మంచిచెడుల సమ్మిళితం. దుర్మార్గుల ప్రభావం నుంచి తప్పించుకోవడానికి మన విచక్షణా శక్తిని ఉపయోగించాలి. శాస్త్ర గ్రంథాలను, మహానుభావుల బోధలను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతే తమకు తామే కష్టాలను ఆహ్వానించిన వారవుతారు.

ఒక అడవిలో ఒక రుషి, తన శిష్యులనేక మందితో కలిసి ఉండేవాడు. ఆయన తన శిష్యులకు భగవంతుడిని అన్ని జీవుల్లో దర్శించి, నమస్కరించమని చెప్పాడు. ఒక రోజు శిష్యులు హోమంలోకి సమిధలు తీసుకురావడానికి అడవిలోకి వెళ్లారు.

హఠాత్తుగా వారికి 'తప్పుకోండి! దారిలో అడ్డం లేవండి! ఒక పెద్ద మదపుటేనుగు వస్తోంది' అనే కేక వినిపించింది.

ఒక శిష్యుడు తప్ప మిగిలిన వారంతా పరిగెత్తారు. అతను మాత్రం ఏనుగులో కూడా మరో రూపంలో భగవంతుడు ఉన్నాడు కాబట్టి అక్కడి నుంచి పరిగెత్తాల్సిన అవసరం ఏం వచ్చిందని వాదించాడు. కదలకుండా అక్కడే నిల్చొని, ఆ ఏనుగుకు నమస్కరించి స్తుతించసాగాడు.

మావటి వాడు 'పారిపో, పారిపో' అని కేకలు పెట్టాడు కానీ శిష్యుడు కదల్లేదు.

ఆ ఏనుగు అతన్ని తొండంతో పట్టుకుని ఒక మూలకు గిరాటేసి తన దారిన తాను వెళ్లిపోయింది. శిష్యుడు గాయాలు తగిలి స్పృహ తప్పి నేలపై పడిపోయాడు.

జరిగిన సంగతి తెలుసుకుని గురువుగారు, ఇతర శిష్యులు అక్కడకు వచ్చి అతన్ని ఆశ్రమానికి తీసుకెళ్లారు. కొన్ని మందులు వేయగానే అతనికి స్పృహ వచ్చింది.

అప్పుడు శిష్యులలో ఒకరతనిని..'ఏనుగు వస్తోందని నీకు తెలుసు కదా - ఆ ప్రదేశం వదిలి ఎందుకు పోలేదని' అడిగాడు. దానికి బదులుగా అతడు 'భగవంతుడే అన్ని జీవుల, మానవుల, జంతువుల రూపం ధరించాడని గురువుగారు చెప్పారు కదా. దేవుడే ఏనుగు రూపంలో వస్తున్నాడని నేనక్కడి నుంచి వెళ్లలేద'ని అన్నాడు.

అప్పుడా గురువుగారిలా చెప్పారు. 'అవును నాయనా! ఏనుగు దేవుడు వస్తున్న మాట నిజమే! కానీ, మావటి దేవుడు నిన్ను పారిపొమ్మని కేకలు పెట్టాడు కదా! మరి అతని మాటలు ఎందుకు పెడచెవిన పెట్టావు. ఆ మావటి దేవుడి మాటలు విని ఉండాల్సింది'.

మంచివారు - చెడ్డవారు అనే బేధం లేకుండా భగవంతుడు సర్వజీవుల హృదయాల్లో ఉన్నాడన్న మాట నిస్సందేహం. అయినా మంచి వారితోనే సన్నిహితంగా మెలగాలి. దుర్మార్గునికి దూరంగా ఉండాలి. ఇదీ ఇందులో నీతి.

– రామకృష్ణ కథామృతం నుంచి

సోదరా... సలామ్!

ఇస్లాం సందేశం



'అస్సలాము అలైకుమ్' ఇద్దరు ముస్లిమ్‌లు కలుసుకున్నప్పుడు చెప్పుకునే మాట. 'అస్సలాము ఖబలల్ కలామ్' అంటే మాట్లాడే ముందు పరస్పరం సలాములు తెలుపుకోండి అనే ప్రవక్త బోధనను అనుసరించి ముస్లిమ్‌లు పరస్పరం సలాములు తెలుపుకుంటారు.

'అస్సలాము అలైకుమ్' అంటే 'నీపై శ్రేయో శుభాలు వర్షించుగాక' అని భావం. తోటివారి శ్రేయస్సును అభిలషించడమే సలామ్ ప్రధాన ఉద్దేశం. సలామ్.. ఇస్లామ్ చిహ్నాలలో ఒకటి. ఇది ఇస్లామ్ నైతిక, ధార్మిక విధి. "ఎదుటివారి ఇంటిలోకి ప్రవేశించినప్పుడు వారికి సలాము చేయండి. ఇది మీ కోసం చేసే ప్రార్థన అల్లాహ్ నిర్దేశించినది. ఇదెంతో పరిశుద్ధమైనది" అని చెబుతుంది దివ్య ఖుర్ఆన్ (24:60).

సలామ్ ప్రత్యేకత గురించి దివ్యఖుర్ఆన్ మాత్రమే కాదు ముహమ్మద్ ప్రవక్త ఎన్నో బోధనలు చేశారు. మనుషుల మధ్య పరస్పరం ప్రేమాభిమానాలు పెంపొందించేందుకు, సంబంధాలను మెరుగుపరిచేందుకు సలామ్ గొప్ప ఆయుధంగా పని చేస్తుందంటారు ఆయన. పండితులు, పామరులు, చిన్నా-పెద్దా తేడా లేకుండా ఎవరైనా.. ఎవరికైనా సలామ్ చేయవచ్చు. సలామ్ చేసేవారు 'అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి వబరకాతుహు' అని సంపూర్ణంగా పలకాలి. 'తోటివారికి ముందుగా సలామ్ చేసేవాడు అల్లాహ్‌కు అత్యంత సన్నిహితుడ'ని అంటారు ప్రవక్త (స). ముందుగా 'అస్సలాము అలైకుమ్' అంటే పది పుణ్యాలు, 'రహ్మతుల్లాహి' అన్నందుకు ఇరవై పుణ్యాలు, 'వబరకాతుహు' అన్నందుకు ముప్పయ్ పుణ్యాలు వారి ఖాతాలో జమవుతాయని ప్రవక్త తెలిపారు. అందుకే సలామ్‌ను సంపూర్ణంగా పలకాలి. దానికి జవాబుగా 'వాలైకుమ్ అస్సలాము రహ్మతుల్లా వబరకాతుహు' అని ప్రతి సలామ్ చేయాలి. 'మీకు ఎవరైనా గౌరవభావంతో సలామ్ చేస్తే.. మీరు అంతకన్నా ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలామ్ చేయండి. కనీసం వారు చెప్పిన విధంగానైనా ప్రతి సలామ్ చేయండి" అంటుంది ఖుర్ఆన్. సలామ్, ప్రతి సలామ్ లాంఛనప్రాయంగా ఉండరాదన్న విషయాన్ని ఇది తెలియజేస్తుంది.

– ఖైరున్నీసాబేగం

ఎలా చేయాలంటే..

- వాహన చోదకులు.. పాదచారులకు, నడిచి వెళ్తున్న వారు.. కూర్చుని ఉన్నవారికి సలామ్ చేయాలి.
- బజారులో తోటి ముస్లిం సోదరుడిని కలిసినప్పుడు కళ్లల్లోకి చూస్తూ.. కరచాలనం చేస్తూ.. శ్రేష్ఠమైన పద్ధతిలో సలామ్ చేయాలి.
- సలామ్, ప్రతి సలామ్ చేసే సమయంలో ఎలాంటి కల్మషం లేకుండా.. స్వచ్ఛమైన హృదయంతో చేయాలి.
- ఎదురుబొదురుగా ఉన్నప్పుడు చేతుల సైగల ద్వారా సలామ్ చేసుకోవడం సమంజసం కాదు. అస్సలాము అని స్పష్టంగా ఉచ్ఛరించాలి. దూరంగా ఉన్న వారికి సైగ ద్వారా సలామ్ చేయడంలో తప్పు లేదు.

క్రీస్తువాణి

అలాంటి వారికి.. ప్రవేశం లేదు



అది ఒక పండగ రోజు. దేవాలయం దగ్గర వందల మంది భక్తులు. ప్రార్థనలు ముగిశాయి. భక్తులు కానుకలు వేసే సమయం. ఒక పెద్దాయన ఎవరెవరు.. ఏయే కానుకలు వేస్తున్నారో బిగ్గరగా చెబుతున్నాడు. కొంతమంది తమ పేర్లను పదే పదే చెప్పించుకుంటున్నారు. ఒక పేద విధవరాలు కానుకల పెట్టె దగ్గరికి వచ్చింది. ఆమె వస్త్రాలు పాతబడి, చిరిగిపోయి ఉన్నాయి. ఆమె శరీరం చూస్తే సరైన ఆహారం కూడా తీసుకోవడం లేదని అర్థమవుతోంది. ఎవరూ చూడకుండా ఆమె తన పిడికిలి తెరిచింది. పండగ పూట దేవుడికి సమర్పించేందుకు ఎన్నో రోజులుగా కష్టపడి కూడబెట్టిన రెండు నాణాలను వినయంగా కానుకల పెట్టెలో జారవిడిచింది. రెండు చేతులూ ఎత్తి దేవున్ని ప్రార్థించి అక్కడి నుంచి కదిలింది.

అక్కడికి వచ్చినవారంతా తమ వృత్తి, వ్యాపారాలలో ప్రముఖులు. ఉన్నతోద్యోగులు. అయితే క్రీస్తు ప్రభువు ఆమెను చూసి.. "కానుకల పెట్టెలో డబ్బులు వేసిన ధనికులైన సమూహం కంటే.. ఆమె ఎక్కువగా కానుకలు వేసింది" అన్నారు. ఈ మాటలకు అంతా ఆశ్చర్యపోయారు. "ఆ పేదరాలు వేసిన రెండు నాణాలు గొప్పవా!?" అని తమలో తాము చర్చ మొదలుపెట్టారు. ఆ మాటలు విన్న ప్రభువు.. "కానుకల పెట్టెలో డబ్బులు వేసిన వారంతా.. తమకు ఉన్నదాంట్లో నుంచి కొంత వేశారు. ఈమె తను లేమిలో ఉన్నా తన కష్టార్జితమంతా దేవునికి ఇచ్చేసింది. అందుకే ఆమె కానుక అమూల్యం" అని సమాధానమిచ్చారు. ఈ మాటలు అక్కడివారందరికీ జ్ఞానోదయం కలిగించాయి. "నీవు దానం చేసే విషయం రహస్యంగా ఉండాలి. నీ కుడి చేయి చేసే దానం.. ఎడమ చేతికి తెలియకుండా ఉండాలి. ఆ క్రమంలో ఇదంతా గమనించే దేవుడు నీకు ప్రతిఫలం ఇస్తాడు. ఆస్తిపై వ్యామోహం ఉన్న వారు దేవుని రాజ్యంలోకి ప్రవేశించడం దుర్లభం" అన్న క్రీస్తు ఉపదేశం సర్వకాలాలకూ వర్తిస్తుంది.

– ఎమ్. సుగుణరావు

ధర్మసందేహం

ఎప్పుడైనా వెళ్లొచ్చు

తిరుపతి యాత్రకు వెళ్లినప్పుడు ముందుగా తిరుపతి, కాణిపాకం తదితర క్షేత్రాలు దర్శించుకొని చివరగా శ్రీకాళహస్తికి వెళ్లాలని కొందరి వాదన. శ్రీకాళహస్తిని దర్శించుకున్న తర్వాత మరే క్షేత్రానికి వెళ్లకుండా నేరుగా ఇంటికి రావాలంటున్నారు. ఇందులో నిజమెంత?

– శ్రీచరణ్, నర్సాపూర్



తిరుమల యాత్రకు వెళ్లినప్పుడు అక్కడికి సమీపంలో ఉన్న కాణిపాకం, శ్రీకాళహస్తి, అరుణాచలం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ ఉంటారు. అయితే ఈ యాత్రలో శ్రీకాళహస్తి చివరి క్షేత్రంగా ఉండాలన్న విశ్వాసం లోకంలో ఉంది. దీనిని దర్శించుకున్న తర్వాత.. యాత్ర ముగించి ఇంటికి వెళ్లాలనడం వెనుక శాస్త్రీయమైన కారణం ఏమీ లేదు. ఇది ఒక ఆచారంగా ప్రచారమైంది. శ్రీకాళహస్తికి జ్ఞానాన్ని ప్రసాదించే క్షేత్రంగా ప్రశస్తి ఉంది. అక్కడ కొలువుదీరిన అమ్మవారు జ్ఞానప్రసూనాంబ. యోగ సంబంధమైన జ్ఞానం సిద్ధించిన తర్వాత ఇక తీర్థయాత్రలతో పని లేదనే అభిప్రాయం ఆధారంగా ఈ ఆచారం వ్యవహారంలోకి వచ్చింది. అంతేకాని, శ్రీకాళహస్తిని ముందుగా దర్శించుకున్నంత మాత్రాన ఎలాంటి దోషాలూ కలగవు. ఈ క్షేత్రాన్ని దర్శించిన తర్వాత తీర్థయాత్ర కొనసాగించవచ్చు.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి

దర్శనీయం



రామనారాయణం... వేద పారాయణం!

ఆకారం... రామబాణం
ఓంకారం... రామ నామం

విజయనగరం దగ్గర నిర్మించిన అద్భుత ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ రామనారాయణం పరిచయం ఇది. విజయనగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఎస్‌పీఎస్ ఛారిటబుల్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలుస్తోంది. 15 ఎకరాల సువిశాల స్థలంలో రాముని ధనుస్సు ఆకారంలో నిర్మించారు. దీనికోసం దేశంలోనే పేరొందిన శిల్పకళాకారులు పనిచేశారు. రామాయణ మహాకావ్యంలోని వివిధ ఘట్టాలను 72 బొమ్మల రూపంలో ఇక్కడ ఆవిష్కరించారు. వీటిని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తీర్చిదిద్దారు. వీటికి వివరణలు తెలుగు, ఆంగ్ల భాషల్లో బోర్డులపై రాసి ఉంచారు. ఇంకా ఇక్కడున్న సీతారామ కల్యాణ మండపం, వాల్మీకి గ్రంథాలయం, అంజనాదేవి అల్పాహారశాల, శబరి అన్నప్రసాదశాల, సుగ్రీవ గోశాల.. అన్నీ ఆకట్టుకుంటాయి. 12 అడుగుల మహాలక్ష్మి, సరస్వతీదేవి విగ్రహాలు, 80 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మన సంప్రదాయాలు, సంస్కృతికి అద్దంపట్టే ఈ నిర్మాణం దివంగత నారాయణం నరసింహమూర్తి సంకల్పంతో సాధ్యపడింది. ఆయన పేరుమీదే ఈ నిర్మాణానికి రామనారాయణం అనే పేరు వచ్చింది.

–న్యూస్‌టుడే, విజయనగరం గంటస్తంభం

GH



ఈనాడు సినిమా

అందంగా... అమాయకంగా... అభినయంలో అపురూపంగా



దర్పం, రాజసం ఉట్టిపడే ఓ అందాల రాజకుమారి...
అందం, అమాయకత్వం ప్రతిబింబించే ఓ ప్రేయసి...
చిలిపిదనం, చలాకీదనం కలగలిసిన ఓ పడుచుపిల్ల...
హుందాతనం, గాంభీర్యం కనబరిచే ఓ ప్రౌఢ...
నటి కృష్ణకుమారి నటజీవన ప్రస్థానంలో
గుర్తుండిపోయే పాత్రలెన్నో!
ఆమె అభినయ వైవిధ్యానికి గీటురాళ్లెన్నో!!

వైవిధ్యమైన నటనకు గీటురాళ్లెన్నో!

ఏ పాత్ర ధరించినా ఆ పాత్రలో ఒదిగిపోవడం కృష్ణకుమారి నైపుణ్యం. ఎలాంటి నటనైనా అది ఆమెకే సాధ్యమనేలా మెప్పించడం ఆమెకు సుసాధ్యం.

● తెలుగు చిత్రసీమకు రెండు కళ్లయిన ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు సరసన అసమాన అభినయాన్ని పండించి రాణిస్తూనే... కాంతారావుతో కలిసి 28జానపద చిత్రాల్లో అభిమానులను అలరించారు. ఎన్టీఆర్‌తో దాదాపు 25 సినిమాలు, అక్కినేనితో సుమారు 18 చిత్రాలు చేసిన కృష్ణకుమారి వారితో దీటైన నటనతో ఆకట్టుకున్నారు. కాంతారావుతో ఎన్నో జానపద చిత్రాల్లో నటించారు. 'బందిపోటు', 'అగ్గిపిడుగు', 'లక్షాధికారి', 'నిండు సంసారం', 'వరకట్నం', 'కులగోత్రాలు', 'భార్యాభర్తలు', 'జ్వాలాద్వీప రహస్యం', 'గురువును మించిన శిష్యుడు', 'చిక్కడు దొరకడు', 'చదువుకున్న అమ్మాయిలు' లాంటి సినిమాల్లో ఆమె నటన గుర్తుండిపోతుంది. ఆమె వైవిధ్యభరితమైన అభినయానికి వెండితెర ఆనవాళ్లు ఎన్నో...

● అమ్మాయిల వెంటపడి తిరిగే ఓ సంపన్నుడు (అక్కినేని) తనను చులకనగా చూస్తే చెంప దెబ్బకొట్టిన ఆభిజాత్యం... అతడే పట్టుదల పట్టి తనను పెళ్లి చేసుకునే పరిస్థితుల్లో ఏమీ చేయలేని నిస్సహాయత... భర్తననే అధికారంతో అతడు తనను వశపరుచుకోవాలని చూసినప్పుడు నిబ్బరంగా తన అయిష్టతను వెలిబుచ్చే ధైర్యం... ఇవన్నీ ఒకే పాత్రలో ఆమె అభినయించిన తీరు 'భార్యాభర్తలు' సినిమాలో చిరస్మరణీయం. తనకిష్టంలేని వాడే పెళ్లిచూపులకు వచ్చినప్పుడు 'ఏమని పాడెదనో ఈ వేళ... మానస వీణ మౌనముగా నిదురించిన వేళ...' పాటలో ఆమె నటన అద్భుతమనే చెప్పాలి. సినిమాలో ఒక సన్నివేశంలో అక్కినేనితో ఆమె, "మనసు ప్రమేయం లేని ఈ దేహమేగా మీకు కావలసింది... అనుభవించండి" అంటూ శరీరాన్ని అప్పగిస్తున్నట్టుగా ముందుకొచ్చి నిలబడుతుంది. నటన మోతాదులో ఏ మాత్రం తేడా వచ్చినా కరుణరసభరితమైన ఆ సన్నివేశం అభాసుపాలవుతుంది. అయితే కృష్ణకుమారి ఆ సన్నివేశాన్ని అద్వితీయంగా పండించారు.

● తాను ప్రేమించింది ఓ సామాన్యమైన యువకుడిని (జగ్గయ్య)... కానీ అతడి స్నేహితుడు (ఎన్టీఆర్) తనను ఇష్టపడతాడు. ప్రియుడి త్యాగంతో అతడి స్నేహితుడికే ఇల్లాలవుతుంది... పెళ్లయ్యాక భర్తకు అనుమానం మొదలవుతుంది... ఇలాంటి కథతో నడిచే 'గుడిగంటలు' సినిమాలో కత్తిమీద సాములాంటి పాత్రను కృష్ణకుమారి అలవోకగా మెప్పించారు. ఓ కన్నెపిల్లగా చలాకీతనాన్ని చూపినా... ప్రేమించినవాడితో పెళ్లికాని పరిస్థితుల్లో బేలతనాన్ని కనబరచినా... పెళ్లయ్యాక భర్త అనుమానిస్తున్నా నిశ్చలంగా తన పవిత్రతను నిరూపించుకునే హుందాతనాన్ని ప్రదర్శించినా కృష్ణకుమారికే చెల్లింది.

● దేశాన్ని గడగడలాడిస్తున్న బందిపోటును పట్టుకోడానికి వెళ్లే ఓ ధీరోదాత్తురాలైన రాజకుమారిగా... ఆ బందిపోటే ప్రజారంజకుడని తెలిసి మనసిచ్చిన అమ్మాయిగా... ఆకట్టుకునే కృష్ణకుమారిని 'బందిపోటు' సినిమాలో చూస్తాం.

● ఇంకా... కులం గోత్రం లేని పిల్లను పెళ్లాడావంటూ అత్తింటి వారు వెలివేస్తే వారి కోసమే పాటుపడుతూ... కులం కన్నా గుణం మిన్న అని నిరూపించి కుటుంబాన్ని కలిపే కోడలిగా 'కులగోత్రాలు' సినిమాలో ఆమె నటన మరుపురానిదే. అలాగే... పేదింటి పిల్లగా ఒకరిని ప్రేమించినా, సంపన్నురాలైన తన స్నేహితురాలు కూడా అతడినే ప్రేమిస్తోందని తెలిసి మానసికంగా నలిగిపోయే పాత్రలో 'చదువుకున్న అమ్మాయిలు'లో చక్కని నటన చూపించింది. అన్ని వ్యసనాలు ఉండి కూడా కపట వేషాలతో తనను ప్రేమించిన వాడిని తన అమాయకత్వంతో ఆకట్టుకుని అతడిని మంచి మార్గంలోకి మార్చిన అమ్మాయిగా 'అంతస్తులు' సినిమాలో అలరించింది. ఇక జానపద, పౌరాణిక చిత్రాల్లో కూడా పాత్రకు తగినట్టు ఒదిగిపోయి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు కృష్ణకుమారి.

"చెడిపోవడమనేది మనిషి మనసును బట్టి ఉంటుంది. నీ వ్యక్తిత్వం, నీ మనోబలం స్థిరంగా ఉంటే ఎక్కడున్నా చెడు జరగదు. నువ్వు సినిమాల్లో నటించడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. మిగతాది నీ విజ్ఞతకే వదిలేస్తున్నా"

- ఇది ప్రముఖ నటి కృష్ణకుమారికి వాళ్ల నాన్నగారు రాసిన ఉత్తరం. సినిమాల్లో అవకాశాల గురించి ఆయనకు తెలియజేస్తూ కృష్ణకుమారి 70 ఏళ్ల క్రితం రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరమిది. మంచి చెడుల వ్యత్యాసం గురించి చెబుతూనే తాను ఎంచుకున్న రంగంలో ప్రవేశానికి అనుమతిస్తూ ఆయనిచ్చిన ప్రోత్సాహం తెలుగు చలన చిత్రసీమకు ఓ అందాల తారను పరిచయం చేసింది. ఓ అసమాన నటి ముందడుగు వేయడానికి దోహదపడింది. అలా కృష్ణకుమారి 1951లో 'నవ్వితే నవరత్నాలు' సినిమాతో వెండితెరపై తొలి అవకాశాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా కన్నా ముందు 'మంత్రదండం' విడుదలవడం విశేషం. అందంతో, అందుకు తగిన నాజూకు తనంతో, అమాయకత్వాన్ని ప్రతిబింబించే ముఖంతో వెండితెరపైకి అడుగుపెట్టిన కృష్ణకుమారి అలనాటి చిత్రాల్లో అప్పటి యువకుల హృదయాలను కొల్లగొడుతూనే సహజమైన అభినయంతో ఆకట్టుకుంటూ తన సినీ ప్రస్థానాన్ని కొనసాగించారు.

చిన్నతనంలోనే వేదాంతం జగన్నాథశర్మ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న కృష్ణకుమారి, సినిమాల్లో ఎలాంటి పాటల్లోనైనా ఉత్సాహంగా నర్తిస్తూ ఆకట్టుకునేవారు. రెండున్నర దశాబ్దాల పాటు దాదాపు 150 చిత్రాల్లో నటించి వైవిధ్యమైన పాత్రలు పోషించిన కృష్ణకుమారి మూడుసార్లు జాతీయ అవార్డులను, రాష్ట్ర స్థాయిలో నంది అవార్డులు, కాంచనమాల, సావిత్రి, ఎన్టీఆర్ అవార్డులు, బ్రిటన్‌లోని బర్మింగ్‌హాం సంస్థ వారి జీవన సాఫల్య అవార్డును... అన్నింటినీ మించి ప్రేక్షకుల హృదయాలలో చెరిగిపోని అభిమానాన్ని ఆర్జించుకున్నారు. అలనాటి అగ్రతారలైన ఎన్టీఆర్, ఏఎన్నార్‌లతో పాటు కాంతారావు, హరనాథ్, జగ్గయ్య లాంటి మేటి నాయకుల సరసన నటించి ప్రేక్షకాదరణ పొందారు.

సంప్రదాయ కుటుంబానికి చెందిన కృష్ణకుమారి, పశ్చిమ బెంగాల్‌లోని నౌహతిలో 1935లో పుట్టారు. ముగ్గురు అక్కచెల్లెళ్లలో ఆమె చిన్నవారు. ప్రముఖ నటి 'షావుకారు జానకి' ఆమె అక్క. మరొక అక్క దేవకి కూడా ఒకటి రెండు సినిమాల్లో నటించినా ఆ తర్వాత చిన్నవయసులోనే చనిపోయారు. తండ్రి ఉద్యోగరీత్యా కృష్ణకుమారి పలు ప్రాంతాల్లో చదువుకున్నారు. రాజమండ్రి, చెన్నై, అస్సాం, కోల్‌కతాల్లో చదువుకుని మెట్రిక్ పూర్తయ్యేనాటికి చెన్నైకి చేరారు. అదే ఆమె నట జీవితానికి మలుపుగా మారింది. ఇంటర్‌లో చేరేలోగానే ఆమెను వెండితెర అవకాశం ఆహ్వానించింది. ఓసారి 'స్వప్న సుందరి' సినిమాకు వెళ్లిన కృష్ణకుమారి, తమిళనాడు టాకీస్ సౌందరరాజన్ కుమార్తె భూమాదేవి కంటపడ్డారు. సౌందరరాజన్ తీయాలని తలపెట్టిన ఓ సినిమాలో కథానాయికగా అమాయకంగా కనిపించే అమ్మాయి కోసం వెతుకుతున్న ఆమెకు కృష్ణకుమారిలో ఆ లక్షణాలన్నీ కనిపించాయి. అలా వచ్చిన అవకాశం గురించి చెబుతూనే కృష్ణకుమారి అప్పటికి కోల్‌కతాలో ఉంటున్న తండ్రికి ఉత్తరం రాయడం, ఆయన వెంటనే సరేనడం జరిగిపోయాయి. ఆ సినిమానే 'నవ్వితే నవరత్నాలు'. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఏకంగా 14 సినిమాల్లో అవకాశాలు వచ్చిపడ్డాయి. అప్పటికి ఆమె వయసెంతనీ? కేవలం పదహారేళ్లు!

సినిమాల్లో చురుగ్గా ఉన్న సమయంలోనే కృష్ణకుమారి, స్నేహితుల ద్వారా పరిచయమైన వ్యాపారవేత్త అజయ్ మోహన్ ఖైతాన్‌ను ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. వారి కుమార్తె దీపిక. పెళ్లయ్యేనాటికి కృష్ణకుమారి నటించిన 'నిండు సంసారం', 'వరకట్నం' సినిమాలు విజయవంతంగా ఆడుతున్నాయి. అవకాశాలు చేతినిండా ఉన్నా ఆమె గృహిణిగానే ఉండడానికి ఇష్టపడ్డారు. అయితే పెళ్లయిన రెండేళ్లకు భర్త ప్రోత్సాహంతో నటించడం మొదలు పెట్టి దాదాపు 50 సినిమాలు చేశారు.

మరపురాని సంఘటనలు

భయపెట్టిన ఆడ గుర్రం రక్షించిన మగ గుర్రాలు

'వగల రాణివి నీవే...సొగసు కాడను నేనే...' పాటను సినీ సంగీత ప్రియులు మర్చిపోలేరు. 'బందిపోటు' చిత్రంలోని ఈ పాటలో ఎన్టీఆర్ చెట్టుపై కూర్చొని పాట పాడుతుంటే, కృష్ణకుమారి గుర్రంపై వస్తుంటుంది. ఆ పాటను కృష్ణకుమారి జీవితంలో మర్చిపోలేరు. ఎందుకంటే పాట చిత్రీకరణ సమయంలో జరిగిన సంఘటనే దానికి కారణం. కృష్ణకుమారికి గుర్రపుస్వారీ రాదు. ఈ విషయం చిత్ర దర్శకుడు విఠలాచార్యకు చెబితే "ఏం ఫర్లేదు, అది మచ్చికైన గుర్రం, బాగా మెతకది' అన్నారట. ఆ ధైర్యంతో గుర్రం ఎక్కేశారు కృష్ణకుమారి. కొద్దిసేపు బాగానే ఉన్నా సీన్ మొదలుకాగానే గుర్రం పరుగు లంకించుకొంది. భయమేసి గుర్రాన్ని పట్టేసుకున్నారట కృష్ణకుమారి. ఇలాంటి సంఘటన ఏదో జరుగుతుందేమో అని ముందే జాగ్రత్తపడ్డారు విఠలాచార్య. సెట్‌కి కొంత దూరంలో ఓ నాలుగు మగ గుర్రాల్ని నిలబెట్టారు. ఇంకేముంది... వాటిని చూడగానే ఆడ గుర్రం ఆగిపోయింది. కృష్ణకుమారికి ప్రాణం లేచి వచ్చినట్లైంది.

ఆ రోజు ఎన్టీఆర్ లేకపోతే..!



కృష్ణకుమారికి ప్రాణ గండం తప్పిన మరో సంఘటన ఉంది. 'లక్షాధికారి' చిత్రంలో 'దాచాలంటే దాగదులే... దాగుడు మూతలు సాగవులే..' పాట చిత్రీకరణ జరుగుతోంది. ఎన్టీఆర్, కృష్ణకుమారి చేయి చేయి పట్టుకొని సముద్రపు ఒడ్డున నడుచుకొంటూ వెళ్లే సన్నివేశమది. కానీ అనుకోకుండా ఓ పెద్ద కెరటం వచ్చి ఇద్దర్నీ లోపలికి లాగేసింది. ఆ దెబ్బకు భయంతో కృష్ణకుమారి నీళ్లు తాగేశారు. ఇక్కడ విశేషమేంటంటే ఎన్టీఆర్ రియల్ హీరో అనిపించుకొన్నారు. అంత జరిగినా ఆయన కృష్ణకుమారి చేయి వదల్లేదట. ఎలాగోలా ఆమెను ఒడ్డుకు లాక్కొచ్చారు. ఈ సంఘటన కృష్ణకుమారి పలు సందర్భాల్లో గుర్తుచేసుకొనేవారు.

వగలరాణి హుషారైన గీతాలు

తెలుగులో అగ్రకథానాయకుల సరసన వందల కొద్దీ గీతాల్లో హుషారుగా ఆడిపాడింది కృష్ణకుమారి. ఓ రాకుమారిగా కలల రాకుమారుడి గురించి ఊహల్లో తేలిపోతూ పాటేసుకున్నా, కాలేజీ అమ్మాయిగా ప్రియుడితో డ్యూయెట్ అందుకున్నా... కృష్ణకుమారి తన అభినయంతో దానికి మరింత వన్నె తెచ్చేది. కృష్ణకుమారి మురిపించిన మరపురాని గీతాలు మచ్చుకు కొన్ని...

ఊహలు గుసగుసలాడే నా హృదయం ఊగిసలాడే... (బందిపోటు)
వగలరాణివి నీవే సొగసుకాడను నేనే... (బందిపోటు)
ఈ మౌనం ఈ బిడియం ఇదేనా ఇదేనా చెలియ కానుక... (డాక్టర్ చక్రవర్తి)
తెల్లచీర కట్టుకున్నది ఎవరి కోసము... (అంతస్తులు)
ఓహో బస్తీ దొరసాని... (అభిమానం)
మబ్బులో ఏముంది... నా మనసులో ఏముంది... (లక్షాధికారి)
నా కంటి పాపలో నిలిచిపోరా (వాగ్దానం)
ఏమో ఏమో ఇది నాకేమో ఏమో అయినది... (అగ్గిపిడుగు)
ఏడేడు జన్మల నుండి పడి ఉంది బ్రహ్మముడి (గురువును మించిన శిష్యుడు)
చిలిపి కనుల తీయని చెలికాడా... (కులగోత్రాలు)



ఒక్క ఏడాదిలో 16 సినిమాలు!



● తెలుగు, తమిళ, కన్నడ సినిమాల్లో నటించిన కృష్ణకుమారి, అన్ని భాషల్లోనూ స్వయంగా డబ్బింగ్ చెప్పుకోవడం విశేషం.

● బాలీవుడ్‌లో హీరో కిశోర్‌కుమార్‌తో ఒక చిత్రంలో నటించారు కృష్ణకుమారి. అందులో ఆమెను 'రతి' పేరుతో పరిచయం చేశారు. దీనికి కారణం అప్పటికే అక్కడ కృష్ణకుమారి పేరుతో ఓ హీరోయిన్ ఉండటమే. బాలీవుడ్‌లో నటించింది ఒక్క సినిమాలోనే అయినప్పటికీ ఆమెకు వెంటవెంటనే అవకాశాలొచ్చాయి. అయితే ఆమె అంగీకరించలేదు. కొందరు బాలీవుడ్ దర్శకులు ఇంటికి వచ్చి నచ్చచెప్పినా తెలుగు చిత్రపరిశ్రమను వదిలివెళ్లలేదు.

● 'చదువుకున్న అమ్మాయిలు'లో ఏఎన్నార్‌తో యుగళగీతం చిత్రీకరించే సమయానికి కృష్ణకుమారికి పన్నునొప్పి వల్ల బుగ్గ బాగా వాపెక్కింది. అయినా షూటింగ్‌కు ఇబ్బంది కలుగకూడదని స్కార్ఫ్ కట్టుకుని ఆ పాటలో డ్యాన్స్ చేశారు కృష్ణకుమారి. చిత్రమేమిటంటే ఆ పాటతో స్కార్ఫ్ కట్టుకోవడం అప్పట్లో ఓ ఫ్యాషన్‌గా మారింది.

● అందరు అగ్రహీరోలతో పనిచేసిన కృష్ణకుమారి జానపద చిత్రాల్లో గొరిల్లా, చింపాంజీ, సింహం, పులి మొదలైన అన్ని రకాల అడవి జంతువులతోనూ నటించింది. వాటితో పనిచేసే సందర్భంలో కొన్నిసార్లు చిన్నచిన్న ప్రమాదాల నుంచి తప్పించుకుంది.

● స్వతహాగా పాములంటే భయపడే కృష్ణకుమారి 'పార్వతీ కల్యాణం'లో పామును పట్టుకునే సన్నివేశంలో నటించాల్సివచ్చింది. అందులో శివుడు పాత్ర ధరించిన బాలయ్య మెడలో పామును వేసే సన్నివేశం చేయాల్సి వచ్చింది. ఆ సన్నివేశం చేస్తుండగా పాము ఆమె తలపై కాటు వేసింది. ఆ పాముకు నోరు కుట్టబట్టి సరిపోయింది. కానీ ఆ సన్నివేశం తర్వాత ఆమెకు పాముల భయం పోయిందట.

● కృష్ణకుమారి 1963లో ఏకంగా 16 సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. ఒక్క ఏడాదిలో అత్యధిక సినిమాల్లో నటించిన హీరోయిన్‌గా ఆమె రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. మూడునెలల పాటు 3 షిఫ్టులలో ఖాళీ లేకుండా పనిచేసిన కృష్ణకుమారి చాలా సార్లు మేకప్ కుర్చీలోనే కునుకు తీయాల్సి వచ్చేదట.


ఇరవై నాలుగేళ్ల చిరంజీవి... సాయిధరమ్



లావణ్య త్రిపాఠి, సాయిధరమ్ తేజ్, వి.వి.వినాయక్, సి.కల్యాణ్

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. వి.వి.వినాయక్ దర్శకత్వం వహించారు. లావణ్య త్రిపాఠి కథానాయిక. సి.కల్యాణ్ నిర్మాత. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో చిత్ర బృందం విలేకరులతో మాట్లాడింది. "సినిమా నిన్నే చూశాం. చాలా సంతృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చింది. మంచి కథ ఇచ్చారు ఆకుల శివ. పాటల్లో సాయిధరమ్‌ని చూస్తే చిరంజీవి గుర్తొచ్చారు. ఇరవైనాలుగేళ్ల చిరంజీవిలా ఉన్నాడ"న్నారు వినాయక్. "ఖైదీ నెం.150 తరవాత వినాయక్‌తో పనిచేయడానికి పెద్ద హీరోలు వస్తారు. కానీ... ఆయన నాకు అవకాశం ఇచ్చారు. ఫిబ్రవరి 9నే వరుణ్‌తేజ్ సినిమా విడుదల అవుతోంది. మా రెండు చిత్రాలూ బాగా ఆడాలని కోరుకుంటున్నా"నని సాయిధరమ్ తెలిపారు. "లక్ష్మి, కృష్ణ, నాయక్ ఈ మూడు చిత్రాలకూ నేనే కథ అందించా. అవన్నీ మంచి విజయం సాధించాయి. 'ఇంటిలిజెంట్' కూడా ఆ జాబితాలో చేరుతుందన్న నమ్మకం ఉంద"న్నారు రచయిత ఆకుల శివ. సి.కల్యాణ్ మాట్లాడుతూ "సాయిధరమ్ ఇంత వరకూ ఇలాంటి స్టెప్పులు వేయలేదు" అన్నారు. కార్యక్రమంలో లావణ్య త్రిపాఠి, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్ని సరిదిద్దుకొని 'భాగమతి' చేశా



"కథనమే నా బలం. 'భాగమతి'ని కూడా కథనానికి ప్రాధాన్యమున్న సినిమాగానే పరిగణిస్తా" అన్నారు దర్శకుడు అశోక్. 'పిల్ల జమిందార్'తో విజయాన్ని అందుకొన్న ఆయన అనుష్క ప్రధాన పాత్రధారిగా 'భాగమతి' తెరకెక్కించారు. శుక్రవారం ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా అశోక్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

"విశ్వజనీనమైన కథతో తెరకెక్కించిన చిత్రమిది. అనుష్క కాకుండా ఈ సినిమాని వేరొకరు చేయలేరేమో అనిపించింది. ఆలస్యమైనా మేం అనుకొన్నట్టుగానే సినిమాని పూర్తి చేశాం. భాగమతి అనేది ప్రాచుర్యం పొందిన పేరు. కథకీ, ఆ పేరుకు సంబంధమేంటన్నది మాత్రం తెరపైనే చూడాలి".

● "నటులే కాకుండా... ఈ సినిమాకి సాంకేతిక నిపుణులు కూడా పాత్రధారులే. ఎక్కువ సన్నివేశాల్లో కనిపించే బంగ్లా కూడా మా దృష్టిలో ఒక పాత్రే. యు.వి.క్రియేషన్స్ ఉన్నతమైన ప్రమాణాలతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది".

● "దర్శకుడిగా నా ఆలోచనలు ప్రేక్షకులకు చేరువ కాకపోతే పరాజయమే ఎదురవుతుంది. అలాంటి తప్పుల్ని సరిదిద్దుకొని ఈ సినిమా చేశా. మనం అనుకొన్న భావోద్వేగాలు కథలో ప్రతిబింబించడం చాలా ముఖ్యం. 'భాగమతి'లో అది పక్కాగా జరిగిందని నమ్ముతున్నా".

● "తదుపరి చేయబోయే సినిమా గురించి ఇంకా ఏమీ ఆలోచించలేదు. ముందు నా భార్యకి కృతజ్ఞతలు చెప్పాలి. యేడాది కిందటే ముగ్గురు పిల్లలకి జన్మనిచ్చింది. నేను లేకుండా వాళ్లని చూసుకోవడమంటే ఎంత కష్టమో ఊహించవచ్చు. అందుకే కొన్నాళ్లు కుటుంబంతో గడిపాక కొత్త సినిమా గురించి ఆలోచిస్తా".

అంజలి రాసిన ప్రేమకథ



శుభాంగి

కార్తికేయ, హిమన్సీ, శుభాంగి పంతే ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఇట్లు అంజలి'. నవీన్ మన్నేల దర్శక నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో ఫస్ట్‌లుక్‌ని ప్రముఖ పాత్రికేయుడు పసుపులేటి రామారావు విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఓ ప్రేమలేఖ చుట్టూ తిరిగే కథ ఇది. ప్రతి సన్నివేశం సహజంగా ఉంటుంది. సున్నితమైన భావోద్వేగాలకు పెద్ద పీట వేశాం. సంగీతం, సాహిత్యం రెండూ ఆకట్టుకుంటాయి. త్వరలోనే టీజర్‌ని విడుదల చేస్తామ"న్నారు.

ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు

రాజ్‌పుత్ మహారాణి పద్మినిగా దీపికా పదుకొణె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పద్మావత్'. సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన ఈ చిత్రం చిత్రీకరణ దశ నుంచే అడుగడుగునా వివాదాల్లో చిక్కుకుంది. చివరికి చిత్ర బృందం సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ కీలక పాత్రల్లో నటించగా సుమారు రూ.200 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. గురువారం హిందీతో పాటు తెలుగులోనూ విడుదలవుతున్న 'పద్మావత్' విశేషాలివీ.



దీపికా పదుకొణె

విడుదలకు సిద్ధం

ప్రస్తుతం ఎక్కడ చూసినా 'పద్మావత్' గురించే చర్చ జరుగుతోంది. చిత్రీకరణ సమయంలో దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీపై ఓ వర్గం చేసిన దాడులు మొదలుకొని సెట్లు తగలబెట్టడం, నటీనటులకు బెదిరింపులు, సెన్సార్ అడ్డంకులు, కొన్ని రాష్ట్రాల్లో నిషేధాలు, అవసరమైతే ఆత్మాహుతికీ తెగబడతామంటూ కొందరి తీర్మానాలు... వెరసి ఓ యుద్ధ వాతావరణాన్ని తలపించింది. 1540లో సూఫీ కవి మాలిక్ ముహమ్మద్ జయసి రాసిన 'పద్మావత్' కవిత ఆధారంగా భన్సాలీ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

కథేంటి: 13వ శతాబ్దానికి చెందిన రాజ్‌పుత్ మహారాణి పద్మిని అందం గురించి చుట్టుపక్కల రాజ్యాల్లో కథలుకథలుగా చెప్పుకుంటుంటారు. ఆమెకు మేవార్ రాజు రాణా రావల్ రతన్ సింగ్ (షాహిద్ కపూర్)తో వివాహమౌతుంది. పద్మిని సౌందర్యం గురించి విని, అల్లా ఉద్దీన్ ఖిల్జీ (రణ్‌వీర్ సింగ్) ఆమెను చూడకుండానే మోహిస్తాడు. ఆమె కోసం సైన్యంతో మేవార్ రాజ్యంపై విరుచుకుపడతాడు. ఖిల్జీని ఎదుర్కోడానికి పద్మిని తన భర్తకు వీరతిలకం దిద్ది యుద్ధ క్షేత్రానికి పంపిస్తుంది. ఆ సమరంలో ఎవరు గెలిచారు? భర్తకు మాత్రమే సొంతం కావాలనుకున్న పద్మిని ఎలాంటి నిర్ణయం తీసుకుందన్న విషయాలు 'పద్మావత్'లో చూడాలి.

విశేషాలు: ఈ చిత్రం కోసం దీపిక రూ.12 కోట్లు పారితోషికం తీసుకుందట. బాలీవుడ్ కథానాయికల్లో అత్యధిక పారితోషికం అందుకున్నది దీపికేనని అంటున్నారు.

● కథానాయకుడు రణ్‌వీర్ సింగ్ తొలిసారి ప్రతినాయకుడి పాత్రలో నటించారు. ఈ పాత్ర కోసం తొలుత సల్మాన్ ఖాన్‌ను సంప్రదించగా తిరస్కరించాడని సమాచారం.

● భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఫలితం ప్రతికూలంగా వస్తే ఎక్కువ నష్టపోకుండా రూ.160 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించారట.

● ఐమ్యాక్స్ త్రీడీ ఫార్మాట్‌లో విడుదలవుతున్న తొలి బాలీవుడ్ చిత్రమిది.

● 1963లోనే రాణి పద్మిని కథతో తమిళంలో 'చితోర్ రాణి పద్మిని' అనే చిత్రం వచ్చింది.

కాలిన గాయాలకు కలబంద!

వంటింట్లో అప్పుడప్పుడు చేతులు కాల్చుకోవడం, గాయాలు చేసుకోవడం సహజమే. పెనమో, వేడి గిన్నో చేయికి తగిలి చురుక్కుమనడం మనకు అనుభవమే. అయితే ఆ గాయం చిన్నదే అయితే.. ఇంట్లో ఎలాంటి చికిత్స తీసుకోవాలో చూద్దామా!

కాలిన గాయాన్ని మొదట చల్లటి నీటితో శుభ్రం చేయాలి. కొళాయి కింద కడగడం ఉత్తమం. ఆ తరువాత కిందివాటిలో వేటినైనా రాసుకోవచ్చు.



కలబంద: కాలిన గాయంపై కలబంద గుజ్జును పూస్తే ఉపశమనం ఉంటుంది.



తేనె: వెంటనే కొద్దిగా తేనె రాయాలి. ఆ గాయాలు మానడమే కాదు... ఇన్‌ఫెక్షన్లూ రాకుండా ఉంటాయి. తేనె చర్మానికి సాంత్వన కలిగించి రక్షిస్తుంది.



బంగాళాదుంప: దీన్ని కాలిన గాయంపై రుద్దడం వల్ల వెంటనే ఉపశమనం ఉంటుంది.



టీ బ్యాగులు: వీటిని కాసేపు నీటిలో ఉంచి చల్లగా అయిన తరువాత కాలిన గాయాలపై పెడితే మంట తగ్గుతుంది.



నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల దాకా గుమ్మం ముందుకు వచ్చే రోజులివి. ఇవన్నీ సరే.. ఇంతకు మించిన సేవల్ని సామాన్యులకు అందుబాటులోకి తేవాలనుకున్నారామె. తనకు ఎదురైన అనుభవాన్ని చూశాక కాల్‌హెల్త్ పేరుతో ఇంటివద్దకే వైద్యం వచ్చేలా.. ప్రత్యేక సేవల్ని అందేలా కొత్త అధ్యయనానికి తెరతీసిన ఆమె పేరు బైర్రాజు సంధ్యారాజు. అసలా సేవలేంటీ.. వాటిని తీసుకురావడానికి ఆమె ఎంత కృషి చేశారో.. అవి మనకెలా ఉపయోగపడతాయో.. తన అనుభవాలను వసుంధరతో పంచుకున్నారిలా..

హలో అంటే చాలు.. ఇంటికొస్తాం

కొన్నేళ్లక్రితం.. ఓ చిన్న ప్రమాదం ఎదురైంది. కాలికి చికిత్స చేయించుకోవాలి. రకరకాల పరీక్షలూ, ఫిజియోథెరపీకి సంబంధించి ఆసుపత్రులకు తిరగాల్సిన పరిస్థితి. అన్నింటికీ చాలా కష్టపడ్డా. కాలునొప్పితో విలవిల్లాడిపోయా. నాది కేవలం కాలి నొప్పే. కానీ రకరకాల కారణాల వల్ల నాలా ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారు రోజూ ఎంతమంది ఉంటారో కదా అనిపించింది. అప్పుడర్థమైంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో భాగంగా ఒక్క క్లిక్ చేస్తే చాలు. ఇంటికే రకరకాల వస్తువులు వస్తున్నాయి. మరి వైద్యాన్ని కూడా అలాగే ఎందుకు తీసుకు రాలేమని అనిపించింది. రకరకాల పరీక్షలు మొదలు, శస్త్రచికిత్సతో సంబంధం లేకుండా ఇంటిదగ్గర చేయించుకోదగిన వైద్య సేవల్ని ముంగిటలోకే తీసుకు రావాలని అనిపించింది. అదే ఇంట్లో వాళ్లకు చెబితే ఒప్పుకొన్నారు. అలా రెండేళ్ల క్రితం ప్రారంభించిందే కాల్‌హెల్త్ సర్వీసెస్ సేవలు.

హైదరాబాద్ నుంచే...

ఫోను చేసినా, వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని అందించినా.. మా సిబ్బంది వెంటనే వైద్య నిపుణులకు ఫోనుకాల్ని అనుసంధానం చేస్తారు. సమస్యను బట్టి వైద్యులూ, నర్సు, పరీక్షలు చేసే సదుపాయాలు.. ఇలా అన్నీ రోగుల వద్దకే వస్తాయి. ఒకవేళ తప్పనిసరయితే తక్షణం సదరు రోగిని ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించే ఏర్పాటు కూడా ఉంటుంది. దీనికి సంబంధించి అయ్యే ఖర్చు కన్నా మేం తీసుకునేది కాస్త తక్కువే. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటూ విజయవాడ, విశాఖపట్నంలో మా సేవల్ని అందిప్రస్తుతం అందిస్తున్నాం. ముఖ్యంగా రాయితీలపై సేవల్ని అందించేలా ఏర్పాటు చేశా. కాల్‌హెల్త్ సర్వీసెస్ పేరుతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో డాక్టర్ల కన్సల్టేషన్, రక్త, మూత్రపరీక్షలు, మందుల సరఫరాతో పాటు అవసరం మేరకు ఫిజియోథెరపీ, నర్సుల సేవలు వంటివి దాదాపు 16 రకాలుంటాయి. అలాగే ఆరోగ్యబీమా సౌకర్యం కూడా ఉంది. ఇందుకోసం 100కు పైగా ప్రముఖ ఆసుపత్రులు, ల్యాబ్‌లతో అనుసంధానమయ్యాం. ఇంట్లో పెద్దవాళ్లు ఉన్నా కూడా అవసరం అయితే దగ్గరుండి మరీ వైద్య సేవలు అందేలా చూస్తాం. ప్రస్తుతం మా కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. భవిష్యత్తులో మరిన్ని శాఖలుగా విస్తరించి దేశవ్యాప్తం చేయాలని అనుకుంటున్నాం.

అధ్యయనం చేశాం...

ఆన్‌లైన్ హెల్త్‌కేర్ సేవలను ప్రారంభించడానికి ముందుగా చాలానే కసరత్తు చేశాం. ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే ముందు చాలా కష్టపడ్డాం. పరిశోధన చేశాం. అలాగే అన్ని విభాగాల వైద్యులు సరైన సమయానికి ప్రజల వద్దకు వెళ్లగలిగేలా ఏర్పాట్లూ చేశాం. ఆ పనులతో పాటు, వైద్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లను అనుసంధానం చేయడం కూడా కష్టమైంది కానీ ఇప్పుడు అంతా సజావుగా సాగుతోంది. 2015, నవంబరు నుంచి గతేడాది ఆగస్టు వరకు రకరకాల అంశాలను ఓ వైపు తెలుసుకుంటూ, కొత్త సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నాం. అలాగే ప్రతీ ఫోన్‌కాల్‌ను మాట్లాడేందుకు తగిన సిబ్బంది కూడా ఉంటారు. తీవ్ర అనారోగ్యానికి గురికావడం కాదు, అసలు అనారోగ్యం దరిదాపులకు కూడా ప్రజలు వెళ్లకూడదనే మా ఆకాంక్ష. అలాగే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, ఆసుపత్రికి వెళ్లలేని వారి కోసం, వారి ఇంటికి సహాయకుల్ని పంపిస్తాం. మొత్తం భారతదేశంలోనే భవిష్యత్తులో 100 నగరాలకు మా సేవలను విస్తరించడానికి కృషి చేస్తున్నాం.

దీంతోపాటు నృత్యం...

తమిళనాట, శ్రీవిల్లుపుత్తూరు వద్ద రాజపాలెయంలో పుట్టాను. నాన్న వెంకటరామరాజు. అమ్మ నిర్మల. నాన్నకు సంగీతమంతే ఇష్టం. బహుశా ఆ కళాభిరుచి నాకు వచ్చిందేమో. నృత్యం నేర్చుకున్నా. 'నిశ్శృంఖల' డాన్స్ అకాడమీని ప్రారంభించా. గురువుగారి శిష్యురాలిగా ఆయనతోపాటు కలిసి వేదికపై నృత్యం చేసే అదృష్టంతో పాటు, ఆయన రూపొందించే బ్యాలేలో ప్రధాన పాత్ర చేసే అవకాశం దక్కింది. గురువుగారు చివరిగా చేసిన గోపికా కృష్ణ బ్యాలేలో కృష్ణుడి పాత్ర నాకు ఇవ్వడం మరవలేను. అది చేస్తూనే వీలైనంతమందికి మా వైద్యసేవల్ని అందుబాటులోకి తేవాలన్నదే నా ప్రయత్నం, లక్ష్యం.

– సిహెచ్.వసుంధరాదేవి

ప్రెసిడెంట్ ఎదుట ప్రదర్శన

గురువు వెంపటి చినసత్యం గారి శిష్యురాలిగా ప్రపంచవ్యాప్తంగా భారతీయసంస్కృతిని చాటే కూచిపూడి నృత్యకళను విస్తృతం చేయాలనే కోరిక నిత్యం నాలో మెదులుతూనే ఉంటుంది. అమెరికా, దక్షిణాఫ్రికా, మలేషియా, సింగపూర్, ప్యారిస్ తదితర దేశాల్లో ఎన్నో నృత్య ప్రదర్శనలిచ్చాను. అయితే ఆస్ట్రియా ప్రెసిడెంట్ ఎదుట నృత్యప్రదర్శన ఇవ్వడం ఓ అద్భుతమైన అవకాశం. ఎప్పటికీ మరవలేను. అలాగే 'నాట్యం' లఘుచిత్రంలో నా పాత్రకు నేనే కొరియోగ్రఫీ చేసుకోవడం సంతృప్తినిచ్చింది. ఓ మలయాళం సినిమాలో నటించా. తెలుగులోనూ చేయబోతున్నా. డాక్యుమెంటరీ కూడా చేయాలనుకుంటున్నా. కూచిపూడి నృత్యానికి ప్రారంభ దశగా చేసే జతులు, ముద్రలతో రూపొందించనున్న ఈ వీడియోలు, నృత్యం నేర్చుకునే వారికి ఒక గైడ్‌గా ఉపయోగపడుతుదని నా నమ్మకం. కూచిపూడి నృత్యానికి ఉండే సహజత్వం కనుమరుగవకూడదని నా అభిలాష.



అల్లక్కర్లేదు... కలిపితే చాలు

తల మధ్యలో సన్నటి జడ వేసుకుని మిగిలిన జుట్టు వదిలేసేవాళ్లం ఒకప్పుడు. ఇప్పుడూ అదే చేద్దాం. కానీ కాస్త భిన్నంగా. అదెలాగో తెలుసుకోండి మరి.

సిగ సింగారం






1 తలపైభాగాన ఉన్న జుట్టును మాత్రమే తీసుకుని పోనీటెయిల్‌గా వేసుకోవాలి. దీనికి కుడి, ఎడమవైపు రెండు సన్నటి పాయల్ని తీసుకోవాలి.




2 ఇప్పుడు ఆ రెండు సన్నటి పాయలను వదిలేసి మధ్యలో ఉండే పాయకు అంగుళం దూరంలో చిన్న రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. దీన్నుంచి మళ్లీ రెండువైపులా రెండు సన్నని పాయల్ని తీసుకోవాలి. ఇప్పుడు మొదటి రెండు పాయల్ని పోనీటెయిల్‌కి కలిపి మళ్లీ ఓ రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.





3 ఇలా ఆ పోనీటెయిల్ పూర్తయ్యేవరకూ రెండు చొప్పున పాయల్ని తీసుకుంటూ వాటిని కలిపి రబ్బరుబ్యాండ్లు పెట్టుకుంటూ చివరి వరకూ రావాలి. మిగిలిన జుట్టును వదిలేస్తే చాలు.

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

కన్నా... ఏం తింటావ్?



క్యారెట్ చూసి వద్దని మారాం చేసేది ఒకరైతే.. గుడ్డుని చూసి పారిపోయే వారు మరొకరు... చిన్నారులకు పోషకాహారం అందించడం నేటి తరం తల్లులకు చాలా కష్టమేనని చెప్పొచ్చు. 'మా పిల్లలు సరైన పోషకాహారం తీసుకోవడం లేదు' ఇది చాలామంది తల్లులు తరచూ అనే మాట. పిల్లలకు పోషకాహారం తినిపించాలంటే గగనమే. కింది పద్ధతులను పాటించడం ద్వారా పరిస్థితిలో మార్పు రావొచ్చేమో చూడండి.

- ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం తీసుకోవాలనుకునే ముందు ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. అలాంటి పదార్థాలను కొనాలి. ఈసారి కూరగాయల బజారుకో, సూపర్‌మార్కెట్‌కో మీ చిన్నారులను తీసుకుని వెళ్లండి. అక్కడ ఉండే వివిధరకాల కూరగాయలూ, పండ్లను వారికి పరిచయం చేయండి. మీరు కొనేవే కాదు...వారికి నచ్చినవి కూడా కొనండి.
- మార్కెట్ నుంచి తెచ్చిన కూరల్లో ఏవి వండాలో కూడా వారినే అడగండి. వారికిష్టమైన వాటిని వండతామని చెబితే చాలా సంతోషిస్తారు. 'అమ్మ నాకు ఎంపిక చేసే అవకాశం ఇచ్చింది.' అని సంబరపడతారు. అదే సమయంలో తమకు నిర్ణయం తీసుకునే శక్తీ, తెలివీ ఉందని పొంగిపోతారు. తాము తీసుకునే ఆహార పళ్లెంలో ఏయే పదార్థాలు ఉండాలో బాగా ఆలోచించి నచ్చినవి మీకు చూపిస్తారు.

వంట గదిలోకి చిన్నారులను ఆహ్వానించండి. ఉల్లిపాయల పొట్టు తీయడం, కూరగాయలు కడగడం లాంటి చిన్న చిన్న పనులు చేయించండి. మీరు వంట చేస్తున్నప్పుడు వారిని కూడా చూడనివ్వండి. అవసరమైతే మీరూ అక్కడే ఉండి వారితో గరిట తిప్పించండి. ఇలా చేయడం వల్ల వారికి ఆహారపదార్థాలూ, వాటిని వండే విధానం అన్నీ తెలుస్తాయి.

బంగారం వెండి

24న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,300	31,170	31,060	30,860
ఆర్నమెంట్	31,190	29,110	28,800	28,650
వెండి (కిలో)	39,300	39,940	40,700	40,300

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,750	30,750	30,950	30,820
ఆర్నమెంట్	28,480	28,480	28,950	28,820
వెండి (కిలో)	39,900	39,900	39,600	39,300

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,020	30,950	-------	-------
ఆర్నమెంట్	28,830	28,780	2,895	2,882 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.20	42.00 గ్రా

● విద్యార్థి నుంచి పారిశ్రామికవేత్తగా ● కొత్త పరిశోధనలు, పరిష్కారాలే పెట్టుబడి

ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థల్లో దాదాపు అన్నీ క్యాంపస్‌ల నుంచే ప్రస్థానాన్ని ప్రారంభించాయి. చదువుకుంటున్నప్పుడే ఉదయించే ఆలోచనలు అంకురాలు (స్టార్టప్‌లు)గా మారి మహావృక్షాలుగా విస్తరిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్ వంటి ఎన్నో దిగ్గజ సంస్థలు ఇలాంటివే. కాలేజీల్లో చేసే ప్రాజెక్టుల నుంచి ప్రతి నిర్మాణాత్మక ఆలోచనను పెద్ద పెద్ద కంపెనీల ఏర్పాటుకు పునాదులుగా చేసుకోవచ్చు. అందుకే కళాశాలల నుంచే కార్పొరేట్ కంపెనీల ఏర్పాటు దిశగా విద్యార్థులు తమ ఆలోచనా పరిధిని పెంచుకోవాలి. ఆంత్రప్రెన్యూర్‌లుగా అవతరించేందుకు తగిన మార్గాలను అన్వేషించాలి.



అంకురాధిపతి అవతారం!

వృత్తి విద్యను అభ్యసించే విద్యార్థులు తమ చదువులు పూర్తయ్యేసరికి ఒక ఉద్యోగం సంపాదించుకోవాలని చూస్తారు. మరికొందరు ఉన్నత చదువులైన మాస్టర్స్, పీహెచ్‌డీ, పీడీఎఫ్ చేయడానికి సిద్ధమవుతుంటారు. ఈ మార్గాల్లో ప్రయాణించడానికి అవసరమైన సన్నద్ధతను కళాశాల క్యాంపస్ నుంచే ప్రారంభిస్తారు. ఇవేకాకుండా మరో మార్గం గురించి కూడా అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. అదే 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' లేదా స్వయం ఉపాధి. ఒక విద్యార్థి తన నాయకత్వ, వ్యాపార లక్షణాలను అంచనా వేసుకొని వాటిని సరైన మార్గంలో వినియోగించగలిగితే 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' అనేది ఒక మంచి జీవితానికి బాటలు వేస్తుంది. ఉద్యోగాల కోసం ప్రభుత్వం లేదా ఇతర కంపెనీలపై ఆధారపడకుండా తామే ఒక కంపెనీని ఏర్పాటు చేస్తే మరెంతో మందికి ఉపాధి కల్పించవచ్చు. ప్రపంచంలో నేడు దిగ్గజాలుగా వెలుగొందుతున్న కంపెనీల ప్రస్థానం కళాశాలల్లోనే మొదలైంది.



రవి కటుకం
ఇన్నోవేషన్ ఇవాంజిలిస్ట్

మన దేశంలోనూ..!

మన దేశంలో కూడా గత దశాబ్ద కాలంగా ఐఐటీ, ఎన్ఐటీలు ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి విద్యార్థులను స్వయం ఉపాధి వైపు నడిపిస్తున్నాయి. ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై సదస్సులు నిర్వహిస్తున్నాయి. ఇంజినీరింగ్ మూడో, నాలుగో సంవత్సరం విద్యార్థులు లేదా మాస్టర్స్, పీహెచ్‌డీ అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో తమ మిత్రులతో, అధ్యాపకులతో బృందంగా ఏర్పడి అంకుర సంస్థలకు ప్రాణం పోయాలి.

Expertise
+
Technolog
+
Ideas
↓
Start up

ఆలోచనను రక్షించుకోవడం హక్కు

ఒక ఆలోచన స్టార్టప్‌గా మారగానే దాన్ని రక్షించుకోవడం అత్యంత ప్రధానం. ఒక ఐడియాను రక్షించుకోడానికి మేధో సంపత్తి హక్కులు వివిధ మార్గాలను సూచిస్తున్నాయి.

● పేటెంట్ ● ట్రేడ్‌మార్క్ ● డిజైన్ ● కాపీరైట్



విద్యార్థి దశలోనే మేధో సంపత్తి హక్కులపై అవగాహన కలిగి ఉంటే తమ పరిశోధన, ప్రాజెక్టులను వ్యాపార మార్గంలోకి మళ్లించవచ్చు. కొన్ని సందర్భాల్లో పెద్ద కంపెనీలు సైతం ఆసక్తికరమైన చిన్న ఆలోచనలను, వాటికి సంబంధించిన పేటెంట్ హక్కులను కొనుక్కుంటాయి. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఎన్నో ప్రాజెక్టులను డిజైన్ల రూపంలో భద్రపరచుకోవచ్చు. ఇలా రక్షించుకున్న ఆలోచనలను ఇంక్యుబేషన్ సెంటర్‌ల ద్వారా వ్యాపారాలుగా మలుచుకోవచ్చు. కొన్ని బహుళజాతి సంస్థలు ఓపెన్ ఇన్నోవేషన్ విధానంలో విద్యార్థుల నుంచి కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తున్నాయి.

▮ Air bus - Fly your ideas ▮ Innocentre.com ▮ Boeing - HorizonX ▮ TATA - TATA Innoverse ▮ Yetz.com ▮ Altair - Altair optimization contest ▮ Texas Instrument - Texas Instrument Innovation Challenge

ఈ ఓపెన్ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆయా కంపెనీల సమస్యల పరిష్కారంపై అవగాహన కలుగుతుంది. వీటిలో పాల్గొనడం వల్ల ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లకు బీజం పడుతుంది. అందుకే సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌ల వైపు అడుగులు వేయాలి. దేశంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా ఉపాధికి, సంపద అభివృద్ధికి సాయపడవచ్చు. విద్యార్థి స్థాయి నుంచే పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు మార్గాలను ఏర్పరచుకోవచ్చు.

కళాశాలలు చేయాల్సినవి

✦ ఆవిష్కరణ పోటీలు నిర్వహించడం ✦ కళాశాల యాజమాన్యం కావాల్సిన ఆదాయ వనరులు సమకూర్చడం

✦ విజయవంతమైన లేదా విఫలమైన వ్యాపారవేత్తల ఉపన్యాసాలు ✦ కళాశాలలో అంకుర సంస్థల అభివృద్ధి విభాగాల ఏర్పాటు ✦ విద్యార్థులకు వ్యాపార నిర్వహణ మీద నమూనా కంపెనీ (Mock company) పోటీలు నిర్వహించడం ✦ దేశీయ, అంతర్జాతీయ సంస్థల Accelerators మీద అవగాహన కలిగి ఉండటం ✦ తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల్లో వ్యాపారవేత్తల సమాచారం అందివ్వడం ✦ బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని విద్యార్థుల ఆలోచనలను మార్కెట్‌కి చేరవేయడం. ✦ ఆర్థిక నిర్వహణ మీద తగిన కోర్సులు ఏర్పాటు చేయడం.

ఇన్నోవేషన్ ఆంత్రప్రెన్యూర్‌గా రాణించడానికి విద్యార్థులు పెంపొందించుకోవాల్సిన లక్షణాలు

◗ సమస్యలను గుర్తించడం (Problem identification) ◗ సమస్యలను నిర్వచించడం (Problem definition) ◗ సమస్యల పరిష్కారం (Problem solving) ◗ వ్యాపార దృక్పథం (Business acumen) ◗ నాయకత్వ లక్షణాలు (Leadership qualities) ◗ నమ్మకంగా ఉండటం. నమ్మకమైన స్నేహబృందాన్ని ఏర్పరచుకోవడం (Trusted Network) ◗ స్నేహం లేదా కలుపుగోలుగా ఉండే మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం ◗ ఆర్థిక అవగాహన కలిగి ఉండటం ◗ భవిష్యత్తు దృష్టి నైపుణ్యం (Visionary skill) ◗ విజయాలు సాధించిన పూర్వ విద్యార్థులతో మంచి సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం ◗ వ్యక్తీకరణ నైపుణ్యం (Presentation skill) ◗ అమ్మకాల నైపుణ్యం (Sales skill) ◗ ప్రపంచ పోకడలపై అధ్యయనం (Industry trend analysis) ◗ మార్గదర్శకులను ఎంచుకోవడం (Mentor selection) ◗ బృంద నిర్మాణం (Team building) ◗ పెట్టుబడులు రాబట్టడం (Funding attraction)

విజయవంతమైన ప్రతి కంపెనీ వెనుక ఏళ్ల తరబడి కృషి, పట్టుదల, మిత్రుల సహకారం ఉంటుంది. కళాశాల స్థాయి నుంచి మంచి బృందాన్ని నిర్మించుకోవడం నేర్చుకోవాలి.

క్యాంపస్ నుంచే ప్రఖ్యాత సంస్థల ప్రస్థానం

➤ మైఖేల్ డెల్ వెయ్యి డాలర్లతో కళాశాలలో ప్రారంభించిన డెల్ కంప్యూటర్స్ నేడు ప్రపంచ వ్యాప్తంగా ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను అందిస్తోంది. ఈ కంపెనీకి బీజం పడింది యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లోనే.

➤ నేడు మనమంతా మొబైల్స్‌లో విరివిగా వాడుతున్న డ్రాప్‌బాక్స్ అనేది ఆరాష్ అండ్ డ్రూ అనే ఇద్దరు విద్యార్థులు మసాచ్యుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్నప్పుడు రూపొందించిందే.

➤ మార్క్ జుకర్ బర్గ్, డస్టిన్ మోస్కోవిజ్ తదితర మిత్రులు ప్రారంభించిన ఫేస్‌బుక్ నేడు ప్రపంచంలోని మిత్రులందరినీ ఏకం చేసే వేదికగా మారింది. జుకర్ బర్గ్ చిన్న ఆలోచనతో ఈ అంకురం హార్వర్డ్ యూనివర్సిటీలో పుట్టి గ్లోబ్‌ను ఆక్రమించింది.

➤ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ల్యారీ పేజ్, సెర్జీబ్రిన్ అత్యున్నత సెర్చ్‌ఇంజిన్ కోసం డిజిటల్ లైబ్రరీ పేరుతో చేపట్టిన ప్రాజెక్ట్ గూగుల్ పేరుతో నేడు విశ్వ సమాచార శోధన యంత్రంగా మారింది.

➤ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేరొందిన బిల్‌గేట్స్ మైక్రోసాఫ్ట్ మహావృక్షం ప్రాణం పోసుకుంది హార్వర్డ్ యూనివర్సిటీలోనే.

➤ పికాబు పేరుతో ప్రారంభమైన ఫొటో షేరింగ్ చాట్ నేడు స్నాప్ చాట్ పేరుతో రోజుకి 700 మిలియన్ల ఫొటోలను, వీడియోలను పంపించే ప్లాట్‌ఫాంగా మారింది. ఇవాన్ స్పీగల్ ప్రారంభించిన ఈ చాట్ అప్లికేషన్ ఫేస్‌బుక్, గూగుల్‌లాంటి కంపెనీల దృష్టిని ఆకర్షించి భారీ మార్కెట్ విలువను సంపాదించుకుంది. ఈ ప్రస్థానం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో మొదలైంది.

➤ బ్లాగింగ్‌కి అవసరమయ్యే వర్డ్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్ కూడా యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్‌లో ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రతి నెలా పదిహేను బిలియన్ల పేజీలను దీని ద్వారా వీక్షిస్తున్నారు.

➤ జెర్రీయాంగ్, డేవిడ్ ఫిలో అనే ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్థులు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ప్రారంభించిన వెబ్‌సైట్ యాహూగా మారి ప్రసిద్ధికెక్కింది.

ఎంబీఏకు మ్యాట్ మార్గం!

ఎంబీఏలో చేరదల్చినవారు రాసే జాతీయస్థాయి పరీక్షల్లో 'మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్' ఒకటి. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించే ఈ మ్యాట్ స్కోరు ద్వారా ప్రతిష్ఠాత్మక మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంబీఏ/ పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ఏటా నాలుగుసార్లు (ఫిబ్రవరి, మే, సెప్టెంబరు, డిసెంబరు) జరిగే ఈ పరీక్ష తాజా నోటిఫికేషన్ వెలువడింది.

ఫిబ్రవరిలోనే పరీక్ష ఉన్నందువల్ల ప్రస్తుతం ప్రాథమికాంశాలపై పట్టు సాధించేందుకు ప్రయత్నించవద్దు. ముందుగా అభ్యర్థులు పరీక్ష ఏ పద్ధతిలో రాయాలో నిర్ణయించుకోవాలి. అంటే ఈ పరీక్షను అటు ఆఫ్‌లైన్‌తోపాటు ఇటు ఆన్‌లైన్‌లోనూ ఫిబ్రవరి 2018లో నిర్వహించనున్నారు. ఆఫ్‌లైన్‌లో ఫిబ్రవరి 4న, ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 17 నుంచి నిర్వహించనున్నారు (తక్కువమంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే ఒకే రోజులో పూర్తవుతుంది, లేదంటే అభ్యర్థుల సంఖ్యనుబట్టి ఎన్ని రోజులు నిర్వహించాలో నిర్ణయిస్తారు).



పి. గోపాలకృష్ణ
డైరెక్టర్,
కౌటిల్య కెరియర్స్

ఆఫ్‌లైన్‌లో (పేపర్ బేస్‌డ్) అభ్యర్థి పరీక్ష రాయాలని నిర్ణయించుకుంటే ప్రస్తుతం 10 రోజుల వ్యవధి మాత్రమే అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లో పరీక్ష రాయాలనుకుంటే పరీక్షకు సుమారుగా 23 రోజులు అందుబాటులో ఉంటాయి. అంటే అభ్యర్థి ప్రస్తుతం సాధనపైనే పూర్తిస్థాయి దృష్టిసారించాలి. ప్రాథమికాంశాల అధ్యయనానికి వ్యవధి లేనందున పూర్తిస్థాయిలో మాక్ పరీక్షలను రాయాల్సి ఉంటుంది. అలాగే విధిగా సమాధానాలను పరిశీలించాలి. తరచూ తప్పులు చేస్తున్న అధ్యాయాలను గుర్తించి వాటిలోని అంశాలకు మరోసారి సిద్ధం కావాలి.

మ్యాట్‌లో మొత్తం 200 ప్రశ్నలుంటాయి. కేటాయించిన సమయం కేవలం 150 నిమిషాలు. ఈ పరీక్షలో ఉండే విభాగాలు:

విభాగం	ప్రశ్నలు	మార్కులు
లాంగ్వేజ్ కాంప్రహెన్షన్	40	40
మేథమేటికల్ స్కిల్స్	40	40
డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ	40	40
ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్	40	40
ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్	40	40



సమయపాలన ముఖ్యం

ఒక్క ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ మినహా మిగతావాటికి సమయపాలన చాలా కీలకం.

అందుబాటులో ఉన్న ఈ కొద్ది సమయంలో మేథమేటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీలపై దృష్టిసారించడం మేలు. ఈ అంశాలు రెండూ కలిపి 80 ప్రశ్నల వరకు వస్తున్నాయి. పైగా ఈ రెండు విభాగాలు అరిథ్‌మెటిక్ సన్నద్ధతపై ఆధారపడి ఉన్నాయి.

సరాసరి, శాతాలు, నిష్పత్తులు అనే మూడు అంశాలు, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ చాలా కీలకం. అన్వయంలోనే కొంచెం భిన్నంగా ఉంటుంది. సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలు చేయడం ద్వారా మంచి స్కోరు సాధించవచ్చు.

అయిదు అంశాల్లోనూ ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించి పెద్దగా సాధన చేయాల్సిన పనిలేదు. అయితే తాజా పరిణామాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. జీఎస్‌టీ అమలు- క్రమం తప్పకుండా వస్తున్న మార్పులు, నోబెల్ బహుమతులు, ఉత్తరకొరియా అణు, క్షిపణి పరీక్షలు, ఇటీవలి కాలంలో అమెరికాలో వచ్చిన విధానపరమైన మార్పులు, భారత్, విదేశీ సంబంధాలు తదితర అంశాలను ఒకసారి పరిశీలించాలి.

గత ఏడాది కొన్ని కళాశాలలు ప్రవేశాలు కల్పించిన కటాఫ్ పర్సంటైల్ స్కోరు

కళాశాల	పర్సంటైల్
బిమ్‌టెక్ (గ్రేటర్ నోయిడా)	70
ఎక్స్‌ఎంఈ (బెంగళూరు)	75
ఎంఎస్ రామయ్య (బెంగళూరు)	75
ఐఐఎంఎస్ (పుణె)	70
ఐఎంఎస్ (ఘజియాబాద్)	65

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయి దినపత్రికల్లో వచ్చే సంపాదకీయాలను పరిశీలించాలి. రచయిత ఏం చెప్పాలనుకుంటున్నాడు, ఏ ఉద్దేశంతో ఫలానా అంశాన్ని రాశాడు.. ఇలా ప్రశ్నలు వేసుకుని సమాధానాలు రాబడితే పరీక్ష కోణం అలవడుతుంది. రీజనింగ్ అంశానికి సంబంధించి పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్ ప్రశ్నలు ప్రస్తుతం ఎక్కువగా సాధన చేయాలి. బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది. ఇది కూడా మంచి స్కోరింగ్ విభాగం. అందులో దీనికి ప్రాథమిక అంశాలు అంటూ ఉండవు.

పూర్తిస్థాయి మాక్ పరీక్షలు రాస్తే మంచి స్కోరు సాధించే అవకాశం అభ్యర్థులకు ఉంటుంది.

ప్రవేశాల తీరు ఎలా?

టాప్ బి-మేనేజ్‌మెంట్ కళాశాలలు, రెండు అంశాల ఆధారంగా అడ్మిషన్లు ఇస్తాయి. 1. అభ్యర్థి సాధించిన స్కోరు 2. పర్సంటైల్.

మొత్తం 200 ప్రశ్నలు ఉన్నా, 800 మార్కులకు స్కేలింగ్ ఇస్తారు. దీనిని కంపోజిట్ స్కోర్ విధానంగా చెబుతారు. దీని ఆధారంగా పర్సంటైల్‌ను నిర్ణయిస్తారు. దాదాపుగా దేశవ్యాప్తంగా 250 కళాశాలలు మ్యాట్ స్కోరును ప్రవేశాలకు పరిగణిస్తున్నాయి.

చివరి సంవత్సరం విద్యార్థులు కూడా...: మ్యాట్ రాయడానికి గ్రాడ్యుయేట్లు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా పరీక్ష రాయవచ్చు. వయసుతో నిమిత్తం లేదు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: జనవరి 26, 2018 ● పేపర్ ఆధారిత పరీక్ష: ఫిబ్రవరి 4, 2018 ● కంప్యూటర్ ఆధారిత పరీక్ష: ఫిబ్రవరి 17, 2018

● అడ్మిట్ కార్డులు అందుబాటులోకి వచ్చేది- ఫిబ్రవరి 27 నుంచి

అడ్మిషన్ల కోసం మ్యాట్ స్కోరును పరిగణిలోకి తీసుకునే తెలుగు రాష్ట్రాల్లోని కళాశాలలు, ఇతర ప్రముఖ సంస్థల వివరాలను **www.eenadupratibha.net** లో

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

టీఎస్‌పీఎస్సీ

పోస్టు: ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2
ఖాళీలు: 325 (పాతవి 200)
(కొన్ని విభాగాల్లో 125 అదనపు పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ గడువు తేదీని పొడిగించింది)
అర్హత: ఇంటర్మీడియట్‌తోపాటు డీఎంఎల్‌టీ లేదా బీఎస్సీ (ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ/ తెలంగాణ పారా మెడికల్ బోర్డుల్లో తప్పనిసరిగా రిజిస్టరై ఉండాలి. **వయసు:** 18 - 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష, ప్రభుత్వ సర్వీసుల్లో పనిచేసిన అనుభవం ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్
చివరితేది: 10.02.2018
వెబ్‌సైట్: https://tspsc.gov.in/

పవర్ గ్రిడ్ కార్పొరేషన్

పోస్టు: అసిస్టెంట్ ఇంజినీర్ ట్రైనీ **ఖాళీలు:** 150 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో కనీసం 65శాతం మార్కులతో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్) ఉత్తీర్ణత. గేట్ - 2017 స్కోరు ఉండాలి. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 27.01.2018 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 17.02.2018 **వెబ్‌సైట్:** http://powergridindia.com/

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

పోస్టు: డిప్యూటీ ఇంజినీర్ **ఖాళీలు:** 27
అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్/ ఏఎంఐఈ ఉత్తీర్ణత. మార్కెటింగ్ విభాగంలోని పోస్టులకు బీఈ/ బీటెక్/ ఏఎంఐఈతోపాటు ఎంబీఏ ఉండాలి.
వయసు: 26 సంవత్సరాలకు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆఫ్‌లైన్
చివరితేది: 07.02.2018
వెబ్‌సైట్: www.bel-india.com/

రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ **ఖాళీలు:** 07
అర్హత: కనీసం 60శాతం మార్కులతో కెమికల్ ఇంజినీరింగ్/ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కెమిస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత. హిందీ/ హిందీ ట్రాన్స్‌లేషన్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ ప్రధాన సబ్జెక్టుగా చదివి ఉండాలి. ప్రకటనలో పేర్కొన్న ఇతర అర్హతలు.
వయసు: 31 సంవత్సరాలకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **దరఖాస్తు:** ఆఫ్‌లైన్
చివరితేది: 19.02.2018
వెబ్‌సైట్: https://www.brbnmpl.co.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.



జాతీయ సాహస పురస్కార గ్రహీతలతో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి మేనకా గాంధీ

18 మంది చిన్నారులకు సాహస బాలల పురస్కారాలు

ప్రదానం చేసిన మోదీ

దిల్లీ: జాతీయ సాహస బాలల పురస్కారాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రదానం చేశారు. మొత్తం 18 మంది చిన్నారులు ఈసారి ఈ అవార్డులు గెలుచుకున్నారు. వీరిలో ఏడుగురు బాలికలు కూడా ఉన్నారు. ముగ్గురికి మరణానంతరం ఈ పురస్కారం దక్కింది. మొత్తం ఐదు విభాగాల్లో ఈ అవార్డుల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో పురస్కార గ్రహీతలతో మోదీ సంభాషించారు. వారి సాహసాలు ఇతర చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని. . స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. అవార్డులు అందుకున్నవారిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారేనని.. రోజూవారీ జీవితంలో ఎదురైన సవాళ్లు వారికి ధైర్యాన్ని నూరిపోసి ఉంటాయని మోదీ అన్నారు.

‘పద్మ’ పురస్కారాల ప్రకటన నేడు

ప్రతిష్ఠాత్మక ‘పద్మ’ పురస్కారాల విజేతలను గురువారం ప్రకటించనున్నారు. వివిధ రంగాల్లో ఎనలేని కృషి చేసిన వారికి.. ఏటా గణతంత్ర దినోత్సవ సందర్భంగా పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ అవార్డులను భారత ప్రభుత్వం ప్రకటిస్తుంటుంది. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, విజ్ఞానశాస్త్రం, వాణిజ్యం, పరిశ్రమల వంటి విభిన్న రంగాల్లో ఈ పురస్కారాలు ఉంటాయి. ఈసారి అవార్డులకు 15,700 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఔషధనగరిపై మరిన్ని వివరాలివ్వండి

- తెలంగాణను కోరిన కేంద్ర కమిటీ
- ప్రాజెక్టు ప్రతిపాదనలపై ప్రశంసలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు మండలాల్లో నిర్మిస్తున్న హైదరాబాద్ ఔషధనగరికి పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ నిపుణుల సమీక్ష కమిటీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు సమాచారం కోరింది. బుధవారం దిల్లీలో అరుణ్‌ఆప్టే అధ్యక్షతన ఈ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ ఇన్‌ఛార్జి ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ వెంకట నర్సింహారెడ్డి, సలహాసంస్థ ఈపీటీఆర్ఐ ప్రతినిధి బృందం ఈ సమావేశానికి హాజరైంది. ఈ సందర్భంగా ఔషధనగరి ప్రతిపాదలపై దృశ్యరూపక ప్రదర్శన ఇచ్చారు. సభ్యుల సందేహాలకు నివృత్తి చేశారు. ప్రాజెక్టుపై సానుకూలంగా మాట్లాడిన ఛైర్మన్, సభ్యులు పర్యావరణ అనుమతుల కోసం మరింత సమాచారం కోరారు. సత్వరమే దీనిని సమర్పించాలని సూచించారు. వారంరోజుల్లో వివరాలు ఇస్తామని అరవింద్‌కుమార్ తెలిపారు. తదుపరి సమావేశంలో పర్యావరణ అనుమతులపై తుది నిర్ణయం తీసుకుంటామని కమిటీ ఛైర్మన్ ఆప్టే వెల్లడించారు.

జాతీయ ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టు: ఈ సందర్భంగా ఆప్టే ఇతర సభ్యులు ఔషధనగరి ప్రాజెక్టు ప్రతిపాదలను ప్రశంసించినట్లు తెలిసింది. ఇది జాతీయ ప్రాధాన్యం గల ప్రాజెక్టు అని, దేశానికి ప్రతిష్ఠాత్మకమవుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా అనేక రకాలుగా ఉపయోగాలున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ప్రాజెక్టు గురించి కూడా చర్చకు వచ్చింది.

నిమ్జ్‌పై పర్యావరణ అధ్యయనానికి ఆమోదం: అనంతరం జహీరాబాద్ నిమ్జ్‌పై పర్యావరణ సమీక్ష కమిటీ సమావేశం ఆప్టే అధ్యక్షతన జరిగింది. నిమ్జ్‌పై పర్యావరణ అధ్యయనానికి అవసరమైన నియమ నిబంధనలకు కమిటీ అనుమతులు ఇచ్చింది.

కీలక శిఖరాగ్రం... నేడు శ్రీకారం

- దిల్లీలో ఆసియాన్ దేశాల రెండ్రోజుల సదస్సు
- గణతంత్ర వేడుకలకూ హాజరుకానున్న సభ్య దేశాధినేతలు

దిల్లీ: ప్రాంతీయంగా పెరుగుతున్న చైనా ఆధిపత్యానికి కళ్లెం వేసేందుకు ఇతర దేశాల మద్దతును మన దేశం కూడగట్టే రీతిలో ‘ఆగ్నేయాసియా దేశాల సంఘం’ (ఆసియాన్) శిఖరాగ్ర సమావేశాలు గురువారం దిల్లీలో ప్రారంభం కానున్నాయి. రెండ్రోజుల సదస్సుకు వస్తున్న 10 దేశాల అధినేతలంతా గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరయ్యే అపూర్వ ఘట్టం శుక్రవారం ఆవిష్కృతం కానుంది. ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక చొరవతో ఈ రెండు కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. గత ఏడాది మనీలా (ఫిలిప్పీన్స్)లో ఆసియాన్ సదస్సు జరిగినప్పుడే తదుపరి సమావేశాన్ని


బుధవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీని కలిసిన మయన్మార్ విదేశాంగ మంత్రి ఆంగ్ సాన్ సూకీ

భారత్‌లో నిర్వహించాలని మోదీ కోరారు. ఆసియాన్ కూటమితో భారత్ సంబంధాలకు పాతికేళ్లు పూర్తవుతుండడం ఒక విశేషమైతే, అధినేతలంతా మోదీతో కలిసి గణతంత్ర వేడుకల్లో పాలుపంచుకోనుండడం మరో విశేషం. ఇదొక రికార్డుగా నిలిచిపోనుంది.

ప్రాధాన్యం ఎందుకంటే...

ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత... భారత్‌తోపాటు ఆసియాన్ దేశాలకూ కీలకం. చైనా విస్తరణవాదాన్ని అడ్డుకోవాలంటే సరిహద్దుల పరిరక్షణ, నౌకాయాన సహకారంలో ఇతర దేశాల మద్దతు కూడగట్టడం భారత్‌కు అవసరం. వియత్నాం, ఫిలిప్పీన్స్, మలేసియా, బ్రూనై వంటి దేశాలకూ చైనాతో ప్రాదేశిక వివాదాలున్నాయి. చైనాకు అడ్డుకట్ట వేసే శక్తి భారతదేశమేనని చాటుకుని, సభ్యదేశాల మద్దతు పొందడానికి ఆసియాన్ సదస్సు రూపంలో ఓ మంచి అవకాశం లభించనుంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికీ ఆసియాన్ దేశాలు కీలకం కావడంతో సదస్సుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వాణిజ్యం నుంచి భద్రత వరకు అన్నివిధాలా ఆగ్నేయాసియాలో చైనాకు కళ్లెం వేయాలనే భారత్ ప్రయత్నాలు ఎంతవరకు సాకారమవుతాయనేది రెండ్రోజుల సదస్సులో తేలనుంది.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, భద్రత, అనుసంధానత తదితర కీలకాంశాలను సదస్సు గురువారం చర్చిస్తుంది. అనంతరం ప్లీనరీ సదస్సు జరగనుంది. వియత్నాం ప్రధాని న్యూయాన్ జుయాన్ ఫ్యూక్, మయన్మార్ స్టేట్ కౌన్సిలర్ ఆంగ్‌శాన్ సూచీ, సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో రొయా ద్యుతెర్తె బుధవారమే దిల్లీ చేరుకున్నారు.

ఆసియాన్ దేశాధినేతల రాకతో దిల్లీ వాసులకు ట్రాఫిక్ కష్టాలు

ఆసియాన్ దేశాధినేతల రాకతో దిల్లీలో వాహన చోదకులకు బుధవారం చుక్కలు కనిపించాయి. కూడళ్ల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి రావడం, ఎక్కడికక్కడ మళ్లింపులు అమలుపరచడం వల్ల వారు ఒకపట్టాన గమ్యాలను చేరుకోలేకపోయారు. దిల్లీలో తీర్చిదిద్దిన భారత్-ఆసియాన్ మైత్రీ పార్కును కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ ప్రారంభించారు.

ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై ‘స్టే’కు దిల్లీ హైకోర్టు తిరస్కృతి

29 నుంచి రోజువారీ విచారణ

దిల్లీ: లాభదాయక పదవులను నిర్వహించినందుకుగాను 20 మంది ఆప్ శాసనసభ్యులపై అనర్హత వేటు వేస్తూ కేంద్రం జారీచేసిన ప్రకటనను నిలుపుదల(స్టే) చేయడానికి దిల్లీ హైకోర్టు బుధవారం నిరాకరించింది. అయితే ఆయా స్థానాలకు ఉప ఎన్నికల తేదీలను ప్రకటించడం వంటి చర్యలేమీ సోమవారం వరకూ చేపట్టరాదంటూ ఎన్నికల సంఘాన్ని(ఈసీ) ఆదేశించింది. తమను అనర్హులుగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ సంబంధిత ఆప్ శాసనసభ్యులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్న న్యాయస్థానం ఈనెల 29 నుంచి రోజువారీ విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. దీనిపై సమాధానమివ్వాల్సిందిగా కేంద్రం, ఈసీలను జస్టిస్ విభు బఖ్రు ఆదేశించారు.

అఫ్గాన్‌లో ధార్మిక సంస్థపై ఐఎస్ ఉగ్రదాడి

ముగ్గురు మృతి.. 24 మందికి గాయాలు

జలాలాబాద్: అఫ్గానిస్థాన్‌లోని ఓ ధార్మిక సంస్థ కార్యాలయంపై ఐఎస్ ఉగ్రవాదులు బుధవారం దాడికి తెగబడ్డారు. గంటల తరబడి జరిపిన ఈ దారుణ ఘటనలో ముగ్గురు మృతి చెందగా 24 మంది గాయపడ్డారు. జలాలాబాద్‌లో బ్రిటిష్ సాయంతో నిర్వహిస్తున్న ‘సేవ్ ద చిల్డ్రన్’ కార్యాలయం లక్ష్యంగా సాయుధులైన ముష్కరులు దాడికి పాల్పడ్డారు. కాగా ఈ ఘటనతో ‘సేవ్ ద చిల్డ్రన్’ సంస్థ దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయడంతోపాటు, అన్ని కార్యాలయాలను మూసివేసింది. సంస్థ కార్యాలయం బయట తొలుత కారును పేల్చిన ఉగ్రవాదులు రాకెట్‌తో ప్రయోగించే గ్రనేడ్ (ఆర్‌పీజీ)లతో ప్రాంగణంలో దాడిచేశారు. ఈ ఘటన తమ పనేనని అనంతరం ఐఎస్ ప్రకటించింది.

హైదరాబాద్ నుంచి మరో 5 నగరాలకు విమానాలు

- తిరుపతి నుంచి 2 చోట్లకు...
- ఉడాన్-2లో ఎంపిక

ఈనాడు, దిల్లీ: ప్రాంతీయ అనుసంధాన పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉడాన్ పథకం విజయవంతం కావడంతో ఇప్పుడు ఉడాన్-2 కింద కొత్త మార్గాల్లో విమానయాన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించి విజయంతమైన బిడ్డర్లకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతి రాజు బుధవారం అనుమతులు మంజూరు చేశారు. వచ్చే ఆరునెలల్లోగా బిడ్డర్లు తాము పొందిన మార్గాల్లో విమాన, హెలికాప్టర్ సేవలను మొదలుపెట్టాల్సి ఉంటుంది. ఉడాన్-2కింద హైదరాబాద్‌కు కొత్తగా 5 నగరాలతో విమాన అనుసంధానం ఏర్పడనుంది. ఆధ్యాత్మిక నగరం తిరుపతికి రెండు నగరాల నుంచి కొత్తగా రాకపోకలు మొదలు కానున్నాయి. బుధవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో అశోక్‌గజపతి రాజు మాట్లాడుతూ... ఉడాన్ పథకం కింద దేశంలో ఇప్పటివరకూ విమానయాన సౌకర్యం లేని 80 ఎయిర్‌పోర్టుల నుంచి సేవలందించనున్నట్లు చెప్పారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి 75 విమానాశ్రయాలు వినియోగంలో ఉంటే తాము స్వల్పకాలంలోనే కొత్తగా 80 విమానాశ్రయాలను ఉపయోగంలోకి తెచ్చామని తెలిపారు. ఉడాన్-2 కింద 502 మార్గాలకు సంబంధించి 196 ప్రతిపాదనలు వచ్చినట్లు చెప్పారు. ఈసారి హెలికాప్టర్ సేవలకోసమూ ప్రతిపాదనలు వచ్చాయని, తొలి రౌండ్‌లో హెలికాప్టర్లు నడపటానికి ఎవరూ ముందుకు రాలేదని వివరించారు. ఉడాన్-2 కారణంగా తొలిసారి కార్గిల్‌కు విమాన అనుసంధానం ఏర్పడుతోందని తెలిపారు. ఇప్పుడు కొత్తగా రాయితీ ధరల్లో 28.44 లక్షల సీట్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

హైదరాబాద్‌కు కొత్తగా అనుసంధానం అయ్యే ప్రాంతాలు

ఎక్కడినుంచి ఎక్కడికి	నడిపే సంస్థ	సీట్లు	రాయితీ సీట్లు	వారంలో ఎన్ని రోజులు	రాయితీ టికెట్ గరిష్ఠ ధర (రూ.లలో)
కొప్పళ (కర్ణాటక) హైదరాబాద్	టర్బో ఏవియేషన్	19	9	7	2,060
హుబ్లి (కర్ణాటక) హైదరాబాద్	అలయన్స్ ఎయిర్	70	35	7	2,480
హుబ్లి (కర్ణాటక) హైదరాబాద్	స్పైస్‌జెట్	78	39	7	2,480
నాసిక్ (మహారాష్ట్ర) హైదరాబాద్	అలయన్స్ ఎయిర్	70	35	7	3,110
నాసిక్ (మహారాష్ట్ర) హైదరాబాద్	స్పైస్‌జెట్	189	40	7	2,800
హుబ్లి (కర్ణాటక) తిరుపతి	గొడావట్	50	25	7	2,570
షోలాపూర్ (మహారాష్ట్ర) హైదరాబాద్	అలయన్స్ ఎయిర్	70	35	7	1,740

ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో ఈసీ మరింత క్రియాశీలం

‘సామాజిక మాధ్యమ సమాచార కేంద్రం’ ప్రారంభం

దిల్లీ: ప్రజలకు సమాచారాన్ని చేరువచేయటంలో సామాజిక మాధ్యమ వేదికలైన ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో మరింత చురుగ్గా వ్యవహరించాలని ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయించింది. ఈ రెండు వేదికల ద్వారా ఎప్పటికప్పుడు పూర్తి సమాచారాన్ని అందించటంతో పాటు ఆయా అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేయనున్నారు. దీని కోసం ఏర్పాటు చేసిన ‘సామాజిక మాధ్యమ సమాచార కేంద్రం’(సోషల్ మీడియా కమ్యూనికేషన్ హబ్)ను ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఓపీ రావత్, ఎన్నికల కమిషనర్లు సునీల్ అరోరా, అశోక్ లవాసా బుధవారం ప్రారంభించారు. అంతర్జాల ఆధారిత సామాజిక మాధ్యమ వేదికలను ఇప్పటి వరకూ ఈసీ పరిమితంగానే వినియోగించుకుంటోంది. విదేశాల్లో ఉన్న ప్రవాసభారతీయ ఓటర్ల కోసం ఫేస్‌బుక్‌లో ‘ఇండియా వోట్స్’ అనే పేజీని, కొన్ని అంశాలపై రూపొందించిన శిక్షణ దృశ్యాలను యూట్యూబ్ ద్వారానూ అందుబాటులో ఉంచింది. ఇకపై ఎన్నికల సంఘానికి సంబంధించిన ప్రతి సమాచారం ఈ రెండు వేదికల ద్వారా కూడా అందుబాటులోకి రానుందని ఎన్నికల సంఘం అధికారి ఒకరు తెలిపారు.

రెండు సార్లూ రాజీనామాకు సిద్ధమయ్యా!

సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి

దిల్లీ: ఇటీవల తాను రెండు సార్లూ రాజీనామాకు సిద్ధపడినట్లు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టంచేశారు. కోల్‌కతాలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ భేటీలోనూ.. దిల్లీలో పొలిట్‌బ్యూరో సమావేశంలోనూ తాను అదే నిర్ణయాన్ని వెల్లడించినట్లు వివరించారు. కేంద్ర కమిటీ సమావేశం అనంతరం తాను కొనసాగడం సమర్థనీయం కాదని విలేకరుల సమావేశంలో కూడా స్పష్టంచేసినట్లు పేర్కొన్నారు. అయితే పార్టీలో విభజన వచ్చిందన్న అభిప్రాయం కల్పించినట్లవుతుందంటూ - ప్రధానంగా త్రిపుర ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తనను కొనసాగాల్సిందిగా పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ భేటీల్లో ఏకగ్రీవంగా కోరినట్లు వివరించారు. ఏచూరి రాజీనామాకు సిద్ధమైనట్లు వచ్చిన వార్తలను పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారాట్ ఓ ఇంటర్వ్యూలో ఖండించిన నేపథ్యంలో ఆయన ఈమేరకు వివరణ ఇచ్చారు. కాగా దీంతో రెండు (కారాట్, ఏచూరి) వర్గాల మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వచ్చినట్లయిందని పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి.

కశ్మీర్‌లో ఎదురుకాల్పులు ఇద్దరు ఉగ్రవాదుల హతం

నిరసన ప్రదర్శనల్లో అపశ్రుతి...

17 ఏళ్ల యువకుడి దుర్మరణం

శ్రీనగర్: కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో బుధవారం చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో భద్రత బలగాలు ఇద్దరు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టాయి. ఘటనాస్థలి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి సమీపంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నవారికి, భద్రత బలగాలకు మధ్య జరిగిన ఘర్షణలో 17 ఏళ్ల యువకుడొకరు ప్రాణాలు కోల్పోయాడు. మరోపక్క- ఈ నెల 20న పాక్ జరిపిన కాల్పుల్లో పూంఛ్ జిల్లాలో గాయపడ్డ జగదీశ్ (ఉత్తరాఖండ్ వాసి) అనే జవాను సైనిక ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం ప్రాణాలు విడిచారు.


దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేస్తున్న రాజేంద్రప్రసాద్.. చిత్రంలో వరుసగా కృష్ణవేణి, ఈనాడు పాత్రికేయ పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, వంశీరామరాజు, దైవజ్ఞశర్మ, ధనలక్ష్మి, కృష్ణారెడ్డి, శైలజ, జగన్ (కుడి నుంచి ఎడమకు)

దివ్యాంగుడిగా అంతర్జాతీయ చిత్రంలో నటిస్తా

- సినీ నటుడు రాజేంద్రప్రసాద్
- వేగేశ్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ప్రశంస

కుంట్లూర్ (హయత్‌నగర్), న్యూస్‌టుడే: త్వరలో దివ్యాంగుడిగా ఓ అంతర్జాతీయ చిత్రంలో నటించనున్నట్లు సినీనటుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. మానవసేవే మాధవసేవ అన్న నానుడిని నిజం చేస్తూ మూడు దశాబ్దాలుగా ‘వేగేశ్న ఫౌండేషన్’ దివ్యాంగుల సేవలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట నగర పంచాయతీ కుంట్లూర్ గ్రామంలోని వేగేశ్న ఫౌండేషన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగులకు సేవచేయాలని అందరూ చెబుతారు..కానీ చేతల్లో చూపుతున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు వంశీ రామరాజు అభినందనీయులన్నారు. గాయకుడు ఘంటసాలకు ఆలయాన్ని నిర్మించి.. నిత్యం పూజలు చేయడం తెలుగువారి అదృష్టమన్నారు. అతిథులతో కలిసి 19 మంది దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈనాడు పాత్రికేయ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరానికి సమీపంలోనే ఉన్నా..వేగేశ్న ఫౌండేషన్ దివ్యాంగులకు చేస్తున్న సేవలు ఆశించినంత వెలుగులోకి రాలేదన్నారు. ఫౌండేషన్ అభివృద్ధికి సహకరించాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులను కోరామన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంశీరామరాజు మాట్లాడుతూ దివ్యాంగుల సేవలో కొనసాగుతున్న సంస్థకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. ‘వేగేశ్న’ సంస్థ మూడు దశాబ్దాల ప్రస్థానంలో వైస్ ఛైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్న సుంకరవల్లి శైలజను తన సేవా వారసురాలిగా రామరాజు ఈ సందర్భంగా ప్రకటించారు.

రూ. 150 కోసం ప్రాణం తీశారు

ఓ వ్యక్తిని కొట్టిచంపిన దాబా నిర్వాహకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: రూ. 150 బిల్లు కోసం ఓ వ్యక్తి నిండు ప్రాణాన్ని బలిగొన్నారొక దాబా నిర్వాహకులు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. కొండాపూర్ మండలం తెర్పోల్‌కు చెందిన శాకీర్‌మియా, రాములు, నర్సింలు సంగారెడ్డి శివారులోని ఓ దాబాలో భోజనం చేయడానికి వెళ్లారు. బిల్లు రూ. 1,150 అయింది. రూ.వెయ్యి చెల్లించారు. మిగిలిన రూ. 150 ఆటోలో ఉన్నాయి తెచ్చిస్తామని తెలిపారు. ఇందుకు దాబా యాజమాన్యం ఒప్పుకోలేదు. బయటకు వెళ్తున్న శాకీర్‌మియాపై సిబ్బందితో కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఆందోళనను విరమింపజేశారు.


మృతుడు శాకీర్‌మియా

కర్ణిసేన వీరంగం.. విధ్వంసం...

- హింసాత్మకంగా మారిన ‘పద్మావత్’ వ్యతిరేక నిరసనలు
- పలు రాష్ట్రాల్లో రహదారుల దిగ్బంధం
- ప్రభుత్వ రవాణా సంస్థల వాహనాలపై దాడులు
- నాలుగు రాష్ట్రాల్లో చిత్రాన్ని ప్రదర్శించబోమన్న మల్టీప్లెక్స్‌ల యజమానులు
- ఆందోళనల మధ్యే నేడు విడుదల కానున్న సినిమా


బుధవారం భోపాల్‌లో చేపట్టిన ఆందోళనల్లో కర్ణిసేన సభ్యులు తగులబెట్టిన కారు


పద్మావత్ చిత్ర విడుదలకు వ్యతిరేకంగా అహ్మదాబాద్‌లో ఆందోళనకారులు ధ్వంసం చేసిన ఓ థియేటర్ అద్దాలు

జైపుర్/ముంబయి

వివాదాస్పద చిత్రం ‘పద్మావత్’ విడుదలకు ఒకరోజు ముందుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో నిరసనలు ఉద్ధృత రూపం దాల్చాయి. ఈ సినిమా విడుదలను వ్యతిరేకిస్తూ బుధవారం కర్ణిసేన, రాజ్‌పుత్‌ల మద్దతుదారులు వివిధ నగరాలు, పట్టణాల్లో రహదారుల దిగ్బంధనానికి, విధ్వంసానికి దిగారు. తీవ్ర ఆందోళన నేపథ్యంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లోని మల్టీప్లెక్స్‌ల యజమానులు ఈ చిత్రాన్ని తమ థియేటర్లలో ప్రదర్శించబోమని ప్రకటించారు. ఉద్రిక్తతలు తగ్గిన తర్వాత సినిమా ప్రదర్శనపై నిర్ణయం తీసుకుంటామని భారత మల్టీప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దీపక్ వెల్లడించారు. గుజరాత్‌లో ఏ థియేటర్‌లోనూ ఈ సినిమాను ప్రదర్శించబోమని వాటి యజమానులు ప్రకటించారు. కొన్ని రాష్ట్రాలు ఈ చిత్రంపై నిషేధం విధించినప్పటికీ విడుదలకు సుప్రీంకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. నిరసనకారుల ఆందోళనలు కొనసాగుతున్నప్పటికీ గురువారం చిత్రం విడుదలకు ఏర్పాట్లు జరిగాయి. చిత్ర దర్శకులు సంజయ్ లీలా భన్సాలీ, నటి దీపికా పదుకొనే నివాసాల వద్ద ముంబయి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కర్ణిసేన, రాజ్‌పుత్‌ల మద్దతుదారులు 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. గురుగ్రామ్‌లో వందల మంది కర్ణిసేన కార్యకర్తలు, రాజ్‌పుత్‌ల మద్దతుదారులు నిషేధాజ్ఞలను ధిక్కరించి నిరసనలను చేపట్టారు. హరియాణా రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన ఒక బస్సుకు నిప్పంటించారు. దిల్లీ-జైపుర్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఖిడ్కి దౌలా పన్ను వసూలు కేంద్రాన్ని, పలు వాహనాలను ధ్వంసం చేయగా అరగంటకు పైగా ఇక్కడ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లఖ్‌నవూ, ముంబయి, పుణె, నాసిక్, తదితర నగరాలు, పట్టణాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. జైపుర్‌లో కర్ణిసేన సభ్యులు రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన రెండు బస్సులపై దాడికి పాల్పడ్డారు. అహ్మదాబాద్‌లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన 50 మందిని గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని మల్టీప్లెక్స్‌ల వెలుపల నిలిపి ఉంచిన 30 బైకులు, స్కూటర్లు ధ్వంసమయ్యాయి. మధ్యప్రదేశ్‌లో ఆగ్రా-ముంబయి రహదారిని అనుసంధానించే జాతీయ రహదారిపై ఆందోళన కారులు దాడులకు పాల్పడ్డారు. భోపాల్, ఇండోర్, గుణ తదితర చోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి.

బుల్లెట్లకూ భయపడం: కర్ణిసేన అధ్యక్షుడు

పద్మావత్ చిత్రం విడుదలయ్యే థియేటర్లలో ప్రజా కర్ఫ్యూను విధించనున్నట్లు శ్రీరాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు లోకేంద్ర సింగ్ కల్వి హెచ్చరించారు. అరెస్టులతో వెనక్కు తగ్గబోమని, బుల్లెట్లకు ఎదురొడ్డి అయినా సరే రాజస్థాన్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో ఈ చిత్రానికి వ్యతిరేకంగా తమ నిరసనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

దిల్లీలో పాఠశాల బస్సుపై దాడి

ఆందోళనకారులు చేపట్టిన హింసాత్మక నిరసనలో దిల్లీలో విద్యార్థులు చిక్కుకుపోయారు. జీడీ గోయింకా వరల్డ్ స్కూల్‌లో చదువుతున్న 2 నుంచి 12 తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు బస్సులో ఇళ్లకు తిరిగివెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. బస్సుపై జరుగుతున్న రాళ్ల దాడి నుంచి తప్పించుకోవటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు సీట్ల మధ్య దాక్కోవాల్సి వచ్చింది. ఈ ఘటనలో చిన్నారులు భయంతో వణికిపోయారు.

వ్యక్తిగత గోప్యత హక్కు, ప్రభుత్వ బాధ్యతల మధ్య సమతౌల్యం అవసరం: సుప్రీంకోర్టు

దిల్లీ: దేశం ఉగ్రవాదం, అక్రమ నగదు చలామణి వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో వ్యక్తిగత గోప్యత హక్కులు, ప్రభుత్వ బాధ్యతల మధ్య సమతౌల్యం పాటించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు బుధవారం అభిప్రాయపడింది. ఆధార్‌ను సవాల్ చేస్తూ దాఖలయిన పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనలు వినిపిస్తూ ఆధార్, ఆధార్ చట్టం.. పౌరులపై నిఘాకు దారి తీస్తాయని, రాజ్యాంగం నిఘా రాజ్యాన్ని అనుమతించదని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ “ఉగ్రవాదం, అక్రమ నగదు చలామణి సవాళ్లు ఎదురవుతున్న కాలమిది. మరోవైపు ప్రభుత్వం సంక్షేమానికి ఖర్చు చేస్తోంది. వీటిని వ్యక్తుల వ్యక్తిగత గోప్యత హక్కుతో సమతౌల్యం చేసుకోవాలి.” అని పేర్కొంది. మనల్ని ట్రాక్ చేస్తున్న గూగుల్ మ్యాప్స్, ఇతర ప్రైవేటు కార్పొరేషన్లను ఆమోదించడం లేదా అని ప్రశ్నించింది. దివాన్ స్పందిస్తూ రాజ్యం వాస్తవ సమయంలో ట్రాక్ చేస్తే అది పోలీసు రాజ్యమవుతుందని, గూగుల్ భారత రాజ్యం కాదని అన్నారు. గూగుల్ శక్తిమంతమే అయినా రాజ్యమంత శక్తిమంతం కాదన్నారు. ఆధార్ చట్టంలోని నిబంధనలను ప్రస్తావిస్తూ అవి రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రైవేటు నమోదు సంస్థలు వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నాయని, కానీ ఈ సంస్థలు చట్టం పరిధిలోకి రావని చెప్పారు. వాదనలు ఇంకా పూర్తి కాలేదు. ఈ నెల 30న కొనసాగించే అవకాశం ఉంది.

సిద్ధార్థ ధర్‌పై అంతర్జాతీయ ఉగ్రవాది ముద్ర

- భారత సంతతి ముష్కరుడిపై అమెరికా కఠిన ఆంక్షలు



వాషింగ్టన్: భారత సంతతికి చెందిన ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ముష్కరుడు సిద్ధార్థ ధర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా గుర్తించింది. బ్రిటిష్ హిందువైన సిద్ధార్థ ఇస్లాంలోకి మారాడు. అనంతరం తన పేరును అబూ రుమాయ్‌షాగా మార్చుకున్నాడు. 2014లో ఇతడు బ్రిటన్ పోలీసుల కళ్లుగప్పి భార్య పిల్లలతోసహా సిరియాకు పరారయ్యాడు. ఐఎస్ వీడియోల్లో అమాయకుల గొంతుకలు కోసే జిహాదీ జాన్‌ను భద్రతా బలగాలు మట్టుపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడి స్థానాన్ని సిద్ధార్థ భర్తీ చేస్తున్నట్లు అమెరికా వెల్లడిచింది. 2016 జనవరిలో ఐఎస్ విడుదలచేసిన వీడియోలో ముసుగు ధరించి పలువురు బందీలను ఊచకోత కోసింది ఇతడేనని పేర్కొంది. మరోవైపు బెల్జియం-మొరాకో పౌరుడు అబ్దెలాతీఫ్ గైనీనూ సిద్ధార్థతోపాటు అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించినట్లు తెలిపింది. అమెరికావాసులు, దేశ భద్రతకు ముప్పు కలిగించే చర్యలకు పాల్పడినందుకే వీరిపై కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వివరించారు. ప్రస్తుతం అమెరికాలో వీరికి చెందిన ఆస్తులు, ఇతర సదుపాయాలు తమ ఆధీనంలోకి వచ్చేస్తాయని స్పష్టంచేశారు. అంతేకాదు వీరితో అమెరికావాసులు ఎలాంటి లావాదేవీలు కొనసాగించకుండా నిషేధం కొనసాగుతుందని తెలిపారు. సిద్ధార్థను కొత్త జిహాదీ జాన్‌గా ప్రముఖ వార్తా సంస్థ వ్యాఖ్యానించింది. ఇతడు ఐఎస్ సీనియర్ కమాండర్‌గా మారినట్లు పేర్కొంది. మే 2016లో తనను సిద్ధార్థ అపహరించి, లైంగిక బానిసగా చేసుకొని హింసించాడని ఓ యాజిదీ బాలిక చెప్పినట్లు వివరించింది.

అమర్‌నాథ్ యాత్రికులను కాపాడిన బస్సు డ్రైవరుకు సాహస అవార్డు


షేక్ సలీం గపూర్

దిల్లీ: తీవ్రవాదుల బుల్లెట్ల వర్షాన్ని తప్పించుకుంటూ....ఎంతో సాహసంతో చాకచక్యంగా బస్సును సురక్షిత ప్రాంతం చేరేదాకా నడిపి 52 మంది అమర్‌నాథ్ యాత్రికుల ప్రాణాలు కాపాడిన బస్సు డ్రైవరు షేక్ సలీం గపూర్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. భారత గణతంత్ర దినం సందర్భంగా ఈ అవార్డును ప్రకటించారు. ఈ మేరకు హోంశాఖ బుధవారం ఒక ప్రకటన చేసింది. అరుదైన సాహసాన్ని ప్రదర్శించే పౌరులకు ఇచ్చే ‘ఉత్తమ్ జీవన్ రక్ష పాదక్’ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఈ తరహా అవార్డుల్లో దీనిని ద్వితీయ ఉత్తమ పురస్కారంగా పేర్కొంటారు. గత జులై 10వ తేదీన గుజరాత్‌కు చెందిన బస్సులో యాత్రికులను తీసుకుని అనంత్‌నాగ్ జిల్లా బటెంగూ ప్రాంతానికి వచ్చేసరికి ఒక్కసారిగా తీవ్రవాదుల గుళ్లవర్షం మొదలైంది. ఆరుగురు యాత్రికులు మరణించారు. 14మంది గాయపడ్డారు. చుట్టూ చీకటి...అలాంటి స్థితిలో కూడా గపూర్ నిబ్బరాన్ని కోల్పోలేదు. నాకెందుకులే! అని స్టీరింగ్ వదిలి తనను తాను రక్షించుకునే యత్నం చేయలేదు. ధైర్యంగా బస్సును ముందుకు దూకించారు. సురక్షిత ప్రాంతం చేరేదాకా అలా వంగి కూచుని..తుపాకీ తూటాల నుంచి కాపాడుకుంటూ బస్సు నడిపారు. ఆ నిస్వార్థ సాహసమే ఆయనకు ఈ అవార్డును తెచ్చిపెట్టింది. దీనితోపాటూ ఆయనకు 26 వ తేదీ తర్వాత జరిగే మరో కార్యక్రమంలో రూ.లక్ష నగదు పురస్కారంతో సత్కరించనున్నారు.

ఈనాడు బిజినెస్



బుధవారం దిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న భారత్ బయోటెక్ సీఎండీ కృష్ణ ఎల్లా

భారత్‌బయో రోటావ్యాక్‌కు డబ్ల్యూహెచ్‌ఓ గుర్తింపు

- వర్ధమాన దేశాలనుంచి ఘనత సాధించిన తొలి వ్యాక్సిన్
- ఇక ప్రపంచదేశాలకు అందుబాటులోకి

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన రోటావైరస్ టీకా (వ్యాక్సిన్) 'రోటావ్యాక్'కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గుర్తింపు (ప్రీ క్వాలిఫికేషన్) లభించింది. భారత్‌లోనే కాక వర్ధమాన దేశాల్లో అభివృద్ధి చేసి డబ్ల్యూహెచ్‌ఓ గుర్తింపు పొందిన తొలి రోటావైరస్ వ్యాక్సిన్ ఇదేనని భారత్ బయోటెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కృష్ణ ఎల్లా తెలిపారు. బుధవారం నాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రోటావైరస్ కారణంగా వచ్చే డయేరియా (నీళ్ల విరోచనాలు)ను ఈ వ్యాక్సిన్ నిరోధిస్తుందని, చిన్నారులు మృత్యువాత పడకుండా కాపాడుతుందని ఎల్లా అన్నారు. 2015 మార్చిలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యాక్సిన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. తాజాగా డబ్ల్యూహెచ్‌ఓ నుంచి ప్రీక్వాలిఫికేషన్ (గుర్తింపు) లభించింది. వ్యాక్సిన్లకు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు ఉంటేనే యునిసెఫ్, గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్స్ ఇనీషియేటివ్ (గవి) వంటి సంస్థలు వాటిని కొనుగోలు చేసి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాల కింద సరఫరా చేయగలుగుతాయి.

ఇప్పుడు భారత్ బయోటెక్‌కు చెందిన 'రోటావ్యాక్'కు ఆ గుర్తింపు లభించడం వల్ల రోటావైరస్ వల్ల వచ్చే డయేరియా తీవ్రంగా ఉండే అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ టీకాను విస్తృతంగా సరఫరా చేయొచ్చు. జాతీయ ఇమ్యునైజేషన్ కార్యక్రమం కింద 2016 నుంచి భారత్‌లో రోటావ్యాక్ టీకాను ఇస్తున్నారు. ఇప్పటి వరకూ 3.5 కోట్ల డోసులను భారత్ బయోటెక్ సరఫరా చేసింది.

> **భారత్‌తో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి డబ్ల్యూహెచ్‌ఓ గుర్తింపు పొందిన తొలి రోటావైరస్ వ్యాక్సిన్ మాదే కావడం సంతోషాన్ని కలిగిస్తోంది. భారత్‌లో తయారైన ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచం మొత్తానికి అందించే అవకాశం దక్కడం మాకు గర్వకారణం. డయేరియా తీవ్రంగా ఉండే దేశాల్లో దీన్ని వినియోగించిన తర్వాత దీని ప్రభావం ఏమిటో తెలిసి వస్తుంది. భారత ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని లక్షలాది మంది చిన్నారులకు రోటావ్యాక్‌ను అందుబాటులోకి తెచ్చింది. తక్కువ ఆదాయ దేశాలకు ఈ వ్యాక్సిన్ ఒక డోసును కేవలం ఒక డాలర్‌కే అందిస్తున్నాం. వివిధ దేశాల కొనుగోళ్లు 10 కోట్ల డోసుల స్థాయికి చేరితే ధరను 30 శాతం వరకూ తగ్గించడానికి వీలుంది.**
>
> **– కృష్ణ ఎల్లా**

20 ఏళ్ల పైగా కృషి..

బహుళ దేశాలు, సంస్థల సంయుక్త కృషితో దాదాపు 20 ఏళ్లకు పైగా కష్టపడి ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు ఎల్లా చెప్పారు. అభివృద్ధిలో భారత బయోటెక్నాలజీ విభాగం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పాత్ తదితరాలు పాలుపంచుకున్నాయి. రోటావ్యాక్ అభివృద్ధి, తయారీ యూనిట్ ఏర్పాటుకు దాదాపు 20 కోట్ల డాలర్లు (దాదాపు రూ. 1,300 కోట్లు) వెచ్చించారు. హైదరాబాద్‌లోని రోటా వ్యాక్ తయారీ యూనిట్‌కు ఏడాదికి 20 కోట్ల డోసులను తయారు చేసే సామర్థ్యం ఉంది. టీకా అభివృద్ధికి అయిన ఖర్చులో దాదాపు రూ.700 కోట్లను బయోటెక్నాలజీ విభాగం, బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్, రిసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ నార్వే, యూకే డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌లు గ్రాంట్‌గా అందించాయి. రోటావ్యాక్ అభివృద్ధిలో బయోటెక్నాలజీ విభాగం మాజీ కార్యదర్శి ఎం.కె.బాన్ కీలక పాత్ర పోషించారు. రోటావైరస్ వల్ల వచ్చే డయేరియాతో 2013లో ప్రపంచ వ్యాప్తంగా అయిదేళ్లలోపు పిల్లలు 2,15,000 మంది చనిపోయారని అంచనా. డబ్ల్యూహెచ్‌ఓ గుర్తింపు లభించడంవల్ల ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఇతర దేశాలకు రోటావ్యాక్‌ను సరఫరా చేయడానికి అవకాశం కలిగింది. దేశంలో ప్రభుత్వం అమలుచేసే యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ద్వారానే కాకుండా ప్రైవేటు మార్కెట్‌లోనూ భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను విక్రయిస్తోంది. కేంద్ర బయో టెక్నాలజీ విభాగం సీనియర్ సలహాదారు టీఎస్‌రావు మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ డోస్‌ను పిల్లలకు 6, 10, 14 వారాల్లో ఇవ్వాలని చెప్పారు. దేశంలో 40% డయేరియా కేసులు రోటావైరస్ వల్లే నమోదవుతున్నాయన్నారు. మిలిందా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి డంకన్‌స్టీల్ మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్‌వల్ల కేవలం భారతీయ చిన్నారులకే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిన్నారులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ శాఖ మాజీ కార్యదర్శి ఎం.కె. భాన్, పాత్ సంస్థ డైరెక్టర్ నీరజ్‌జైన్, భారత్ బయోటెక్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సంస్కరణల్లో ముఖ్యాంశాలు

- ✦ సంస్కరణల వల్ల బ్యాంకుల రుణ సామర్థ్యం రూ.5 లక్షల కోట్లకు పెరుగుతుంది.
- ✦ సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు బ్యాంకుల రుణాలు పెరిగే అవకాశం ఉంది.
- ✦ పెద్ద స్థాయి ఎగవేతదార్లపై కఠిన నిబంధనలు అమలు చేస్తారు.
- ✦ మొండి బకాయిల రికవరీ కోసం బ్యాంకులు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయనున్నాయి.
- ✦ రూ.250 కోట్లకు పైబడిన రుణ పంపిణీలపై కఠిన విధానాలను ప్రకటించనున్నారు.
- ✦ పీఎస్‌యూ బ్యాంకుల బోర్డులను బలోపేతం చేయాలి.
- ✦ సంస్కరణల అజెండాను బ్యాంకు బోర్డులు త్రైమాసిక పద్ధతిన పరిశీలన జరపాలి.
- ✦ మెరుగైన పనితీరును ప్రదర్శించిన వాటికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి.
- ✦ జాయింట్ లయబిలిటీ ఫోరమ్‌లో రుణదాతల సంఖ్యను తగ్గించాలి.
- ✦ డిపాజిట్ల నగదును పరిరక్షించాలి. ఏ బ్యాంకూ విఫలం కాకూడదు.

బ్యాంకులకు దండిగా నిధులు


మార్చి కల్లా లక్ష కోట్లు

- మూలధన సాయం రూ.88,000 కోట్లు ● మిగతా షేర్ల విక్రయాల ద్వారా
- బ్యాంకుల బలోపేతమే మా లక్ష్యం ● భారీ రుణాలకు కఠిన నిబంధనలు: జైట్లీ

దిల్లీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 20 ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లకు రూ.88,139 కోట్ల మూలధనాన్ని ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఐడీబీఐ బ్యాంక్‌కే రూ.10,610 కోట్లు రానున్నాయి. పీఎస్‌బీల్లోకి పంపాల్సిన మూలధన మొత్తం విషయంలో మా శాఖ విస్తృతమైన పరిశోధన చేశాకే ఈ నిర్ణయం తీసుకుందని బ్యాంకింగ్ రంగ సంస్కరణల ప్రకటన సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వివరించారు. మొండి బకాయిల సమస్యను తీర్చడానికి రుణాలకు మద్దతునివ్వడానికి ఈచర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అధిక విలువ గల రుణాలు ముఖ్యంగా రూ.250 కోట్లు ఆ పైన ఉన్న రుణాల పంపిణీపై కఠిన నిబంధనలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణపై ప్రభుత్వ నిర్ణయం మారదని కూడా ఆయన స్పష్టం చేశారు. పునఃపరిశీలన జరగదని అయితే అమలు చేయడానికి సమయం పడుతుందని ఆయన అన్నారు. 'ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ వాటాను 49 శాతానికి తగ్గించాలని భావిస్తున్నాం. ఇది తప్ప మిగతా ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు భారత్ సిద్ధంగా లేద'ని గతంలో జైట్లీ అన్నారు.

మరో పక్క, 'బ్యాంకుల మూలధన పునర్నిర్మాణమనేది ఆయా బ్యాంకుల పనితీరు, సంస్కరణలపై ఆధారపడి ఉంటుంది. రూ.250 కోట్లకు పైబడిన రుణాలపై ప్రత్యేక పరిశీలన ఉంటుంద'ని ఆర్థిక సేవల విభాగ కార్యదర్శి రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. బయటి మదుపర్లకు షేర్లను విక్రయించడం కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం మూలధన పునర్నిర్మాణ విలువ రూ.1 లక్షకోట్లను అధిగమిస్తుందని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు.



> 'బ్యాంకులు అత్యున్నత ప్రమాణాల్లో విధానాలను పాటించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గతం మళ్లీ పునరావృతం కాకుండా సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగ బ్యాంకులను పూర్తి బలంగా ఉండేలా చేయాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వానిదే.'
>
> **ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ**

✦ ఇదీ అసలు ప్రణాళిక

గతేడాది అక్టోబరులో రూ.2.1 లక్షల కోట్ల మూలధన పునర్నిర్మాణ ప్రణాళికను ప్రకటించారు. అయితే రెండేళ్లలో అంటే 2017-18, 2018-19 ఏడాదుల్లో ఈ ప్రణాళికను అమలు చేస్తారు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులకివ్వనున్న రూ.88,139 కోట్లలో రూ.80,000 కోట్లను బ్యాంకులకు మూలధన పునర్నిర్మాణ బాండ్లను జారీ చేయడం ద్వారా ఆర్థిక శాఖ సమీకరిస్తుంది. మిగతా రూ.8139 కోట్లను బడ్జెట్ ద్వారా సమీకరిస్తుంది. ఇప్పటిదాకా బ్యాంకులు రూ.10,312 కోట్లను సమీకరించింది. 2017-18లో మిగిలిన కాలంలో మరిన్ని నిధులను సమీకరించే అవకాశం ఉంది.

✦ ద్రవ్యలోటుపై ప్రభావం ఉండదు

రూ.2.1 లక్షల కోట్ల మూలధన పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకులకిచ్చే రూ.80,000 కోట్ల ప్రభుత్వ రంగ బ్యాంకుల పునర్నిర్మాణ బాండ్లను జారీ చేయడం వల్ల ద్రవ్యలోటుపై ప్రభావం పడదని ఆర్థిక శాఖ అంటోంది. 10-15 ఏళ్ల గడువు ఉండే ఈ బాండ్లకు చట్టబద్ధ ద్రవ్యనిష్పత్తి (ఎస్ఎల్ఆర్) ఉండదని ఆర్థిక కార్యదర్శి ఎస్.సి. గార్గ్ పేర్కొన్నారు. 'బ్యాంకులకు బాండ్లను జారీ చేయడం వల్ల ద్రవ్య ప్రభావం ఉండదు. మార్పిడి ఒప్పందాల వల్ల నగదు తటస్థంగానే ఉంటుంది. కాబట్టి ఇది ఆందోళన కలిగించే అంశం' కాదని వివరించారు.

మార్చి 31లోగా ఏ బ్యాంకుకు ఎంత వస్తుందంటే..

బ్యాంకు	కోట్లు(రూ.లలో)
ఐడీబీఐ బ్యాంక్	10610
ఎస్‌బీఐ	8800
బ్యాంక్ ఆఫ్ ఇండియా	9232
యూకో బ్యాంక్	6507
పంజాబ్ నేషనల్ బ్యాంక్	5473
బ్యాంక్ ఆఫ్ బరోడా	5375
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	5158
కెనరా బ్యాంక్	4865
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	4694
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	4524
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	3571
దేనా బ్యాంక్	3045
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	3173
యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	2634
కార్పొరేషన్ బ్యాంక్	2187
సిండికేట్ బ్యాంక్	2839
ఆంధ్రాబ్యాంక్	1890
అలహాబాద్ బ్యాంక్	1500
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్	785

ఆ సమయంలోనే మొండికేశాయ్

- జులై-డిసెంబరులో పెరిగిన ఎన్‌పీఏలు ● 58% బ్యాంకుల పరిస్థితిది

గతేడాది జులై-డిసెంబరు కాలంలో బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) భారీగా పెరిగాయని ఓ నివేదిక అంటోంది. దాదాపు 58 శాతం బ్యాంకుల్లో ఎన్‌పీఏలు పెరిగాయి. మౌలిక, లోహ, ఇంజినీరింగ్ వస్తువుల రంగాలు ఈ మొండి బకాయిల్లో ఎక్కువ వాటాను కలిగి ఉన్నట్లు 19 ప్రభుత్వ రంగ, ప్రైవేటు, విదేశీ బ్యాంకుల నుంచి స్పందనలను తీసుకున్న అనంతరం ఫిక్కీ-ఐబీఏ సర్వే తెలిపింది. ఈ సర్వే ప్రకారం.. కేవలం 28 శాతం బ్యాంకులు మాత్రమే రుణ పునర్నిర్మాణాలకు విజ్ఞప్తులు పెరిగాయని తెలిపాయి. అంతక్రితం 40 శాతం బ్యాంకులు ముందుకొచ్చాయి.

- ✦ కనీస ప్రత్యామ్నాయ రేటు(మ్యాట్)ను 15 శాతానికి తగ్గించాలని కోరుతున్నాయి.
- ✦ కాసా డిపాజిట్ల షేర్లు పెరిగిందని ఈ సారి 48 శాతం బ్యాంకులు చెప్పగా.. అంతక్రితం 58 శాతం బ్యాంకులు ఆ విషయాన్ని పేర్కొన్నాయి. ఓ మోస్తరుగా కాసా డిపాజిట్లు తగ్గాయని 35 శాతం బ్యాంకులు వెల్లడించాయి.
- ✦ చాలావరకు బ్యాంకులు కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలని సూచిస్తున్నాయి.

రూ.2.75 లక్షల కోట్లు	రూ.7.33 లక్షల కోట్లు	రూ.9.5 లక్షల కోట్లు
మార్చి 2015 నాటికి మొండి బకాయిలు	జూన్ 2017 నాటికి మొండి బకాయిలు	మార్చి 2018 నాటికి మొండి బకాయిల అంచనా

ఫీచర్ ఫోన్లలో జియో ఫోన్ నెం.1

దిల్లీ: దేశీయ ఫీచర్‌ఫోన్ విపణిలో 27 శాతం వాటా ద్వారా అగ్రస్థానాన్ని రిలయన్స్ 'జియోఫోన్' బ్రాండ్ సాధించినట్లు కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ సంస్థ తెలిపింది. 2017 నాలుగో త్రైమాసికంలో తయారీ సంస్థల నుంచి సరఫరా (షిప్‌మెంట్)లను పరిగణనలోకి తీసుకుని, ఈ నివేదికను సంస్థ రూపొందించింది. రూ.1,500 విలువైన ఈ ఫోన్ల సరఫరా అక్టోబరు-డిసెంబరు ఆఖరులో అధికంగా జరిగాయని, గిరాకీ-సరఫరాల మధ్య అంతరాయాన్ని నివారించగలిగిందని పేర్కొంది. ఈ ఫోన్ కోసం 60 లక్షల ముందస్తు బుకింగ్‌లు లభించడం, సాధారణ ఫీచర్‌ఫోన్ వాడిన వారు, 4జీ నెట్‌వర్క్‌పై పనిచేసే ఈ ఫోన్‌కు అప్‌గ్రేడ్ అవుదామని భావించడం జియో ఫోన్ విజయవంతానికి కారణాలని కౌంటర్‌పాయింట్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ తెలిపారు. నగదు వాపసు పొందడం ద్వారా, జియో ఫోన్‌ను ఉచితంగా వినియోగించుకునే వీలు దక్కడం కూడా కలిసి వచ్చిందన్నారు. ఈ ఫోన్‌లో మెమొరీ కార్డు కూడా వేసుకునే వీలుంది. జియో చందాదారులు నెలకు 100 కోట్ల జీబీ డేటాను వినియోగిస్తున్నట్లు సమాచారం.

ఐడియాకు పెరిగిన నష్టం

అక్టోబరు- డిసెంబరులో రూ.1284 కోట్లు

దిల్లీ

అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో ఐడియా రూ.1,284.50 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. కిందటేడాది ఇదే సమయంలో రూ.383.90 కోట్ల నష్టాన్ని చవిచూసింది. కార్యకలాపాల ఆదాయం 25 శాతం తగ్గి రూ.8,662.7 కోట్ల నుంచి రూ.6,509.60 కోట్లకు పరిమితమైంది. 'అనుసంధానిత వినియోగ ఛార్జీల (ఐయూసీ) సెటిల్‌మెంట్ రేట్లలో 57 శాతం కోత విధించడం వల్ల మా రెవెన్యూ, ఎబిటాలపై రూ.820 కోట్లు, రూ.230 కోట్లు చొప్పున ప్రతికూల ప్రభావం పడింద'ని ఐడియా ఒక ప్రకటనలో తెలిపింది. ఐయూసీ ఛార్జీల తగ్గింపుతో పరిశ్రమపై తీవ్ర ఒత్తిడి నెలకొందని పేర్కొంది. అందు వల్ల ఏడాదిక్రితం త్రైమాసిక ఫలితాలతో తాజా ఫలితాలను పోల్చిచూడొద్దని పేర్కొంది. కంపెనీ ఎబిటా కూడా 18.5 శాతం క్షీణించి రూ.1,223.30 కోట్లకు పరిమితమైంది. 2017 డిసెంబరు 31 నాటికి నికర రుణం రూ.55,781.80 కోట్లుగా నమోదైంది. స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసేందుకు తీసుకున్న రుణం కూడా ఇందులో కలిపి ఉంది. అక్టోబరు- డిసెంబరులో వాయిస్ సేవల విభాగంలో వినియోగదారు సగటు వినియోగం 509 నిమిషాలకు పెరిగిందని ఐడియా తెలిపింది. డేటా విభాగంలో సగటు వినియోగం కూడా పెరిగి 703 ఎంబీ నుంచి 4,742 ఎంబీకి చేరిందని పేర్కొంది. తన ప్రధాన విపణుల్లో 2018 మార్చి నుంచి సొంత 'వాయిస్ ఓవర్ ఎల్‌టీఈ'ని (వీఓఎల్‌టీఈ) అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. ప్రస్తుత త్రైమాసికానికి రూ.1,750 కోట్లను వెచ్చించాలని తన మూలధన వ్యయ ప్రణాళికలో ఐడియా నిర్దేశించుకుంది.

రూ.6,750 కోట్ల సమీకరణ

వొడాఫోన్- ఐడియా విలీనం అనంతరం ఏర్పడే సంస్థ బ్యాలెన్స్ షీటును బలోపేతం చేసేందుకు రూ.6,750 కోట్ల మూలధనాన్ని సమీకరించే పనిలో ఉన్నామని ఐడియా తెలిపింది. ఇందులో రూ.3,250 కోట్ల సమీకరణ నిమిత్తం ప్రమోటర్ గ్రూపు సంస్థలకు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో 32.66 కోట్ల షేర్ల జారీకి బోర్డు ఇప్పటికే అనుమతినిచ్చిందని తెలిపింది. మరో రూ.3,500 కోట్ల సమీకరణ కోసం వివిధ మార్గాలను అన్వేషించేందుకు కమిటీని బోర్డు ఏర్పాటు చేసిందని పేర్కొంది. ఈ నిధుల సమీకరణతో నికర రుణం తగ్గుతుందని తెలిపింది. విలీన అనంతరం ఏర్పడే కొత్త సంస్థకు వొడాఫోన్ నుంచి సంక్రమించే నికర రుణం కూడా కొంత మేర తగ్గుతుందని పేర్కొంది. ఐడియా, వొడాఫోన్ ఇండియాల టవర్ల వ్యాపార విక్రయం, ఇండస్ టవర్స్‌లో ఐడియా వాటా విక్రయం తదితరాల వల్ల లభించే నిధులు విలీనానంతర సంస్థకు దీర్ఘకాల మూలధన వనరులుగా ఉపయోగపడతాయని వివరించింది. విలీన ప్రక్రియకు వివిధ నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు రావడం కూడా తుది దశకు చేరుకుందని వెల్లడించింది.



బీఎస్ఈలో షేరు 5.38% క్షీణించి రూ.94.05 వద్ద ముగిసింది.

ఆర్థిక ఫలితాలు

లాభంలో 56% వృద్ధి

ముంబయి: చౌకధరల విమానయాన సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 762.03 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నమోదు చేసిన రూ.487.25 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 56.4 శాతం అధికం. ఆదాయ నిర్వహణ, తయారీదార్ల నుంచి రుణం ఇందుకు తోడ్పడిందని కంపెనీ వెల్లడించింది. ఇక మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.4,986.49 కోట్ల నుంచి 23.94 శాతం వృద్ధితో రూ.6,177.82 కోట్లకు చేరింది. ప్రయాణికుల టికెట్ ఆదాయం 21.8 శాతం పెరిగి రూ.5,322.46 కోట్లుగా నమోదైంది. ఇతర ఆదాయం 20 శాతం పెరిగి రూ.700.12 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు సైతం 18 శాతం అధికమై రూ.5,378.19 కోట్లకు పెరిగాయి.

బీఎస్ఈలో షేరు 3.70% లాభంతో రూ.1,237.90 వద్ద ముగిసింది.

కేటాయింపుల భారం

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కెనరా బ్యాంక్ నికర లాభం 61 శాతం క్షీణించి రూ.126 కోట్లకు పరిమితమైంది. ఏడాదిక్రితం ఇదే సమయంలో నికర లాభం రూ.322 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తులకు అధిక కేటాయింపులు లాభంలో క్షీణతకు కారణమని బ్యాంకు తెలిపింది. సమీక్ష త్రైమాసికంలో వడ్డీ ఆదాయం రూ.10,775 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 10.51 శాతం నుంచి 10.38 శాతానికి తగ్గింది. నికర నిష్పత్తి నుంచి 7.02 శాతం నుంచి 6.78 శాతానికి పరిమితమైంది.

బీఎస్ఈలో షేరు 1.3% పెరిగి రూ.379.25 వద్ద ముగిసింది.

ఫలితాలు నిరాశాజనకం

బెంగళూరు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగానికి చెందిన విజయా బ్యాంక్ రూ.79.56 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.230.28 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 65.45 శాతం తక్కువ. మొండి బకాయిలపై కేటాయింపులు పెరగడమే ఇందుకు కారణమని బ్యాంక్ వెల్లడించింది. మొత్తం ఆదాయం రూ.3,714.37 కోట్ల నుంచి 7.09 శాతం తగ్గి రూ.3,450.81 కోట్లకు చేరింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో స్థూల ఎన్‌పీఏలు 6.98 శాతం నుంచి 6.17 శాతానికి; నికర ఎన్‌పీఏలు 4.74 శాతం నుంచి 3.99 శాతానికి మెరుగుపడ్డాయి. అయితే మొండి బకాయిలపై కేటాయింపులు మాత్రం రూ.416.95 కోట్ల నుంచి 62.35 శాతం అధికమై రూ.676.92 కోట్లకు చేరాయి.

బీఎస్ఈలో షేరు 0.29% లాభంతో రూ.69.25 వద్ద ముగిసింది.

46% క్షీణించిన లాభం

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన బయోకాన్ నికర లాభం 46.35 శాతం తగ్గి రూ.91.9 కోట్లకు పరిమితమైంది. 2016-17లో ఇదే సమయంలో కంపెనీ రూ.171.30 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏకీకృత ఆదాయం రూ.1,044.40 కోట్ల నుంచి రూ.1,057.90 కోట్లకు పెరిగింది. 'ఈ త్రైమాసికం మాకు చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. ఎందుకంటే మైలాన్ భాగస్వామ్యంతో మేం అభివృద్ధి చేసిన బయోసిమిలర్ ట్రాస్టూజుమాబ్‌కు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతులు లభించాయ'ని బయోకాన్ ఎండీ, ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా తెలిపారు.

బీఎస్ఈలో షేరు 1.12% పెరిగి రూ.634.60 వద్ద ముగిసింది.

ఆదాయంలో 14 శాతం వృద్ధి

దిల్లీ: డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో రేమండ్ ఏకీకృత నికర లాభం రూ.30.71 కోట్లుగా నమోదైంది. ఏడాదిక్రితం ఇదే సమయంలో రూ.14.69 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయం 13.74 శాతం పెరిగి రూ.1330.71 కోట్ల నుంచి రూ.1,513.55 కోట్లకు చేరింది. 'మా ఇంజినీరింగ్ వ్యాపారం విజయవంతంగా లాభాల్లోకి రావడం, అన్ని విభాగాల వ్యాప్తంగా ఆదాయాల్లో బలమైన వృద్ధి కారణంగా మెరుగైన పనితీరును కనబర్చామ'ని రేమండ్ ఛైర్మన్, ఎండీ గౌతమ్ హరి సింఘానియా తెలిపారు. వార్షిక ప్రాతిపదికన రేమండ్ ఎబిటా 59 శాతం వృద్ధితో రూ.131 కోట్లకు చేరగా.. మార్జిన్ 24.6 శాతం పెరిగింది.

బీఎస్ఈలో షేరు 0.24% తగ్గి రూ.1,123.55 వద్ద ముగిసింది.

9% తగ్గిన లాభం

దిల్లీ: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో యునైటెడ్ స్పిరిట్స్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.134.7 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.147.7 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 8.80 శాతం తక్కువ. కొన్ని రాష్ట్రాల్లో మార్కెట్ పరిస్థితులు మారడం లాభం తగ్గడానికి కారణమని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం ఆదాయం రూ.7,077.8 కోట్ల నుంచి 1.17 శాతం వృద్ధితో రూ.7,160.9 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో షేరు 6.98% నష్టంతో రూ.3,489.05 వద్ద ముగిసింది.

లాభం రూ.87 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక మూడో త్రైమాసికంలో ఔషధ సంస్థ ఫైజర్ రూ.87.24 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.62.37 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 39.87 శాతం అధికం. వ్యయాలు తగ్గడం ఇందుకు దోహదపడిందని కంపెనీ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.510.2 కోట్ల నుంచి రూ.456.5 కోట్లకు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో కంపెనీ నికర లాభం రూ.267.6 కోట్ల నుంచి రూ.254.9 కోట్లకు తగ్గింది.

బీఎస్ఈలో షేరు 4.30% నష్టంతో రూ.2,201.55 వద్ద ముగిసింది.

ఆదాయం రూ.2180 కోట్లు

దిల్లీ: అక్టోబరు- డిసెంబరులో జిందాల్ ఎస్‌ఏడబ్ల్యూ నికర లాభం 19% పెరిగి రూ.96.23 కోట్లకు చేరింది. 2016-17లో ఇదే కాలంలో కంపెనీ రూ.80.67 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయం కూడా రూ.1,466.62 కోట్ల నుంచి రూ.2,180.69 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.2,014.26 కోట్లుగా నమోదయ్యాయి. ఏడాదిక్రితం ఇదే సమయంలోని రూ.1,344.35 కోట్లతో పోలిస్తే వ్యయాలు పెరగడం గమనార్హం.

బీఎస్ఈలో షేరు 3.69% క్షీణించి రూ.168.20 వద్ద ముగిసింది.

సాగర్ సిమెంట్స్ లాభం రూ.3 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమసికానికి ఏకీకృత ప్రాతిపదికన సాగర్ సిమెంట్స్ రూ.3.01 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర నష్టం రూ.54 లక్షలతో పోలిస్తే కంపెనీ లాభాల బాట పట్టింది. సమీక్ష త్రైమాసికానికి ఆదాయం రూ.222 కోట్ల నుంచి రూ.251 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ▲ 22 **36162** | **నిఫ్టీ** ▲ 02 **11086** | **రూపాయి** 63.69 ▲ (ఒక అమెరికా డాలరుకు) 09 పైసలు | **బంగారం** 30,425 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 185 | **వెండి** 39,145 ▲ ముంబయిలో కిలో రూ.లలో 385 | **ముడి చమురు** 69.91 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)




ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,218	+07
నాస్‌డాక్	7,407	−53
నిక్కీ 225 (జపాన్)	23,941	−183
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,609	+17
షాంఘై(చైనా)	3,561	+14
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,643	−88
డాక్స్ (జర్మనీ)	13,415	−145

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.96	67.21
పౌండ్ స్టెర్లింగ్	81.28	94.28
యూరో	71.32	82.72
జపనీస్ యెన్/100	52.67	61.08
ఆస్ట్రేలియా డాలరు	46.36	53.63
సింగపూర్ డాలరు	44.03	52.15
థాయ్ బాత్/100	182.67	218.57
బహ్రెయిన్ దీనార్	156.97	179.88
కువైట్ దీనార్	175.33	218.27
సౌదీ రియాల్	15.41	18.27
యూఏఈ దిర్హమ్	15.77	18.44
మలేషియా రింగిట్	14.48	17.81
చైనీస్ యువాన్	7.04	11.44


బుధవారం నిఫ్టీ కదలికలు



నోట్ల రద్దు వల్లే వృద్ధి నెమ్మదించింది: రాజన్

దావోస్: పెద్దనోట్ల రద్దు వల్లే భారత వృద్ధిరేటు నెమ్మదించిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పూర్వ గవర్నర్ రఘురాం రాజన్ పేర్కొన్నారు. 'పెద్దనోట్ల రద్దు వల్ల ఆర్థిక వ్యవస్థ కార్యాచరణ బాగుంటుందనే వాదనలున్నాయి. పన్ను గణాంకాలు వెలువడే వరకు ఇవి కొనసాగాయి. అయితే నేను మాత్రం వృద్ధిరేటు నెమ్మదించడంలో ప్రధాన పాత్ర పెద్దనోట్ల రద్దు అనంతరం తలెత్తిన పరిస్థితులే అని అనుకుంటున్నా. కొన్ని వ్యాపారాలు మనుగడ సాగించలేక మూతబడ్డాయి. లెక్కల్లో చూపని ధనం పెద్దగా బయట పడలేదు. ఈ చర్య వల్ల కలిగే సానుకూల పరిణామాల కోసం వేచి చూడాల్సిందే. అయితే డిజిటల్ చెల్లింపులు పెరిగేందుకు మాత్రం కొంతవరకు దోహదపడింది. ఇతర ప్రతికూల ప్రభావాలను పరిగణనలోకి తీసుకుంటే, ఇది తక్కువే అని చెప్పాలి' అని రాజన్ తెలిపారు.

కోడిగుడ్లు



24వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	380	వరంగల్	382
చిల్లరగా(ఒక గుడ్డు)	4.40	విశాఖపట్నం	402
బెంగళూరు	390	చెన్నై	405
25న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	397	నమక్కల్	380

ప్రపంచ దిగ్గజాల్లో రిలయన్స్ రిటైల్

- **250 రిటైల్ సంస్థల్లో 189వ స్థానం**
- **డెలాయిట్ గ్లోబల్ నివేదిక**

ముంబయి: ప్రపంచ అగ్రశేణి 250 రిటైల్ సంస్థల జాబితాలో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ రిటైల్‌కు చోటు దక్కింది. వినియోగదారుల వ్యయాలు పెరగడానికి తోడు దేశ పటిష్ఠ వృద్ధికి ఇది దర్పణం పడుతోందని డెలాయిట్ గ్లోబల్ నివేదిక పేర్కొంది. రిలయన్స్ రిటైల్ అధిక విక్రయాలు ఎఫ్ఎంసీజీ విభాగంలోనే జరుగుతున్నాయి. 2015-16లో సంస్థ ఆదాయం 59.2 శాతం పెరిగిందని నివేదిక వివరించింది. దుస్తులకు సంబంధించి రిలయన్స్ ట్రెండ్స్, పాదరక్షలను రిలయన్స్ ఫుట్‌ప్రింట్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను రిలయన్స్ డిజిటల్ విక్రయశాలల్లో రిలయన్స్ రిటైల్ అమ్మకాలు సాగిస్తోంది. 'భారత రిటైల్ వ్యాపారం మరింత బాగా జరగనుంది. పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు ప్రారంభంలో ఎదురైన సవాళ్ల తరవాత, వచ్చే ఏడాది 10 శాతానికి పైగా వార్షిక వృద్ధి సాధించనుంది. ఈ సంస్కరణలు దీర్ఘకాలంలో మేలు చేయనున్నాయి



కూడా. ఇక.. ఏకబ్రాండ్ రిటైల్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం అనుమతించిన నేపథ్యంలో, భారత్‌లోకి ప్రవేశించేందుకు అంతర్జాతీయ రిటైల్ దిగ్గజాలకు అవకాశం లభించింది. వారు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది' అని డెలాయిట్ ఇండియా భాగస్వామి అనిల్ తల్రేజా పేర్కొన్నారు.

దేశీయ వినిమయంపై..: దేశీయంగా వినిమయ సామర్థ్యం అధికంగా ఉండటం రిటైల్ కంపెనీలను ఆకర్షిస్తోందని, సరికొత్త మార్గాల్లో ఆకట్టుకోవడంపై అవి దృష్టి పెట్టాయని నివేదిక తెలిపింది. ఈ రంగంలో డిజిటలీకరణ, సాంకేతికత కీలకపాత్ర పోషించనున్నాయని పేర్కొంది. వినూత్నత, సహకారం, సంస్థల ఏకీకరణ, యాంత్రికీకరణ, అన్నిరకాల సేవలతో ఆకట్టుకోవడం ముఖ్యం కానున్నాయి. యువతను ఆకట్టుకోవడంపైనే భారత్‌లో రిటైల్ వ్యాపారం ఆధారపడి ఉందని నివేదిక వివరించింది. నియంత్రణ పరంగా సహకారం అందుతున్నందున, దేశీయ కంపెనీలు కూడా అంతర్జాతీయ జాబితాల్లో చోటుచేసుకునే వీలుందని పేర్కొంది.

- 2016 ఆర్థిక సంవత్సరంలో 250 అంతర్జాతీయ రిటైల్ దిగ్గజాల ఆదాయం 4.4 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ. 286 లక్షల కోట్లు). ఏడాది క్రితంతో పోలిస్తే, వీటి మిశ్రమ వృద్ధి 4.1 శాతంగా ఉంది.
- జాబితాలోని తొలి 5 సంస్థలు తమ స్థానాన్ని కాపాడుకున్నాయి. సొంత సంస్థలతో వృద్ధి సాధించడం, స్వాధీనతలు, విదేశీ మారకపు విలువలో హెచ్చుతగ్గుల వంటివి తదుపరి 5 స్థానాల్లో మార్పులకు కారణమయ్యాయి.
- మొత్తం 250 సంస్థల ఆదాయంలో, ఈ 10 సంస్థల వాటాయే 30.7 శాతం. అంతకుముందు ఏడాదిలో వీటి వాటా 30.4 శాతం.
- 250 సంస్థల్లో 82 ఐరోపాకు చెందినవి. ఉత్తర అమెరికా సంస్థల సంఖ్యతో పోలిస్తే, అంతరం పెరుగుతోంది.

బీమా సంస్థలు సాంకేతికతపై దృష్టి పెట్టాలి

- **ఐఆర్‌డీఏ ఛైర్మన్ టీఎస్ విజయన్**

ఈనాడు, హైదరాబాద్: భారతీయ బీమా రంగం మరింత వృద్ధి చెందేందుకు అవకాశం ఉందనీ, డిజిటలైజేషన్ పెరుగుతున్న దృష్ట్యా కొన్ని నియంత్రణపరమైన ఇబ్బందులూ ఉండొచ్చని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏ) ఛైర్మన్ టీఎస్ విజయన్ అన్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ బీమా రంగానికి మేలు చేశాయని ఆయన పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన భారతీయ బీమా బ్రోకర్ల సంఘం(ఐబీఏఐ) 14వ వార్షిక సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు పాత పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దశలో ఉండటంతో దాని ప్రభావంతో బీమా రంగం కూడా వృద్ధి బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. దేశంలో ఇప్పటికీ బీమా రంగం విస్తృతి 4శాతం మేరకే ఉందని, ఇది ఈ రంగానికి ఉన్న అవకాశాలను సూచిస్తోందని పేర్కొన్నారు. వాహనాల సంఖ్య పెరుగుతోండటం, ఆరోగ్య బీమాపై అవగాహన పెరగడంతో ఈ విభాగంలో వృద్ధికి మరింత ఆస్కారం ఉందన్నారు. దేశంలో ఇప్పటికే 400లకు పైగా బ్రోకర్లు ఉన్నారనీ, నెలకు కొత్తగా 3-4 దరఖాస్తులు వస్తున్నాయన్నారు. గత ఏడాది సాధారణ బీమా ప్రీమియం రూ.



1.28లక్షల కోట్లు వసూలవ్వగా అందులో రూ.30వేల కోట్లు, జీవిత బీమా ప్రీమియంలో రూ.4లక్షల కోట్లలో రూ.1.60లక్షల కోట్ల వరకూ బ్రోకర్ల ద్వారానే వసూలయ్యిందన్నారు. బ్రోకర్లకు సంబంధించి త్వరలోనే కొన్ని కొత్త నిబంధనలు వచ్చే అవకాశం ఉందన్నారు. అన్ని అవసరాలకూ సరిపోయే విధంగా పాలసీలను తీసుకురావాల్సిన బాధ్యత బీమా సంస్థలపై ఉందన్నారు. బీమా పాలసీలతో ఆధార్‌ను అనుసంధానించడం పాలసీదారులకూ, బీమా కంపెనీలకూ మేలు చేస్తుందన్నారు. మార్చి 31లోగా అనుసంధానం పూర్తవుతుందా అన్న ప్రశ్నకు 'వేచి చూద్దాం' అని సమాధానమిచ్చారు. ఐబీఏఐ అధ్యక్షుడు సంజయ్ కేడియా మాట్లాడుతూ.. సాధారణ బీమా రంగం గత ఐదేళ్లుగా 17.19శాతం చొప్పున వృద్ధి సాధిస్తోందన్నారు. 2016-17ఆర్థిక సంవత్సరంలో అంతకు ముందు ఏడాదితో పోలిస్తే.. 32.9శాతం పెరిగిందని తెలిపారు.

రిటైల్ విక్రయాలు రూ.40 వేల కోట్లు

- **2018-19పై ఫ్యూచర్ గ్రూప్ అంచనా**
- **తెలంగాణలో జౌళి పార్కుకు యోచన!**

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) రిటైల్ వ్యాపార విక్రయాలు రూ.40,000 కోట్ల మేరకు ఉండగలవని అంచనా వేస్తున్నట్లు ఫ్యూచర్ గ్రూప్ సీఈఓ కిషోర్ బియానీ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ వ్యాపార విక్రయాలు రూ.30,000 కోట్లు ఉండగలవని ఫ్యూచర్ గ్రూప్ భావిస్తోంది. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే.. రిటైల్ వ్యాపార విక్రయాలు దాదాపు 33 శాతం వృద్ధి చెందనున్నాయి. మొత్తం రిటైల్ వ్యాపారంలో 10 శాతం వాటా హైదరాబాద్ నుంచి లభిస్తోందని చెప్పారు. కొత్త ఉత్పత్తులను విడుదల చేయడం, వివిధ రకాల విక్రయ కేంద్రాలను విస్తరించడం ద్వారా ఫ్యూచర్ గ్రూప్ విక్రయాలను పెంచుకోవాలని భావిస్తోంది. 2021 నాటికి గ్రూప్ విక్రయాలను రూ.లక్ష కోట్లకు పెంచుకోవడానికి వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రిటైల్ విక్రయాల్లో బిగ్ బజార్‌ల విక్రయాలు దాదాపు రూ.25,000 కోట్ల మేరకు ఉన్నాయి. ఫ్యూచర్ కన్జ్యూమర్ (ఎఫ్‌సీఎల్) గోల్డెన్ హార్వెస్ట్ బ్రాండ్‌తో సోనా మసూరీ బియ్యాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసిన సందర్భంగా బియానీ మాట్లాడారు. గోల్డెన్ హార్వెస్ట్ బ్రాండ్ విక్రయాలు దాదాపు రూ.2,000 కోట్ల మేరకు ఉన్నాయని.. భవిష్యత్తులో సోనా మసూరీ బియ్యం విక్రయాలు రూ.250 కోట్ల మేరకు ఉండగలవని అంచనా వేస్తున్నామని బియానీ వివరించారు. గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరీ బియ్యం ప్రకటనను రానా దగ్గుబాటితో రూపొందించారు. తెలంగాణాలో గార్మెంట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని ఫ్యూచర్ గ్రూప్ యోచిస్తోందని, ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని బియానీ అన్నారు. అయితే.. ఈ ప్రతిపాదన ప్రాథమిక దశలోనే ఉన్నట్లు చెప్పారు.



గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరీ బియ్యాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న దగ్గుబాటి రానా, ఫ్యూచర్ గ్రూప్ సీఈఓ కిషోర్ బియానీ

స్వల్ప లాభాలతో సరి

సమీక్ష

- **కొనసాగిన ఐటీ షేర్ల జోరు**
- **రికార్డు ముగింపులకు సూచీలు**

సూచీల జోరు వరుసగా ఆరో రోజూ కొనసాగింది. బ్యాంకింగ్, ఐటీ షేర్లు దన్నుగా నిలవడంతో సూచీలు తాజా జీవనకాల గరిష్ఠాలను అధిరోహించాయి. అయితే జనవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరించడంతో సూచీలు కొంత ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. విదేశీ మదుపర్లు స్థిరంగా పెట్టుబడులు కొనసాగించడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,161.62 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ 36,036.51 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. అనంతరం బలంగా పుంజుకున్న సెన్సెక్స్ ఒకానొకదశలో 36,238.19 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 21.66 పాయింట్ల లాభంతో 36,161.64 వద్ద ముగిసింది. సెన్సెక్స్ గత అత్యధిక ముగింపు 36,139.98 పాయింట్లను అధిగమించింది. ఇక నిఫ్టీ సైతం 11,110.10 పాయింట్ల దగ్గర జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2.30 పాయింట్లు పెరిగి 11,086 దగ్గర స్థిరపడింది.

టెలికాం షేర్లు కుదేల్: డేటా పరిమితిని పెంచుతున్నట్లు రిలయన్స్ జియో ప్రకటించడంతో టెలికాం రంగ షేర్లు కుదేలయ్యాయి. భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా 6.51 శాతం కోల్పోయి రూ.458.95 వద్ద ముగిసింది. ఇక ఐడియా సెల్యులార్ 5.38 శాతం నష్టంతో రూ.94.05; రిలయన్స్ కమ్యూనికేషన్స్ 1.37 శాతం తగ్గి రూ.28.80 దగ్గర స్థిరపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. ఎస్‌బీఐ 3.62%, అదానీ పోర్ట్స్ 2.46%, టీసీఎస్ 2.30%, ఐటీసీ 1.88%, యెస్ బ్యాంక్ 1.66%, ఓఎన్‌జీసీ 1.62%, డాక్టర్ రెడ్డీస్ 1.56% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. భారతీ ఎయిర్‌టెల్ (6.51%), టాటా మోటార్స్ (3.46%), ఐసీఐసీఐ బ్యాంక్ (2.60%), టాటా స్టీల్ (2.13%), యాక్సిస్ బ్యాంక్ (1.78%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (1.75%)లు నష్టాలు చవిచూశాయి.

టీసీఎస్ @రూ.6 లక్షల కోట్లు

ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.6 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో కంపెనీ ఇదే కావడం విశేషం. మార్కెట్ విలువ పరంగా దేశంలో అత్యంత విలువైన సంస్థగా రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.6,10,938.21 కోట్లు) నిలిచింది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్ (రూ.6,07,709.74 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.5,08,822.40 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు ఒడుదొడుకుల మధ్య కదలాడొచ్చు. జనవరి డెరివేటివ్ కాంట్రాక్టులకు ఈ రోజు గడువు తీరిపోనుండటమే ఇందుకు కారణం. బడ్జెట్ రోజు (ఫిబ్రవరి 1) దగ్గరపడటం, రేపటి నుంచి మూడు రోజుల (గణతంత్ర దినోత్సవం, శని, ఆది) పాటు మార్కెట్‌కు సెలవు కావడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఇప్పటివరకు వెలువడిన కంపెనీల ఫలితాల్లో చాలా వరకు అంచనాలకు అందుకున్నందున, ముమ్ముందు కూడా మార్కెట్ జోరు కొనసాగాలంటే బడ్జెట్‌లో నిర్ణయాలే కీలకమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ రోజు 10900- 11150 శ్రేణిలో చలించొచ్చు. మారుతీ సుజుకీ సహా ఈ రోజు వెలువడే ఆయా కంపెనీల ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. ఈ ఫలితాల ఆదారంగా ఆయా రంగాలు, కంపెనీల షేర్లలో కదలికలు కనిపిస్తాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు వేటివేటికి ఎంతెంత మూలధనం ఇవ్వనున్నామో ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ రంగ షేర్లు వెలుగులోకి రావచ్చు.

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 448.75 (438.40) 5201505
AMBUJA CEMEN 260.15 (262.70) 2345935
ASIAN PAINTS 1151.05 (1169.90) 1122469
AUROBIND PHA 658.45 (653.75) 2214640
AXIS BANK LT 607.95 (620.10) 6158610
BAJAJ AUTO L 3341.55 (3295.95) 402759
BAJAJ FINANC 1739.15 (1708.70) 1441313
BHARTI AIRTE 459.50 (492.10) 26450900
BHARTI INFRA 342.30 (339.40) 4933761
BOSCH LTD 19730.30 (19776.00) 8531
BPCL 480.50 (481.15) 2540792
CIPLA 618.30 (622.35) 1089562
COAL INDIA L 294.55 (293.10) 3073618
DR. REDDYS 2559.40 (2520.40) 1126277
EICHER MOTOR 26404.05 (27071.25) 94058
GAIL 484.95 (470.80) 7562178
HCL TECH 1018.45 (995.35) 4634888
HDFC 1911.20 (1884.65) 3401495
HDFC BANK 1957.65 (1951.30) 1197642
HERO MOTOCOR 3645.50 (3630.00) 312383
HINDALCO IND 258.70 (264.95) 6409442
HINDUSTAN UN 1365.90 (1368.35) 1819330
HPCL 389.15 (395.90) 8709732
ICICI BANK 352.75 (362.30) 12815095
INDIABULLS H 1362.00 (1379.10) 3097670
INDIAN OIL 390.30 (389.40) 3229267
INDUSINDBANK 1717.30 (1723.35) 968956
INFOSYS LTD 1185.80 (1177.10) 10302359
ITC 281.45 (276.60) 17305234
KOTAK MAHIND 1080.10 (1075.45) 1168000
LARSEN & TOU 1401.20 (1410.70) 2147973
LUPIN 959.05 (937.35) 1976531
M&M 755.40 (769.05) 2080315
MARUTI SUZIK 9434.95 (9393.40) 568489
NTPC LTD 174.00 (172.70) 9731185
ONGC 210.85 (207.35) 16132441
POWER GRID C 195.95 (195.85) 6222026
RELIANCE IND 966.35 (983.25) 6532672
SBI 329.90 (318.10) 38070520
SUN PHARMA 586.55 (579.35) 7168397
TATA CONSULT 3174.60 (3102.00) 2810769
TATA MOTORS 403.60 (418.00) 10789570
TATA STEEL L 762.10 (779.75) 4935129
TECH MAHINDR 603.15 (588.25) 6672393
ULTRATECH 4283.00 (4374.70) 244058
UPL LIMITED 824.25 (807.25) 2577167
VEDANTA LIMI 340.00 (343.50) 11024875
WIPRO 313.95 (315.25) 6578273
YES BANK LTD 364.80 (359.55) 11258771
ZEE ENTERTAI 603.20 (597.15) 3537117

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1667.65 (1639.70) 128734
ACC 1737.50 (1790.15) 516780
ASHOK LEYLAN 123.30 (124.00) 12152677
AVENUE SUPER 1142.15 (1169.20) 396369
BAJAJ FINSER 5014.45 (5014.60) 88003
BANK OFBAROD 178.35 (173.15) 21139975
BEL 173.55 (174.70) 3483048
BHEL 104.15 (104.45) 11030400
BRITANNIA 4719.25 (4736.45) 80067
CADILA HEALT 424.75 (430.95) 1212613
COLGATE PALM 1154.30 (1157.15) 313907
CONTAINER 1466.40 (1466.20) 226161
CUMMINS INDI 911.35 (910.20) 282385
DABUR INDIA 359.20 (364.00) 1374753
DLF LIMITED 258.95 (259.65) 9439889
EMAMI LIMITE 1225.60 (1243.70) 155010
GLAXOSMI CON 6602.05 (6672.30) 16130
GLAXOSMI PHA 2450.15 (2458.90) 16173
GLENMARK PHA 640.10 (632.50) 1140364
GODREJ CONSU 1117.60 (1085.40) 1100322
HAVELLS INDI 576.25 (584.15) 1348575
HINDUSTAN ZI 293.05 (296.65) 1915105
ICICI PRU LI 434.60 (431.10) 4535641
IDEA CELLULR 93.90 (99.35) 36677728
INTERGLOBE A 1237.70 (1192.10) 1199288
JSW STEEL LT 288.65 (294.05) 4037279
LIC HOUS.FIN 570.05 (573.50) 874920
MARICO LIMIT 312.65 (313.85) 532453
MCDOWELL 3487.85 (3750.60) 2641957
MOTHERSON 384.45 (386.10) 1333795
MRF 68894.50 (69930.70) 6431
NHPC LTD 30.05 (30.45) 8747358
NMDC LTD 145.10 (149.45) 5462771
OIL INDIA 379.05 (375.15) 687599
ORACLE FIN S 4287.40 (4245.95) 82482
P&G HYG&HEAL 9363.90 (9285.70) 1306
PETRONET LNG 247.25 (245.85) 3443422
PIDILITE IND 876.05 (886.35) 362815
PIRAMAL ENTE 2811.25 (2844.65) 661730
PNB 194.65 (185.80) 50753260
POWER FIN CO 121.50 (121.00) 5027861
RURAL ELEC C 160.25 (157.75) 4421502
SAIL 94.15 (96.85) 7800926
SHREE CEMENT 18234.60 (18391.95) 17473
SHRIRAM TRAN 1437.90 (1468.80) 478088
SIEMENS 1304.05 (1319.80) 252585
SUN TV LTD 1033.60 (1040.40) 491618
TATA POWER 91.80 (92.50) 4353614
TITAN IND 886.90 (905.70) 1109233
TORRENT PHAR 1452.70 (1443.00) 182622

ఘనం (+)

నిఫ్టీ	24న	మార్పు %
SBI	329.90	3.71
GAIL (INDIA)	484.95	3.01
TECH MAHINDRA	603.15	2.53
ADANI PORT	448.75	2.36
TCS	3174.60	2.34
HCL TECH	1018.45	2.32
LUPIN	959.05	2.32

గ్రహణం (-)

నిఫ్టీ	24న	మార్పు %
BHARTI AIRTEL	459.50	-6.62
TATA MOTORS	403.60	-3.44
ICICI BANK	352.75	-2.64
EICHER MOTORS	26404.05	-2.46
HINDALCO	258.70	-2.36
TATA STEEL	762.10	-2.26
ULTRATECH CEM	4283.00	-2.10

మార్కెట్ కబుర్లు

- ఒడిశాలో 16వ నెంబరు జాతీయ రహదారి మెరుగుదలకు రూ.1,522 కోట్ల ఆర్డరు లభించినట్లు **దిలీప్ బిల్డ్‌కాన్** ప్రకటించింది.
- వినియోగ వాహనాల విక్రయ వేదిక అయిన శ్రీరామ్ ఆటోమాల్‌ను రూ.156 కోట్లకు ఎంఎక్స్‌సీ సొల్యూషన్స్ ఇండియాకు విక్రయించనున్నట్లు **శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్** కంపెనీ తెలిపింది.
- బొకారోలో 30 బావుల తవ్వకానికి ఓఎన్‌జీసీ నుంచి రూ.32 కోట్ల విలువైన కాంట్రాక్టు లభించినట్లు **ఎస్సార్ ఆయిల్‌ఫీల్డ్స్** తెలిపింది.
- లగ్జెంబర్గ్ కేంద్రంగా పనిచేసే మిలికామ్ ఇంటర్నేషనల్ సెల్యులార్‌కు చెందిన టిగో రువాండాను కొనుగోలు చేసేందుకు నియంత్రణ సంస్థ ఆమోదం లభించినట్లు **భారతీ ఎయిర్‌టెల్** ప్రకటించింది.
- 1,200 ట్రక్కుల కోసం వీఆర్ఎల్ లాజిస్టిక్స్ నుంచి రూ.350 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు **అశోక్ లేలాండ్** తెలిపింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2017–18	2016–17	2017–18	2016–17
ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్(కన్సా)	282.8	248	1,883.7	1,666.7
మోతీలాల్ ఓస్వాల్	148	89	736	456
రాడికో ఖైతాన్	35.01	19.70	1,747.98	1,243.53
టీటీకే ప్రెస్టీజ్	47.15	34.65	502.55	469.28

పంచాయతీరాజ్ కొత్త చట్టంపై సీఎం సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీరాజ్ నూతన చట్టం రూపకల్పన చర్యలు వేగవంతమయ్యాయి. దీనికి సంబంధించి మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం సమీక్షించారు. పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ తదితర అధికారులతో భేటీ అయిన ముఖ్యమంత్రి..వాటిని ఒక్కొక్కటిగా పరిశీలించారు. అధికారులతో భేటీల తర్వాత ఉప సంఘంతోనూ సీఎం సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. రెండు విడతలుగా ఒకే రిజర్వేషన్లు కొనసాగడం వంటి ముఖ్యమైన మార్పులెన్నో కొత్తచట్టంలో ఉండబోతున్నందున వీటిపై ఉన్నతస్థాయిలో విస్తృతంగా చర్చిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

ప్రతిపాదనల సమర్పణ గడువు పెంపు?: మరోవైపు కొత్త పంచాయతీలపై ప్రతిపాదనల సమర్పణ గడువును పెంచే అవకాశాలు కన్పిస్తున్నాయి. నిజానికి ఆ ప్రతిపాదనలను ఈ నెల 25వ తేదీకల్లా రాజధానికి పంపాలని ముఖ్యమంత్రి ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో ఆ ప్రక్రియ ఇంకా కొలిక్కిరాలేదు. ప్రతిపాదనలు తయారైన జిల్లాలోనూ పంచాయతీరాజ్ శాఖ నూతనంగా వెలువరించిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకొని కొన్ని మార్పులు చేర్పులు చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో గడువును మరో నాలుగు రోజులు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

రాబడి నామమాత్రమే

- కొత్త పంచాయతీలకు సర్కారు చేయూత తప్పనిసరి
- ప్రతిపాదిత పంచాయతీల లెక్కలు సిద్ధం
- కలెక్టర్ల నుంచి నేడు సర్కారుకు ప్రతిపాదనలు

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న చిన్న పంచాయతీలకు సొంత రాబడులు అంతంత మాత్రంగానే ఉండనున్నాయి. దీంతో ఆవిర్భావం నుంచే వీటికి ప్రభుత్వ చేయూత తప్పనిసరని స్పష్టమవుతోంది. మరోవైపు ప్రతిపాదిత కొత్త పంచాయతీలకు సంబంధించిన అన్ని వివరాలతోనూ రూపొందిన నివేదికలు గురువారం రాజధానికి చేరనున్నాయి. కొత్త పంచాయతీల ఏర్పాటుపై పంచాయతీరాజ్ చట్టం నిబంధనలకు అనుగుణంగా జిల్లాల్లో ప్రతిపాదనలు రూపొందించి బుధవారం కలెక్టర్లకు పంపారు.



వరంగల్ అర్బన్ జిల్లా మల్లారం పంచాయతీ నుంచి వేరుచేసి కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన రసూల్‌పల్లి గ్రామం

ప్రస్తుతం ఉన్న గ్రామాల నుంచి కొన్ని శివారు గ్రామాలను వేరు చేసి కొత్త పంచాయతీలుగా రూపొందిస్తున్నందున వాటిలో ఆస్తి పన్ను, తదితర రాబడులు ఎంత ఉంటాయో అంచనా వేశారు. చాలా వాటి రాబడులు నామమాత్రంగానే ఉన్నట్లు సమాచారం. చట్టం చెబుతున్నట్లు వాటికి కార్యదర్శిని నియమించే స్థాయిలో ఆదాయం లేనందున రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక చేయూత తప్పనిసరి. రాష్ట్ర బడ్జెట్‌లోనే నిధులను పొందుపర్చి పంచాయతీలకు ఇస్తామని సర్కారు ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాబడుల అంశం కంటే జనాభా, ఓటర్లు, కుటుంబాల సంఖ్య, సరిహద్దులు తదితర వివరాలతో నివేదికలు తయారయ్యాయి. అన్ని మండలాల సమాచారాన్ని కలెక్టర్లు క్రోడీకరించి గురువారం ప్రభుత్వానికి పంపుతారు. వీటిని పరిశీలించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు ఇస్తుంది. కొత్త పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించనుంది. ఆయా పంచాయతీల్లో ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను వీరే చేపడతారు.

ఇవీ ప్రతిపాదనలు

- కొత్త పంచాయతీలు 4వేలకు పైనే. కొన్ని పంచాయతీలు సమీప పట్టణాలు, నగరాల్లో విలీనమవుతాయి.
- జనాభా 300- 500 మధ్య ఉంటే 7 వార్డులు, 500-1,500 లోపు ఉంటే 9 వార్డులు ఏర్పాటవుతాయి.
- కొత్త పంచాయతీలోని ఆస్తులు, అక్కడ వసూలు కావాల్సి ఉన్న పన్నులు దానికే చెందుతాయి.
- విద్యుత్, తాగునీరు వంటి బకాయిలను కొత్త పంచాయతీయే కట్టాల్సి ఉంటుంది.



శారీరక దృఢత్వం ఉంటేనే ఐపీఎస్ అధికారులకు పదోన్నతి!

- కేంద్రం ప్రతిపాదన
- కొన్ని షరతులతో తెలంగాణ సానుకూలం?

ఈనాడు, దిల్లీ: పోలీసు అధికారులు శారీరకంగా దృఢంగా ఉండేలా ప్రోత్సహించాలనుకుంటున్న కేంద్రం ఐపీఎస్ అధికారుల పదోన్నతులకు, ఈ అంశానికి లంకె ఉండాలని భావిస్తోంది. రాష్ట్రాల అభిప్రాయాల కోసం ఈ ప్రతిపాదన పంపించగా మూడు రాష్ట్రాలు మాత్రమే స్పందించాయి. ఈ మూడింటిలో మహారాష్ట్ర, కేరళ బహిరంగంగానే ఈ ప్రతిపాదనను వ్యతిరేకించగా తెలంగాణ మాత్రం అటు వ్యతిరేకించలేదు, ఇటు స్పష్టంగా సానుకూలత వ్యక్తం చేయలేదు. కొన్ని షరతులతో కేంద్రం ప్రతిపాదనకు తెలంగాణ సానుకూలంగా ఉన్నట్లు కనబడుతోందని ఒక అధికారి చెప్పారు. పనిగంటలు ఎక్కువ కావడంతో తీరికలేని పోలీసు అధికారులు శారీరక వ్యాయామంపై దృష్టి సారించలేకపోతున్నారని మహారాష్ట్ర, కేరళ తమ స్పందనలలో తెలియజేశాయి. పదోన్నతులు పొందాలంటే ఐపీఎస్ అధికారులు శారీరకంగా దృఢంగా ఉండడాన్ని తప్పనిసరి చేస్తూ గత ఏడాది జులైలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ.. అన్ని రాష్ట్రప్రభుత్వాల అభిప్రాయాలను కోరింది. కానీ 26 రాష్ట్రాల వారు ఇంకా తమ అభిప్రాయాన్ని వెల్లడించలేదు. ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాలి లేదా ఎటూ తేల్చకూడదని తమ రాజకీయ బాసులను ఐపీఎస్ అధికారులు ప్రభావితం చేస్తున్నారని కేంద్ర హోం మంత్రిత్వశాఖ అనుమానిస్తోంది.

జైళ్లశాఖలో అవినీతిని నిరూపిస్తే పదివేల రివార్డు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: తెలంగాణ జైళ్లశాఖలో అవినీతి నిరూపిస్తే గతంలో ప్రకటించిన రూ.5వేల రివార్డును ప్రస్తుతం రూ.10వేలకు పెంచుతున్నట్లు డీజీ వీకే సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2015లో జైళ్లశాఖలో 90ఫిర్యాదులు రాగా 2017లో కేవలం 12 వచ్చినట్లు పేర్కొన్నారు. అందులో ఆరు అవినీతికి చెందినవి కాగా, నాలుగు ఫిర్యాదులు తప్పని తేలిందని.. రెండు ఫిర్యాదుల విషయంలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉద్యానవన శాఖలో కారుణ్య నియామకాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఉద్యానవన శాఖలో కారుణ్య నియామకాల కింద ఏడుగురిని తోటమాలీలుగా నియమిస్తూ జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్ సిన్హా బుధవారం సచివాలయంలో ఉత్తర్వులను అందచేశారు. అస్లాం, వెంకటేశ్, కరణ్, సయ్యద్‌అలీ, లక్ష్మణ్, మిరాజుద్దీన్, అలీముద్దీన్‌లు ఈ ఉద్యోగాలు పొందారు.

ఆచార్యుల భర్తీ.. జూన్‌కు పూర్తి

ఈనాడు, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల ఖాళీల భర్తీ పూర్తికానుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు గవర్నర్ నరసింహన్‌కు ఇటీవల హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల్లో మొదటి విడత కింద 1061 సహాయ, సహ ఆచార్యుల ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తూ గత నవంబరు 25న జీఓ 34 జారీ చేసింది. ఓయూలో 415, జేఎన్‌టీయూహెచ్‌లో 186, కేయూలో 136 ఖాళీలను భర్తీ చేయనున్నారు. వీటి భర్తీకి ప్రకటనలు రావాలంటే మొదటి ఆయా విశ్వవిద్యాలయాల పాలకమండలి సమావేశాల్లో ఆమోదం పొందాలి. ఆ తర్వాత సాంఘిక, బీసీ సంక్షేమ శాఖలు రోస్టర్ పాయింట్లు ఖరారు చేయాలి. అనంతరం ప్రకటనలు జారీ చేయాలి. ప్రస్తుతం చాలా విశవిద్యాలయాలకు పూర్తిస్థాయి పాలకమండళ్లు లేవు. పర్యవేక్షణ, అభివృద్ధి కమిటీలు(ఎండీసీ) మాత్రమే ఉన్నాయి. వాటి ద్వారా ఖాళీల భర్తీకి ఆమోదం పొందవచ్చని ఉన్నత విద్యామండలి అధికారులు చెబుతున్నారు. ప్రకటనలు జారీ మార్చి ప్రారంభంలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉన్నత విద్యామండలి పర్యవేక్షణలో నియమించిన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం భర్తీకి మార్గదర్శకాలు పాటించాలి. దరఖాస్తులు ఆహ్వానించడం...వాటిని స్క్రీనింగ్ చేసి అర్హులను ముఖాముఖికి పిలుస్తారు. జూన్ నాటికి భర్తీ ప్రక్రియ పూర్తవుతుంది. జేఎన్‌టీయూహెచ్ పరిధిలో నాలుగు కళాశాలలుండగా...కళాశాలల వారీగా ప్రకటనలు జారీ అవుతాయి. అంటే ఏ కళాశాలకు దరఖాస్తు చేసుకుంటే ఆ కళాశాలలోనే పనిచేయాల్సి ఉంటుంది.

బోధనానుభవానికి 10 మార్కులు: భర్తీకి అనుసరించాల్సిన మార్గదర్శకాలపై రెండు రోజుల క్రితం విద్యాశాఖ జీఓ 2 జారీ చేసింది. ఒక్కో పోస్టుకు 15 మందిని ముఖాముఖికి పిలుస్తారు. మొత్తం 100 మార్కులకుగాను డిగ్రీ నుంచి మొదలు విద్యార్హతలకు 50 శాతం మార్కులు కేటాయించారు. అందులో పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు కూడా ఉంటాయి. మిగిలిన 50 శాతంలో 20 మార్కులు ముఖాముఖికి ఉంటాయి. బోధనా అనుభవానికి 10 మార్కులిస్తారు. పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతరత్ర వాటికి మరో 20 మార్కులు కేటాయించారు.

ఆ రెండు వర్సిటీల వీసీల భర్తీకి కసరత్తు: కరీంనగర్‌లోని శాతవాహన, బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయానికి(ఆర్‌జీయూకేటీ) ప్రస్తుతం శాశ్వత ఉపకులపతులు లేరు. వారి నియామకానికి ప్రభుత్వ స్థాయిలో కసరత్తు సాగుతోందని ఉన్నత విద్యామండలి వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా పూర్తిస్థాయి పాలకమండళ్ల నియామకంపైనా దృష్టి సారించినట్లు చెబుతున్నారు.

ఈసారి తెలంగాణలో ముందుగా గవర్నర్ జెండావందనం

ఏపీ వినతి మేరకు ఈ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 26వ తేదీ ముందుగా తెలంగాణలో జెండా వందనం చేయనున్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు వెళతారు. గత మూడేళ్లుగా ఆయన ముందుగా ఏపీలో జెండా వందనం చేసి, ఆ తర్వాత తెలంగాణకు వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వినతి మేరకు ఈసారి ఆయన తెలంగాణలోనే ముందుగా జెండా ఎగురవేయాలని నిర్ణయించారు. దావోస్ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు 26న ఉదయం అమరావతికి వస్తారు. ఆయన ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలుగా గవర్నర్ ముందుగా తెలంగాణ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత అమరావతి వెళ్తారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర వేడుకల్లో ఉదయం 9.15కి ఆయన జెండా వందనం చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 10.20కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి బయల్దేరతారు. 11.30 నుంచి అమరావతిలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు బయల్దేరి హైదరాబాద్ చేరుకుంటారు.

కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ: ఈసారి తెలంగాణలో ఉదయం 9.15 గంటలకే ఉత్సవాలు జరుగుతున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రజలు హాజరయ్యేలా వసతులు కల్పించాలన్నారు. ఈ ఉత్సవాలకు సీఎం హాజరవుతున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని సూచించారు.

26 నుంచి హైదరాబాద్ సాహితీ సంబరాలు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహణ • సామాజిక అంశాలపై సదస్సులు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సాహితీవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో హైదరాబాద్ సాహితీ సంబరాలు ఈనెల 26 నుంచి మొదలుకానున్నాయి. మూడురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో నిర్వహించే వేడుకలకు జియోత్-జంత్రమ్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ పర్యటక పెవిలియన్, కార్వీ పందిరి, షాహీన్ ఆడిటోరియం నుంచి సమీక్షలు, సదస్సులు, ఉపన్యాసాలతోపాటు సామాజిక ఆలోచన కలిగించే చలన చిత్రాల ప్రదర్శనకు థియేటర్ ఏర్పాటవుతోంది. ఈ సాహితీ సంబరాల్లో 90కి పైగా కార్యక్రమాలు, సదస్సు, సమీక్షలు ఉంటాయి. 70 మందికి పైగా కళాకారులు హాజరవుతారు. కళాశాల విద్యార్థులతో 20 వరకు ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈనెల 26న మధ్యాహ్నం 12.40 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత చంద్రశేఖర కంబర, స్పెయిన్ ఎంబసీ మిషన్ ఉప విభాగాధిపతి ఎడ్యూరాడో సాన్‌చెజ్ మొరేనే, సాంస్కృతిక ప్రతినిధి ఇగాన్సియో విటోరికా హామిల్టన్, పర్యటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొంటారు.

మూడు రోజుల్లో కొన్ని ముఖ్యాంశాలివి..: మూడురోజుల సమావేశాల్లో భాగంగా తొలిరోజు 'గ్రామీణ భారత పరిస్థితులపై' జరిగే చర్చల్లో హిమాన్సు, సి.రామ్‌మనోహర్ రెడ్డి పాల్గొంటారు. 'భారత్ గణతంత్రంగా ఎలా మారింది?' అనే విషయమై కేంబ్రిడ్జి యూనివర్సిటీ పరిశోధకురాలు ఓర్నిట్ షానీ, అపర్ణా రాయప్రోల్ మాట్లాడతారు. రెండోరోజున 'భారతదేశంలో లౌకిక ముస్లింగా ఉండటమెలా?' అనే అంశంపై జర్నలిస్టు సీమా ముస్తఫా, అష్‌హర్ ఫర్హాన్ మాట్లాడుతారు. ఎన్నో సామాజిక చలన చిత్రాలను నిర్మించిన దర్శకుడు గిరీష్ కాసరవల్లితో కలిసి 'సినిమాలు-సాహిత్యం' అంశంపై ప్రొఫెసర్ నిఖిలా హెచ్ చర్చిస్తారు. 'దేశంలో పత్తి ప్రస్థానం'పై మీనా మీనన్, ఉజ్రామ్మా, అన్నపూర్ణ మాట్లాడతారు. మూడోరోజైన 28న ఉదయం 'తాజా కబుర్ల యుగంలో మీడియా' అనే అంశంపై రాజ్‌దీప్ సర్‌దేశాయ్, అజయ్‌గాంధీ చర్చిస్తారు. 'గౌరీలంకేష్- జీవితంలో ధైర్యం, కరుణ'పై చందన్ గౌడ, గీతా రామస్వామి, కన్నన్ సుందరమ్, 'నూతన ఆవిష్కరణ - జీవనగాథ' అంశంపై టాటా సన్స్ ఈడీ ఆర్.గోపాలకృష్ణన్, 'భారతీయ క్రికెట్ కథ'పై హరిమోహన్ పరువు, రాజ్‌దీప్ సర్‌దేశాయ్ మాట్లాడతారు.

రూ.3వేల కోట్లతో ఐఐటీ అభివృద్ధి

కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ

ఈనాడు, దిల్లీ: సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీని రూ.3వేల కోట్లతో కేంద్రం అభివృద్ధి చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. రూ.1500 కోట్లు కేంద్రం ఇచ్చిందని.. మరో రూ.1500 కోట్ల జపాన్ నిధులతో అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి కానుందని పేర్కొన్నారు. బుధవారమిక్కడ కేంద్ర జలవనరుల శాఖ సలహాదారు వెదిరె శ్రీరాంతో కలిసి దత్తాత్రేయ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్‌తో భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడుతూ..తెలంగాణలోని విద్యా సంస్థలను కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి చేస్తామని జావడేకర్ హామీ ఇచ్చారన్నారు. "గిరిజన విశ్వవిద్యాలయానికి తెలంగాణ ప్రభుత్వం భూమి ఇచ్చినట్లయితే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అపరిష్కృతంగా ఉన్న రూ.14 కోట్లు త్వరలోనే విడుదల చేస్తామన్నారు. సర్వశిక్ష అభియాన్ నిధులు, రూసా నిధులు రూ.149 కోట్లు త్వరలోనే విడుదల చేస్తామన్నారు. ఆసిఫాబాద్, జూబ్లీహిల్స్, అచ్చంపేటల్లో ఏర్పాటు చేయాలని కోరా" అని దత్తాత్రేయ పేర్కొన్నారు.

ఐఐటీల్లో అమ్మాయిలకు 14% సీట్లు

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీల్లోని బీటెక్ సీట్లలో బాలికలకు మొత్తం 14 శాతం సీట్లను కేటాయిస్తామని జేఈఈ అడ్వాన్స్‌డ్- 2018 నిర్వాహక సంస్థ ఐఐటీ కాన్పూర్ తెలిపింది. ఈ మేరకు ఐఐటీ కౌన్సిల్ స్థాయిలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఐఐటీలో 8 శాతం మందే అమ్మాయిలు ఉన్నారు. వారి సంఖ్యను వచ్చే విద్యా సంవత్సరం (2018- 19) నుంచి 14 శాతానికి పెంచనున్నారు. ఇందుకోసం అన్ని ఐఐటీల్లో సూపర్ న్యూమరరీ సీట్లను సృష్టిస్తారు. ప్రస్తుతం 23 ఐఐటీల్లో 10,988 సీట్లున్నాయి. అందులో సుమారు 8 శాతం సీట్లు అంటే 880 మంది బాలికలున్నారు. మరో 6 శాతం పెంచితే వారికి 660 సీట్లు పెరుగుతాయి. ఈ సీట్లను జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారికే కేటాయిస్తారు. రిజర్వేషన్ ప్రకారం సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయిస్తారు. బాలురకు ఉన్న సీట్లు తగ్గించరని ఐఐటీ కాన్పూర్ పేర్కొంది. ఈ సీట్ల భర్తీకి సంబంధించిన వివరాలను జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా)2018 నిబంధనావళిలో పొందుపరుస్తారు.

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల అభ్యర్థులకు దేహదారుఢ్య అర్హత పరీక్షలు నిర్వహించిన తరువాతే ధ్రువీకరణపత్రాల పరిశీలన నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. అర్హత పరీక్షలు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అభ్యర్థులు కమిషన్‌వెబ్‌సైట్ సందర్శించాలని సూచించింది.

నేడు బహుజన వామపక్ష ఫ్రంట్ ఆవిర్భావ సభ

తెలంగాణ రాష్ట్రంలో 'సామాజిక న్యాయం- రాష్ట్ర సమగ్రాభివృద్ధి' లక్ష్యంగా ఏర్పడిన నూతన రాజకీయ వేదిక 'బహుజన వామపక్ష ఫ్రంట్' ఆవిర్భావ సభ ఈ నెల 25న గురువారం జరగనుంది. హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఎంఈఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభంకానున్న సభలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సామాజిక ఉద్యమ జాతీయ నేత ప్రకాశ్ అంబేడ్కర్ పాల్గొననున్నారు.

నేను ప్రజల పక్షపాతిని

- భద్రాద్రి, ఖమ్మం జిల్లాలో పర్యటనలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ఈనాడు - ఖమ్మం

'నేను ప్రజల పక్షపాతిని. ఏ పార్టీ పక్షపాతిని కాదు.. ప్రజా సమస్యలు పరిష్కరించడమే నా ధ్యేయమ'ని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అనంతరం కొత్తగూడెం నుంచి రోడ్ షో ప్రారంభించి ఖమ్మం నగరానికి చేరుకున్నారు. ఖమ్మంలో పూర్వఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమస్యల పేరిట ఇటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను, అటు కేంద్రాన్ని ఎడాపెడా విమర్శించడం కాదని తన పద్ధతి కాదన్నారు. తన ఆవేశం ప్రజాసమస్యలపైనే కానీ వ్యక్తుల మీద కాదన్నారు. తన జీవితాన్ని ప్రజలకు ధారపోస్తానన్నారు. జనసేన బలమైన పార్టీగా తెలంగాణలో ఆవిర్భవించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

వీహెచ్‌ను ప్రకటిస్తే..: కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తమతో కలిసి రావాలని పవన్ కల్యాణ్ సూచించారు. వీహెచ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి అభ్యర్థిత్వం ప్రకటిస్తే కాంగ్రెస్‌తోపాటు నడుస్తామన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులంటే తనకు గౌరవమేనని, కానీ పనిచేసే విధానం జాగ్రత్తగా, పద్ధతిగా లేదన్న భావనే తప్ప మరోటి కాదన్నారు. అన్ని పార్టీలు కలిసి తెలంగాణ సాధించుకున్నట్టు అభివృద్ధి కూడా అదే తరహాలో చేసుకోవాలన్నారు.

యువత, ఆడపడుచుల కోసమే: రాజకీయ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారితే దానికి బలయ్యేది యువతే అని, అలా యువత బలికాకుండా ఉండటానికి జనసేన స్థాపించానన్నారు. జనసేన అంటే ఓటు బ్యాంకు పాలిటిక్స్ కాదని, మానవత్వం కలిగిన రాజకీయాలు చేయడానికేనన్నారు. 'ప్రజా సమస్యల పరిష్కారానికి నాపై ఎలాంటి దాడులకైనా సిద్ధం. ఎన్ని దాడులైనా భరిస్తాను. ఎదురుదాడులు మాత్రం చేయన'ని పవన్ అన్నారు. తనకు సమాజంపై చాలా బాధ్యత ఉందని, సినిమాలు బాగున్నపుడు కూడా శతదినోత్సవాలు నిర్వహించుకోలేదని గుర్తుచేశారు. రాజకీయ వ్యవస్థలో చిన్నపాటి మార్పుకు ప్రయత్నిస్తున్నానని, ఈ క్రమంలో ఇబ్బందిపడే వారిని క్షమించమని కోరుకుంటున్నానన్నారు. లెనిన్ చెప్పినట్లు.. విప్లవం ఒక రోజులో రాదన్నారు.



రెండు కాళ్లను కోల్పోయిన అభిమాని సతీశ్‌తో పవన్

కులాలను అర్థం చేసుకోవాలి: భారతదేశ రాజకీయాలను మార్చు రావాలంటే కులాలను అర్థం చేసుకోవాలని పవన్ అన్నారు. వాస్తవానికి తన జీవితంలో కులం, మతం, ప్రాంతం లేదని, మానవత్వాన్ని, శాంతిని గౌరవిస్తానన్నారు. అయితే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినపుడు కులాలను కచ్చితంగా అర్థం చేసుకోవాలన్నారు. అలా అర్థం చేసుకోకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, దేశ రాజకీయాలను ముందుకు తీసుకువెళ్లలేమన్నారు. బాధ్యతాయుత రాజకీయాలు కావాలంటే ఉడుకు రక్తం ఉన్న యువతరం, మేమున్నామని చెప్పే ఆడపడుచులు కావాలన్నారు. తుదిశ్వాస వరకు సామాజిక మార్పు కోసం అండగా ఉంటానన్నారు.

కాళ్లు కోల్పోయిన అభిమానికి సాయం

'అత్తారింటికి దారేది' సినిమా విడుదలసందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ప్రమాదవశాత్తు గోడకూలి రెండు కాళ్లను కోల్పోయిన తన అభిమాని సతీశ్‌కుకొత్తగూడెంలో పవన్‌కల్యాణ్ రూ. 54 వేల నగదును అందించారు.

రాజకీయ పరిస్థితులు బాధించాయి: 'తమ్ముడు' సినిమా వంద రోజుల వేడుక చేస్తే వెచ్చించే నగదుతో నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ బాధితులకు ఏదైనా చేద్దామని భావించానని పవన్ గుర్తుచేశారు. అయితే ఆ సమయంలో అక్కడి రాజకీయ పరిస్థితులు తనను ఎంతో బాధించాయన్నారు. ఒక మంచి పనిచేస్తానంటే అడ్డుపడటంపై మండిపడ్డారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతానన్నారు.

కారుపైకి చెప్పు: ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పలువురు వేదికపైకి ఎక్కే ప్రయత్నం చేయడంతో బారికేడ్ మొత్తం విరిగిపోయింది. ఖమ్మం జిల్లా తల్లాడ సమీపంలో జనంలోంచి ఓ చెప్పు వచ్చి ఆయన కారు ముందరి భాగంలో పడింది. ఖమ్మంలో ప్రసంగం పూర్తి ముగించి వెళ్లే క్రమంలో ఓ కారు టైరు ఖమ్మం గ్రామీణ ఎస్సై చిరంజీవి ఎడమ కాలి వేళ్లమీద నుంచి వెళ్లడంతో ఫ్రాక్చర్ అయింది.

పెరిగిన ధరలకనుగుణంగా సర్దుబాటు చేయాలి

బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్

రాయదుర్గం, న్యూస్‌టుడే: పెరిగిన ఉక్కు ధరలకు అనుగుణంగా ప్రభుత్వం రెండు పడకగదుల గృహనిర్మాణ కాంట్రాక్ట్ ధరలను కూడా పెంచాలని, లేని పక్షంలో ఫిబ్రవరి 5 నుంచి పనులను నిలిపివేస్తామని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) ఉపాధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇనుము, ఉక్కు ధరలు నెలల వ్యవధిలోనే 60 శాతం పెరిగాయని, దీంతో నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిపోయిందని, ఈ ప్రభావం తమ ప్రాజెక్టులపై పడిందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని గుత్తేదారులకు పెరిగిన ధరల మేరకు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. రెండు పడకగదుల నిర్మాణ కాంట్రాక్ట్‌లో ఉక్కుధర రూ.30 వేలకు టన్నుగా పేర్కొన్నారని, ఇప్పుడది రూ.50వేలకు చేరిందని తెలిపారు. జీఓ 94 ప్రకారం ధరలు పెరిగితే కాంట్రాక్ట్ ధరలు కూడా పెంచడం, తగ్గితే తగ్గించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవిస్తే ఆ అవకాశం లేదంటున్నారని ఆరోపించారు. బీఏఐ రాష్ట్ర ఛైర్మన్ బి.సుగుణాకర్‌రావు తదితరులు మాట్లాడారు.

అదనపు రుసుము ప్రత్యేక ఖాతాలో వేయండి

ఇస్మా సభ్యులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే విద్యాసంవత్సరానికి (2018-19) ప్రైవేటు పాఠశాలల్లో రుసుములు పెంచడానికి వీల్లేదంటూ తెలంగాణ విద్యాశాఖ జనవరి 4న జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఇస్మా) హైకోర్టును ఆశ్రయించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ప్రభుత్వ మెమో ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టు సైతం హైకోర్టు తీర్పును సమర్థించిందని తెలిపింది. వ్యాజ్యంపై విచారణ జరిపిన ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి.. ఇస్మా సభ్యుల వ్యవహారంలో ఆ మెమో అమలును నిలుపుదల చేస్తూ ఈ నెల 22న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. మెమోలో పేర్కొన్న దానికంటే అదనంగా రుసుము వసూలు చేస్తే ఆ సొమ్మును బ్యాంక్ ప్రత్యేక ఖాతాలో జమ చేయాలని ఇస్మాకు తేల్చిచెప్పారు. తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు ఆ సొమ్మును తీసుకోవడానికి వీల్లేదన్నారు. ఆ సొమ్ము వినియోగం కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేస్తూ ప్రతివాదులకు నోటీసులిచ్చారు.

రూ.5 వేలకు తప్పుడు జనన ధ్రువీకరణపత్రం

- 'మీ సేవ' కేంద్రాల నిర్వాహకుల మాయాజాలం గుట్టు రట్టు

ఈనాడు, హైదరాబాద్: ఎలాంటి ఆధారాలు లేకున్నా జనన, మరణ ధ్రువీకరణపత్రాలు జారీ చేస్తున్న ముఠా కార్యకలాపాల్ని రాచకొండ పోలీసులు రట్టు చేశారు. 2,122 తప్పుడు ధ్రువీకరణ పత్రాల్ని అడ్డదారిలో జారీ చేసినట్లు గుర్తించారు. ఈ ముఠా అక్రమాల తీరుతెన్నుల గురించి రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ బుధవారం విలేకరులకు వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కొందరు 'మీ సేవ' కేంద్రాల నిర్వాహకులు పలువురు ఏజెంట్లను నియమించుకున్నారు. తప్పుడు మార్గంలో జనన, మరణ ధ్రువీకరణపత్రాల్ని పొందేందుకు ఆసక్తి చూపే వారిని గుర్తించడం ఈ ఏజెంట్ల పని. అలాంటి వారి నుంచి ఆధార్, పదోతరగతి ధ్రువీకరణపత్రాల నకలు ప్రతులను తీసుకొంటారు. ఒకవేళ అవేవీ లేకున్నా వివరాలు చెబితే సరిపోతుంది. ఆ వివరాల ప్రకారం సంబంధిత ఆసుపత్రిలోనే జన్మించినట్లు నకిలీ పత్రాల్ని సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో అవే వివరాల్ని ముందుగా మీ సేవ కేంద్రాల ద్వారా జీహెచ్ఎంసీ డేటాఎంట్రీ ఆపరేటర్లకు పంపిస్తున్నారు. అదే సమాచారాన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకూ పంపుతున్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ నంబరును సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయానికి పంపిస్తున్నారు. అవే వివరాలతో జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు నమోదు చేసి ధ్రువీకరణపత్రాలను మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు అందిస్తున్నారు. వారు కావాల్సిన వారికి అందజేస్తున్నారు. ఇలా ఒక్కో నకిలీ ధ్రువీకరణపత్రాన్ని జారీ చేసినందుకు రూ.4-5వేలు వసూలు చేస్తున్నారు. 1991 నుంచి 2010 వరకు జనన, మరణ తేదీలతో మొత్తం రెండు వేలకుపైగా తప్పుడు పత్రాల్ని ఈ ముఠా సృష్టించినట్లు తేలింది. నిందితుల నుంచి నకిలీ ధ్రువీకరణపత్రాలను, ల్యాప్‌టాప్‌లను, చరవాణుల్ని స్వాధీనం చేసుకున్నారు. మరో 14 మంది ఏజెంట్లు పరారీలో ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. మీ సేవ కేంద్రాల నిర్వాహకుల గురించి సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.



నిందితులను విలేకరులకు చూపుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్

అరెస్టయిన ఏజెంట్లు

- చౌల సునీల్‌కుమార్(39), బీమాఏజెంటు, సఫిల్‌గూడ
- బల్ల చంద్రమౌళి(39), చేనేత కార్మికుడు, ఎల్బీనగర్
- బాదం రవికుమార్(42), అల్మాస్‌గూడ, మీర్‌పేట

మీ సేవ నిర్వాహకులు

- మేకల వెంకటాద్రి(32), వెస్ట్‌మారేడ్‌పల్లి
- ఓకంటి రంజిత్(32), చింతల్
- ఎం నారాయణరావు(34), చింతల్
- గుడ్ల కృష్ణ(48), జీడిమెట్ల

జీహెచ్ఎంసీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు

- బోరం భానుప్రకాశ్(27), కుత్బుల్లాపూర్ సర్కిల్
- సారా కిరణ్‌కుమార్(35), వెస్ట్ మారేడ్‌పల్లి సర్కిల్

ఆరోగ్య సహాయకులు

- ఆడపరెడ్డి రాజు(40), సర్కిల్-18
- ఏదుగ రామకృష్ణ(42), సర్కిల్-18
- చిటికెల బాబు(35), సర్కిల్-15
- రెడ్డి నానిబాబు(35), సర్కిల్-15

పీజీ వైద్యవిద్య ఫలితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: నీట్ పీజీ వైద్యవిద్య ఫలితాలను జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌బీఈ) బుధవారం వెల్లడించింది. మొత్తం 1,200 మార్కులకుగాను అర్హత మార్కులను జనరల్ కేటగిరీ అన్‌రిజర్వ్‌డ్ విభాగంలో 321 (50వ పర్సంటైల్)గా నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఎస్సీ-పీహెచ్, ఎస్టీ-పీహెచ్, ఓబీసీ-పీహెచ్ కేటగిరీల్లో 281(40వ పర్సంటైల్), అన్‌రిజర్వ్‌డ్ పీహెచ్ కేటగిరీలో 300(45వ పర్సంటైల్) మార్కులను అర్హతగా ప్రకటించింది. అభ్యర్థులు తమ మార్కుల జాబితాను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని తెలిపింది. కాగా సాంకేతిక సమస్యలతో వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు. ఈ విషయమై ఎన్‌బీఈ ఉన్నతాధికారులను 'ఈనాడు' సంప్రదించగా ఎక్కువమంది ఒకే దఫా ప్రయత్నిస్తుండడంతో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయని, బుధవారం అర్ధరాత్రి నాటికి పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అర్హత మార్కులు తగ్గడం వల్ల ఈ దఫా ఎక్కువమంది అభ్యర్థులు సీట్ల కోసం పోటీపడే అవకాశాలున్నట్లు నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కలిపి 1,200 పీజీ వైద్య సీట్లున్నాయి. ఈ ఏడాది నుంచి తెలంగాణ జాతీయ వైద్యవిద్య సీట్ల పరిధిలోకి చేరుతున్న నేపథ్యంలో.. ఇందులో సుమారు 600వరకూ జాతీయ పరిధిలోకి చేరతాయని వైద్యవర్గాలు తెలిపాయి.

ఉత్తమ ఎన్నికల అధికారులకు అవార్డులు

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 2017వ సంవత్సరానికి ఉత్తమ ఎన్నికల అధికారి, సిబ్బంది అవార్డులకు అధికారులను, కిందిస్థాయి సిబ్బందిని కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేసింది. వీరిలో కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మల్కాజ్‌గిరి కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, డీఎస్ లోకేష్‌కుమార్, ప్రశాంత్ జీవన్ పాటిల్, గౌరవ్ ఉప్పల్, ఎంవీ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ బి.జనార్దన్‌రెడ్డి ఉన్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ గ్రామీణ, కరీంనగర్ ఆర్డీవోలు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌కు పురస్కారాలు దక్కాయి. సహాయ ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి సిబ్బందిని అవార్డులకు ఎంపిక చేశారు.

లక్ష్మణ్‌తో మంద కృష్ణ భేటీ

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం తెరాస మినహా అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చెప్పారు. బుధవారం ఆయన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో సమావేశమయ్యారు. వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్తామన్న హామీ అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్ని పార్టీలను దిల్లీకి తీసుకెళ్తామని, మీరు రావాలని లక్ష్మణ్‌ను ఆహ్వానించారు.

ఛాంపియన్


భువనేశ్వర్ (30; 1/3)

8 ఈ ఇన్నింగ్స్‌లో రెండంకెల స్కోరుకు చేరని భారత ఆటగాళ్లు. పుజారా, కోహ్లి భువనేశ్వర్ మినహా మిగతా 8 మంది ఆటగాళ్లు కలిసి చేసింది 27 పరుగులు మాత్రమే.

వరుసగా మూడో మ్యాచ్‌లోనూ కూర్పుతో కుస్తీ పట్టినా.. అదే తడబాటు.. అదే కంగారు..! పచ్చని పిచ్‌పై అపసోపాలు పడ్డ టీమ్‌ఇండియా ఆఖరి టెస్టునూ కష్టంగానే మొదలెట్టింది. పాతాలు నేర్వని బ్యాట్స్‌మెన్.. పేస్ పరీక్షలో మళ్లీ విఫలమే. రెండంకెల స్కోరు దాటింది ముగ్గురే. బ్యాటింగ్‌కు అత్యంత కష్టంగా ఉన్న పిచ్‌పై అసాధారణ సహనంతో పుజారా నుంచి ఓ యాభై.. కెప్టెన్ విరాట్ బ్యాటు నుంచి ఓ అర్ధశతకం జట్టును మరీ తక్కువకే కుప్పకూలకుండా ఆపాయి. స్కోరు 187 పరుగులే. ఆతిథ్య జట్టుదే పైచేయి అయినా ఇంకా పరిస్థితి భారత్ చేయి దాటిపోలేదు. దక్షిణాఫ్రికా కూడా భారత్ పేస్ రుచి చూస్తోంది. తడబడుతూ ఇన్నింగ్స్ ఆరంభించిన ఆ జట్టు ఆరు పరుగులకే ఓ వికెట్ చేజార్చుకుంది. అయినా ఈ మ్యాచ్‌లో నిలవడం టీమ్‌ఇండియాకు సవాలే. భారత్ దారెటో గురువారం ఆట నిర్దేశించనుంది.

కష్టపడి 187

● బ్యాటుతో తడబడ్డ భారత్
● దక్షిణాఫ్రికాతో ఆఖరి టెస్టు

జొహానెస్‌బర్గ్

వైట్‌వాష్‌కు గురికాకుండా ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన ఆఖరి టెస్టులో టీమ్‌ఇండియా బ్యాటుతో తడబడింది. పుజారా, కోహ్లి నిలవడంతో కాస్త నిలబడింది. రబాడ (3/39), మోర్కెల్ (2/47), ఫిలాండర్ (2/31), పెలుక్వాయో (2/25) ధాటికి తొలి రోజు, బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 187 పరుగులకే ఆలౌటైంది. పుజారా (50; 179 బంతుల్లో 8×4), కోహ్లి (54; 106 బంతుల్లో 9×4).. ఆఖర్లో భువనేశ్వర్ (30; 49 బంతుల్లో 4×4) కృషితో టీమ్‌ఇండియా ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఐతే బంతితో భారత్ కూడా ప్రత్యర్థిని పరీక్షిస్తోంది. ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఆరు పరుగులకే ఒక వికెట్ కోల్పోయింది. ఓపెనర్ మార్‌క్రమ్ (2)ను భువనేశ్వర్ ఔట్ చేశాడు. ఎల్గర్ (4), నైట్‌వాచ్‌మన్ రబాడ (0) క్రీజులో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఐదుగురు పేస్ బౌలర్లతో బరిలోకి దిగడం విశేషం. రోహిత్ స్థానంలో రహానె, అశ్విన్ స్థానంలో భువి జట్టులోకి వచ్చారు.

ఆదుకున్న పుజారా, కోహ్లి: ఓ వైపు పుజారా మొక్కవోని పట్టుదల.. మరోవైపు విరాట్ కోహ్లి దూకుడు. తడబడుతూ సాగిన భారత్ ఇన్నింగ్స్‌లో వీళ్లిద్దరి ఆటే హైలైట్. లేదంటే తొలి రోజు భారత్ పరిస్థితి దారుణంగా ఉండేదే. పచ్చికతో కళకళలాడుతున్న పిచ్‌పై టాస్ గెలిచి, ఆశ్చర్యకరంగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభమే పేలవం. మరోసారి టాప్ లేచిపోయింది. ఓపెనింగ్ జోడీ శుభారంభాన్నివ్వడంలో విఫలమైంది. దక్షిణాఫ్రికా పేస్‌కు చెమటోడ్చిన ఓపెనర్లు విజయ్ (8), రాహుల్ (0) పది ఓవర్లలోపే పెవిలియన్ బాట పట్టేశారు. సీమ్‌కు సహకరించిన పిచ్‌పై తొలి స్పెల్‌లో ఫిలాండర్ (8-7-1-1)ను ఎదుర్కోవడం దాదాపు అసాధ్యమే అయింది. నాలుగో ఓవర్లో ఫిలాండర్ బంతిని ఆడబోయిన రాహుల్.. ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో బౌల్డై తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత రబాడ ఫుల్‌డెలివరీని కవర్ డ్రైవ్ ఆడబోయిన విజయ్.. డికాక్‌కు చిక్కాడు. స్కోరు 13 పరుగులే. దక్షిణాఫ్రికా పేసర్లు ప్రమాదకరంగా కనిపిస్తున్న ఆ దశలో పుజారా, కోహ్లి భారత్‌ను ఆదుకున్నారు. బ్యాటింగ్ పెను సవాల్‌గా మారినా పట్టుదలగా క్రీజులో నిలిచిన పుజారా.. బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారాడు. ఎంతో ఏకాగ్రతతో ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన అతడు.. దూసుకొస్తున్న బంతులను చక్కగా వదిలేశాడు. ఖాతా తెరవడానికి 81 నిమిషాలు నిరీక్షించాడే కానీ బంతిని అస్సలు వెంటాడలేదు. ఎదుర్కొన్న 54 బంతికి కానీ అతడు ఖాతా తెరవలేదంటేనే ఎంత జాగ్రత్తగా ఆడాడో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు కోహ్లి మాత్రం కాస్త తడబడ్డా ఎటాకింగ్ గేమ్ ఆడాడు. తనవైన షాట్లు ఆడేందుకు వెనుకాడలేదు. బౌలర్లు లెంగ్త్ తప్పిన ప్రతిసారీ శిక్షించాడు. మంచి కవర్‌డ్రైవ్‌లు ఆడాడు. ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం కూడా అతడికి కలిసొచ్చింది. వ్యక్తిగత స్కోరు 11, 32 వద్ద ఔటయ్యే ప్రమదాన్ని తప్పించుకున్న కోహ్లి. లంచ్ తర్వాత అర్ధశతకం (101 బంతుల్లో) పూర్తి చేశాడు.


అక్కడి నుంచి టపాటపా: పుజారా, కోహ్లి పోరాటంతో భారత్ ఓదశలో 97/2తో మెరుగ్గానే కనిపించింది. కానీ ఒక్కసారి ఈ భాగస్వామ్యం విడిపోయాక పతనం వేగంగా సాగింది. ఎంగిడి బౌలింగ్‌లో మూడో స్లిప్‌లో డివిలియర్స్ అందుకున్న చక్కని క్యాచ్‌కు కోహ్లి నిష్క్రమించడంతో 84 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే మరో దెబ్బ. లేకలేక అవకాశం దక్కించుకున్న రహానె 9 పరుగులకే నిష్క్రమించాడు. మోర్కెల్ బౌలింగ్‌లో అతడు వికెట్ల ముందు దొరికిపోయాడు. నిజానికి రహానె అంతకుముందే ఔట్ కావాల్సింది. ఫిలాండర్ బౌలింగ్‌లో అతడు వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ అది నోబాల్‌గా తేలడంతో బతికిపోయాడు. టీ సమయానికి స్కోరు 114/4. మరోవైపు పుజారా 173 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేశాడు. కానీ అదే స్కోరు వద్ద పెలుక్వాయో బౌలింగ్‌లో వికెట్‌కీపర్ చేతికి చిక్కాడు. పార్థివ్ (2)తో ఐదో వికెట్‌కు అతడు 31 పరుగులు జోడించాడు. అప్పటికి స్కోరు 144. లోయర్ ఆర్డర్ పెద్దగా ప్రతిఘటించలేకపోయింది. అదే స్కోరు వద్ద పార్థివ్, హార్దిక్ కూడా నిష్క్రమించారు. భువనేశ్వర్ (30; 49 బంతుల్లో 4×4) కాస్త బ్యాటు ఝుళిపించడంతో భారత్ 187కు చేరుకోగలిగింది. భారత్ 43 పరుగులకే చివరి ఆరు వికెట్లు చేజార్చుకుంది.


పుజారా 50


కోహ్లి 54

54 తొలి పరుగు చేయడానికి చెతేశ్వర్ పుజారా తీసుకున్న బంతులు. 2001 తర్వాత ఖాతా తెరవడానికి అత్యధిక బంతులు తీసుకున్న టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ పుజారాయే.

"నేను ఆడిన అత్యంత కఠినమైన పిచ్‌ల్లో ఇదొకటి. ఈ పిచ్ రాన్రాను ఇంకా కఠినంగా తయారవుతుంది. అందుకే మేం ముందు బ్యాటింగ్ చేశాం. ఇప్పటికే బంతి కదలికలు విపరీతంగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే మేం బాగానే బ్యాటింగ్ చేశాం. చేసిన పరుగులు కూడా సరిపోతాయని అనుకుంటున్నాను. మేం దక్షిణాఫ్రికన్లను తొందరగానే అవుట్ చేయగలం. మ్యాచ్ సాగుతున్న కొద్దీ ఈ పిచ్‌పై పరుగులు చేయడం కష్టమవుతుంది"
– పుజారా



ఇలాంటి పిచ్‌పై టెస్టా!

వాండరర్స్ పిచ్‌పై మాజీ కెప్టెన్ గంగూలీ ధ్వజమెత్తాడు. ఈ పిచ్ టెస్టు మ్యాచ్‌కు ఎంత మాత్రం పనికిరాదని వ్యాఖ్యానించాడు. "ఇలాంటి పిచ్‌పై టెస్టు మ్యాచ్ నిర్వహించడం సరికాదు. బంతి విపరీతంగా కదిలింది. 2003లో కివీస్‌లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ బ్యాట్స్‌మన్‌కు అంతగా అవకాశాలుండవు. ఐసీసీ ఈ విషయాన్ని పరిశీలించాలి" అని గంగూలీ అన్నాడు.

ఈ సిరీస్‌లో భారత్ ఓపెనర్ల సగటు. మూడు లేదా అంతకంటే ఎక్కువ టెస్టుల సిరీస్‌లో భారత ఓపెనర్ల అత్యంత పేలవమైన సగటు ఇదే. **12.30**

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) రబాడ 8; రాహుల్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 0; పుజారా (సి) డికాక్ (బి) పెలుక్వయో 50; కోహ్లి (సి) డివిలియర్స్ (బి) ఎంగిడి 54; రహానె ఎల్బీ (బి) మోర్కెల్ 9; పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 2; హార్దిక్ పాండ్య (సి) డికాక్ (బి) పెలుక్వాయో 0; భువనేశ్వర్ (సి) పెలుక్వాయో (బి) రబాడ 30; షమి (సి) రబాడ (బి) ఫిలాండర్ 8; ఇషాంత్ శర్మ (సి) డుప్లెసిస్ (బి) రబాడ 0; బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 26 **మొత్తం:** (77 ఓవర్లలో ఆలౌట్) **187; వికెట్ల పతనం:** 1-7, 2-13, 3-97, 4-113, 5-144, 6-144, 7-144, 8-163, 9-166; **బౌలింగ్:** మోర్నీ మోర్కెల్ 17-5-47-2; ఫిలాండర్ 19-10-31-2; రబాడ 19-7-39-3; ఎంగిడి 15-7-27-1; పెలుక్వాయో 7-1-25-2

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ బ్యాటింగ్ 4; మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) భువనేశ్వర్ 2; రబాడ బ్యాటింగ్ 0; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం:** (6 ఓవర్లలో వికెట్ నష్టానికి) **6; వికెట్ల పతనం: 1–3; బౌలింగ్:** భువనేశ్వర్ 3-2-3-1; బుమ్రా 3-2-3-0


ఫెదరర్

ముర్రే లేడు.. జకోవిచ్ కథ ముగిసింది.. నాదల్ పనీ అయిపోయింది.. ఇక ఆ నలుగురిలో మిగిలింది ఒక్కడే.. రోజర్ ఫెదరర్! ఈ దిగ్గజం 20వ గ్రాండ్‌స్లామ్ గెలవడానికి ఇక మిగిలింది రెండే అడుగులు. మళ్లీ తన పతాక స్థాయిని అందుకుని చెలరేగిపోతున్న ఫెడెక్స్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్‌లోకి దూసుకెళ్లాడు. ఈ టోర్నీకి ముందు గ్రాండ్‌స్లామ్స్‌లో కనీసం క్వార్టర్స్ కూడా చేరని కొరియా సంచలనం హుయాన్ చంగ్ అతడి ప్రత్యర్థి కావడం విశేషం. మహిళల సింగిల్స్‌లో కెర్బర్, హాలెప్ క్వార్టర్స్ దాటారు.

ఒక దిగ్గజం × సంచలనం



హుయాన్ చంగ్

● సెమీస్‌లో కొరియా కుర్రాడితో అమీతుమీ
● హాలెప్, కెర్బర్ కూడా ముందంజ
● ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. రికార్డు స్థాయిలో 19 గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ఫెదరర్.. దక్షిణ కొరియా టెన్నిస్ చరిత్రలోనే తొలిసారిగా గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన ఆటగాడిగా రికార్డు సృష్టించిన చంగ్ మధ్య సెమీస్ జరగబోతోంది. వీళ్లిద్దరూ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ దాటారు. బుధవారం క్వార్టర్స్‌లో రెండో సీడ్ ఫెదరర్ 7-6 (7-1), 6-3, 6-4 తేడాతో వరుస సెట్లలో 19వ సీడ్ థామస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచి సెమీస్‌లో అడుగుపెట్టాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫెదరర్ సెమీస్ చేరడమిది 14వ సారి. క్వార్టర్స్ మ్యాచ్ తొలిసెట్ హోరాహోరీగా సాగింది. బెర్డిచ్ వరుసగా మూడు గేమ్‌లు సాధించి 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. 5-3తో సెట్ విజయానికి చేరువగా వెళ్లాడు. ఐతే ఇక్కడే ఫెదరర్ జోరు మొదలైంది. గొప్పగా పుంజుకున్న ఫెదరర్ బెర్డిచ్ సర్వీస్ బ్రేక్ చేసి.. తన సర్వీస్‌లు నిలబెట్టుకుని సెట్‌ను టైబ్రేకర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ తనదైన ఆధిపత్యంతో సెట్ గెలిచాడు. రెండో సెట్లో ఫెదరర్ ధాటికి బెర్డిచ్ నిలవలేకపోయాడు. 3-6తో సెట్ చేజార్చుకున్నాడు. మూడో సెట్‌లో కొంచెం ప్రతిఘటన ఎదురైనప్పటికీ ఫెదరర్ పట్టు వదల్లేదు.

చంగ్.. అదే జోరు: జ్వెరెవ్, జకోవిచ్ లాంటి అగ్రశ్రేణి ఆటగాళ్లను ఓడిస్తూ క్వార్టర్స్ చేరిన అన్‌సీడెడ్ ఆటగాడు చంగ్.. తన జైత్రయాత్రను కొనసాగించాడు. ప్రిక్వార్టర్స్‌లో జోకోవిచ్‌కు షాకిచ్చిన అతను క్వార్టర్స్‌లో 6-4, 7-6, (7-5), 6-3తో అమెరికా యువ ఆటగాడు సాండ్‌గ్రెన్ (అమెరికా)పై విజయం సాధించాడు. తొలిసెట్‌ను సులువుగానే గెలుచుకున్న చంగ్.. రెండో సెట్లో కష్టపడాల్సి వచ్చింది. రెండో సెట్ హోరాహోరీగా సాగి టైబ్రేకర్‌కు దారి తీసింది. టైబ్రేకర్‌లో చంగ్ 7-5తో గెలిచాడు. మూడో సెట్లో ధాటిగా ఆడిన అతను సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు.


కెర్బర్

కెర్బర్, హాలెప్ సైతం..: మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ హాలెప్, మాజీ నంబర్‌వన్ కెర్బర్ సెమీస్ చేరారు. క్వార్టర్స్‌లో కెర్బర్ 6-1, 6-2తో మాడిసన్ కీస్ (అమెరికా)పై సునాయస విజయం సాధించింది. హాలెప్ 6-3, 6-2తో ఆరో సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేసింది. సెమీస్‌లో హాలెప్, కెర్బర్‌లే తలపడనున్నారు.

సెమీస్‌లో బోపన్న జోడీ: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మిగిలిన ఏకైక భారత క్రీడాకారుడు రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీస్ చేరాడు. బోపన్న-బాబోస్ (హంగేరి) జోడీ క్వార్టర్స్‌లో 6-4, 7-6 (7-5)తో స్పియర్స్ (యుఎస్)- కబాల్ (కొలంబియా) జంటపై గెలిచింది. గంటా 15 నిమిషాలు సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను సులభంగా గెలుచుకున్న బోపన్న జోడీ.. రెండో సెట్లో చెమటోడాల్సి వచ్చింది.


సింధు

ప్రిక్వార్టర్స్‌లో సింధు, సైనా

జకార్తా: ఇండొనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణులు పి.వి.సింధు, సైనా నెహ్వాల్ శుభారంభం చేశారు. వీళ్లిద్దరూ తొలి రౌండ్లో నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరారు. సింధు 21-13, 21-10తో స్థానిక క్రీడాకారిణి హనా రమదానిపై సునాయాస విజయం సాధించింది. సింధు.. రెండో రౌండ్లో క్వాలిఫయర్ జిన్ వీ (మలేసియా)ను ఢీకొంటుంది. సైనా తొలి మ్యాచ్‌లో చైనా అగ్రశ్రేణి క్రీడాకారిణి, ఏడో సీడ్ చెన్ యుఫీని 22-24, 21-15, 21-14తో ఓడించింది. తొలి గేమ్ ఓడినా స్థైర్యం కోల్పోకుండా పట్టుదలతో పోరాడిన సైనాకు సరైన ఫలితం దక్కింది. రెండో రౌండ్లోనూ సైనా చైనాకే చెందిన చెన్ జియాగ్జిన్‌ను ఢీకొంటుంది. పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, సమీర్ వర్మ తొలి రౌండ్లోనే టోర్నీ నుంచి నిష్క్రమించారు. కశ్యప్ 18-21, 18-21తో ఫెంగ్ చాంగ్ (మలేసియా) చేతిలో పరాజయం చవిచూశాడు. సౌరభ్ 16-21, 21-12, 10-21తో సకాయ్ (జపాన్) చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ రెండో రౌండు చేరింది. ఈ జంట 21-15, 21-10తో టకుటో-యుకి (జపాన్) ద్వయాన్ని ఓడించింది. సుమీత్ రెడ్డి-మను అత్రి తొలి రౌండ్లో 18-21, 21-16, 16-21తో చింగ్ యావ్-యాంగ్ పొ జంట చేతిలో ఓటమి చవిచూసింది.

భారత్ విజయం

నాలుగు దేశాల హాకీ టోర్నీ

హామిల్టన్: నాలుగు దేశాల హాకీ టోర్నీ రెండో అంచె పోటీలను భారత జట్టు విజయంతో మొదలుపెట్టింది. బుధవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత్ 3-2 తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. భారత్ తరపున లలిత్ ఉపాధ్యాయ్ (7వ నిమిషంలో), హర్జీత్ సింగ్ (32వ నిమిషంలో), రూపిందర్ పాల్ సింగ్ (36వ నిమిషంలో) గోల్స్ చేశారు. న్యూజిలాండ్ జట్టులో డానియల్ హారిస్ (23వ నిమిషంలో), కేన్ రస్సెల్ (37వ నిమిషంలో) గోల్స్ చేశారు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో బెల్జియంతో తలపడనుంది. తొలి అంచె ఫైనల్లో బెల్జియం చేతిలోనే భారత్ పరాజయం పాలైంది.

ఫైనల్లో పంజాబ్ రాయల్స్

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్ సీజన్-3లో పంజాబ్ రాయల్స్ జట్టు ఫైనల్ చేరింది. సెమీస్‌లో పంజాబ్ 6-3 తేడాతో వీర్ మరాఠాస్‌పై విజయం సాధించింది. మ్యాచ్‌లో వరుసగా మొదటి నాలుగు బౌట్లు గెలిచి పంజాబ్ సత్తా చూపించింది. ఇలియాస్, సెలెన్, జెనో, అనస్టాసిజ, పూజ, జితేందర్ విజయాలు సాధించారు. యూపీ దంగల్, హరియాణా హామర్స్ మధ్య జరిగే మరో సెమీస్ విజేతతో పంజాబ్ ఫైనల్లో తలపడనుంది.

గడువు పెంచాల్సిందే

ఈనాడు - హైదరాబాద్

ఒప్పందం ప్రకారం ఈ ఏడాది ఆఖరులో పూర్తి చేయాల్సిన ఓ ప్రాజెక్టు పనిలో ఇప్పటివరకు పది శాతం కూడా జరగలేదు. మరో రెండు ప్రాజెక్టుల్లో పనులు ఆరంభ దశలోనే ఉన్నాయి. ఒప్పందం ప్రకారం పనులు జరగాలంటే అవసరమైన బడ్జెట్‌లో నాలుగోవంతు కూడా ఖర్చు చేయలేని పరిస్థితి. దీంతో అనివార్యంగా ఈ ప్రాజెక్టుల గడువును పెంచాల్సి వస్తుందని నీటిపారుదల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పునరాకృతిలో భాగంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో పాటు దిండి, సీతారామ ఎత్తిపోతల పథకాల పనులు నత్తనడకన నడవడమే కాదు, రెండింతల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

రూ.35,200 కోట్ల పరిపాలనా అనుమతితో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఒప్పందం ప్రకారం ఈ ఏడాది ఆఖరుకు పూర్తికావాలి. రూ.29,183.43 కోట్ల విలువైన 18 ప్యాకేజీల పనులకు గుత్తేదారులతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మరో మూడు ప్యాకేజీలకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఆయకట్టు గుర్తింపు సర్వే పనులు జరుగుతున్నాయి. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొని 12.4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయాలని ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. 30 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంకాగా, ఇప్పటివరకు సుమారు రూ.1,400 కోట్లు ఖర్చుచేసింది. మరో రూ.వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పెండింగ్ బిల్లులు చెల్లించినా పనులపై చేసిన ఖర్చు రూ.2,400 కోట్లకు మించదు. అంటే ఒప్పందంలో పది శాతం కూడా ఖర్చు చేయనట్లే. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.నాలుగువేల కోట్లు ప్రతిపాదించారు. ఇంత మొత్తం ఖర్చుచేసినా గడువులోగా 25 శాతం పనులు మాత్రమే పూర్తవుతాయి. 27వేల ఎకరాల భూసేకరణకు 17వేల ఎకరాలు సేకరించారు. భూసేకరణకే సుమారు రూ.900 కోట్లు ఖర్చుచేశారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఏ రకంగా చూసినా గడువులోగా 25 శాతానికి మించి జరిగే పరిస్థితి లేదు. దీంతో అనివార్యంగా గడువు పెంచాల్సిన పరిస్థితి. గతంలో ప్రాణహిత-చేవేళ్లను నాలుగేళ్లలో పూర్తి చేసేలా ఒప్పందం చేసుకొని.. ఒకేసారి గడువును ఎనిమిదేళ్లకు పెంచారు. అనేక ప్రాజెక్టుల్లో ఒప్పందం ముగిసిన తర్వాత ప్రతి ఆరునెలలకోసారి చొప్పున పదిసార్లకు పైగా గడువు పొడిగించారు. కాళేశ్వరం ఎత్తిపోతలలో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు చేపట్టిన పనులు మాత్రమే నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ప్రభుత్వం చేపట్టింది. గతంలో ప్రాణహిత-చేవేళ్లకు గడువు పొడిగించినట్లుగానే ఒకేసారి మరో 30 నెలలు పొడిగించే అంశాన్ని నీటిపారుదల శాఖ పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఏడాదికి రూ.పదివేల కోట్లు ఖర్చుచేసినా మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో మూడేళ్ల సమయం పడుతుంది.



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనుల్లో భాగంగా అంజనగిరి రిజర్వాయర్ కట్ట నిర్మాణపనులు

దిండి.. ఇంకా భూమి సేకరించాలండి!

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా నిర్మించే నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకొనేలా చేపట్టిన దిండి ఎత్తిపోతల పథకం కూడా నత్తనడకనే సాగుతుంది. ఏడు ప్యాకేజీల పనులకు రూ.3,929.66 కోట్లతో ఒప్పందం జరిగింది. రూ.200 కోట్లు ఖర్చుచేశారు. మరో రూ.150 కోట్ల పెండింగ్ బిల్లులున్నాయి. పదివేల ఎకరాల భూమిని ఇంకా సేకరించాలి. ఈ ప్రాజెక్టులో కూడా ఏడాదిలో పదిశాతం పని కూడా జరగలేదు.

సీతారామా.. ఖర్చుచేసింది రూ.150 కోట్లే!

మరో ప్రధాన ప్రాజెక్టు సీతారామ ఎత్తిపోతల పథకం పరిస్థితీ ఇంతే. ఆరు ప్యాకేజీల పనులకు రూ.3,890.71 కోట్లతో ఒప్పందం జరిగింది. ఇప్పటివరకు రూ.150 కోట్లు ఖర్చుచేశారు. భూసేకరణ కూడా చేయాల్సి ఉంది. కొన్ని పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం పాలమూరు-రంగారెడ్డికి ఏడాది, దిండి, సీతారామ ఎత్తిపోతలకు రెండేళ్ల సమయం ఉన్నా, ఇప్పటివరకు జరిగిన పని, చేసిన ఖర్చు చూస్తే గడువులోగా సగం పని పూర్తి కావడం కష్టమేనని నీటిపారుదల శాఖ వర్గాలే అంగీకరిస్తున్నాయి.

లొట్టిపిట్ట.. రెండు తలలు ఎట్టెట్టా..!



అరెరె.. రెండు తలలతో ఒంటె.. చాలా అరుదుగా కనిపించింది..ఎక్కడనుకుంటున్నారా..! అయితే.. మీరు కాస్త తికమక పడ్డారు! మరోసారి చిత్రాన్ని పరికించి చూడండి.. అసలు విషయం బోధపడి ఉంటుంది కదూ..!! నిజమే.. ఇవి రెండు లొట్టిపిట్టలు.. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఇలా కనిపించాయి. రాజస్థాన్ నుంచి రాజధానికి వలస వచ్చిన కొన్ని కుటుంబాలు ఒంటెలను నమ్ముకొని జీవనం వెళ్లదీస్తున్నాయి. ఈ సందర్భంగా రెండు ఎడారి ఓడలను ఇలా పక్కపక్కనే కట్టివేయగా ఈ అపురూప దృశ్యం సాక్షాత్కరించింది.

– ఈనాడు, హైదరాబాద్

ఘనంగా మండమెలిగే పండగ

- సమ్మక్క సారలమ్మ జాతరకు శ్రీకారం

మేడారం, న్యూస్‌టుడే: మేడారం జాతరకు సంబంధించిన మండమెలిగే పండగను బుధవారం ఆదివాసీ పూజారులు ఘనంగా నిర్వహించారు. పూర్వకాలం నుంచి సమ్మక్క దేవతను కొలుస్తున్న సిద్దబోయిన, కొక్కెర, చందా వంశీయులు పండగను ఘనంగా నిర్వహించి సమ్మక్క సారలమ్మ జాతరకు శ్రీకారం చుట్టారు. కన్నెపల్లిలో కాక వంశీయులు సారలమ్మ దేవతకు, ఏటూరునాగారం మండలం కొండాయిలో గోవిందరాజుకు, , మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజుకు ఈ పండగ నిర్వహించారు. మేడారంలోని ప్రధాన పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంటి నుంచి పూజారులందరూ స్థానిక సమ్మక్కదేవత పూజామందిరానికి వచ్చి శుద్ధి కార్యక్రమాలు చేశారు. దేవతకు దూప, దీప నైవేద్యాలు సమర్పించి గ్రామదేవతలకు శాంతి పూజలు చేశారు. గ్రామానికి తూర్పు, పడమరలకు బూరుగు వృక్షాలతో ధ్వజస్తంభాలు పాతి దిష్టితోరణం కట్టారు. రాత్రి గద్దెల వద్దకు వెళ్లి దీపాలు ఆర్పి.. వెన్నెల వెలుగులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కన్నెపల్లిలో కాక వంశీయులు కుటుంబసమేతంగా సారలమ్మ ఆలయానికి వెళ్లి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. రాత్రిపూట కాలినడకన మేడారంలోని గద్దెల వద్దకు వచ్చి.. నైవేద్యాలు సమర్పించి సమ్మక్క పూజారులతో కలిసి జాగారం చేశారు. అదేవిధంగా పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు పూజారులు, కొండాయి నుంచి గోవిందరాజు పూజారులు మేడారంలోని గద్దెల వద్దకు వచ్చి పూజలు చేశారు. నలుగురు దేవతల పూజారులు పరస్పరం తమ శాఖలు ఇచ్చిపుచ్చుకుని డోలి వాయిద్యాలతో ప్రత్యేక నృత్యాలు చేస్తూ పూజా తంతు నిర్వహించారు.

కాళేశ్వరానికి శరవేగంగా విద్యుత్

- 400కేవీ లైన్ల నిర్మాణం ప్రారంభం
- జూన్ 8 నాటికల్లా పంపులు సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు విద్యుత్ సరఫరా కోసం లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం వద్ద పంపుహౌస్‌ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వచ్చే జూన్ 8కల్లా పంపులు సిద్ధమవుతాయని ప్రభుత్వ ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల ఏర్పాటు పనులు ప్రారంభించినట్లు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో ఆరో ప్యాకేజీలో 3 పంపులు, 8వ ప్యాకేజీలో మరో 5 పంపులు జూన్‌కు సిద్ధమవుతాయన్నారు. ఆరు 400 కేవీ, మరో మూడు 220 కేవీ, రెండు 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం ప్రారంభించారు. విద్యుత్ టవర్లు, హైటెన్షన్ లైన్ల పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ట్రాన్స్‌కోను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించి వెళ్లిన తర్వాత ఇప్పటికే రెండుసార్లు హరీశ్‌రావు ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. ఒక్కోచోట 59 మీటర్ల ఎత్తు గల టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు దగ్గర కంట్రోలు రూము ఏర్పాటు చేసి మోటార్ల బిగించే పనులు చేస్తున్నారు. ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరు వరకూ నీటి తరలింపునకు అనుగుణంగా సివిల్ పనులు తుదిదశకు చేరడంతో విద్యుత్, ఇతర మెకానిక్ పనులు కూడా ప్రారంభించారు. సివిల్ పనులు మూడు షిఫ్టుల్లో కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. మేడారం నుంచి ఎస్ఆర్ఎస్పీ వరదకాల్వ ద్వారా మధ్యమానేరుకు నీటిని తరలించడానికి రామడుగు వద్ద పంపుహౌస్‌ను నిర్మించారు. మొత్తం 139 మెగావాట్ల సామర్థ్యమున్న విద్యుత్ మోటార్లతో కాళేశ్వరం నీటిని తరలిస్తారు. ఇప్పటికే ఒక మోటారు బిగించి ప్రయోగాత్మకంగా నడిపి చూశారు. రెండో మోటారు ఏర్పాటు పనులు మొదలయ్యాయి. రామడుగులో రెండో మోటారు బిగించిన తరవాత 3 నెలల్లోపే నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమవుతామని అధికారులు పేర్కొన్నారు. ఆరో ప్యాకేజీలో ఎల్లంపల్లి నుంచి మేడారం రిజర్వాయర్‌కు కాల్వల ద్వారా నీటిని తరలిస్తామని, అక్కడి నుంచి తిరిగి ఎత్తిపోసేందుకు 124 మెగావాట్ల సామర్థ్యమున్న ఏడు మోటార్లు ఏర్పాటు చేస్తామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సీకే మిశ్రా

'కాళేశ్వరం' దేశ ప్రగతికి దోహదం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణం, మిషన్ భగీరథ పథకం దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడతాయని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ కార్యదర్శి సీకే మిశ్రా అన్నారు. ఆయన బుధవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, పీసీసీఎఫ్ పీకే ఝాతో కలిసి జయశంకర్ జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌజ్‌ను విహంగ వీక్షణం (ఏరియల్ సర్వే) ద్వారా వీక్షించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యారేజీ నిర్మాణాలతో నీటి లభ్యత, భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు.

మోటార్ల పరిశీలనకు విదేశాలకు ఇంజినీర్లు

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అమర్చనున్న మోటార్లు, పంపులను పరిశీలించేందుకు నీటిపారుదల, జెన్‌కోకు చెందిన ఇంజినీర్లు విదేశాల్లో పర్యటించనున్నారు. నాలుగు బృందాలుగా ఇంజినీర్లు చైనా, జర్మనీల్లో ఆయా కర్మాగారాలకు వెళ్లి పరిశీలిస్తారు. ఈ బృందాల్లో కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, నీటిపారుదల శాఖ మంత్రి ఓఎస్‌డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సలహాదారు పెంటారెడ్డి, నీటిపారుదల, జెన్‌కోకు చెందిన ఈఈలు, డీఈఈలు ఉన్నారు. గుత్తేదారులతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం మోటార్లు, పంపులు తయారీ సమయంలో ఇంజినీర్లు వెళ్లి పరిశీలించాల్సి ఉంది.

దాతలకు యాతనే!

బడి విరాళం భారీగా పెంపు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలకు విరాళాలు ఇచ్చి తాము కోరుకున్న వారి పేరు పెట్టుకోవాలంటే ఇకమీదట కష్టమే. ఇందుకోసం భారీగా విరాళం ఇవ్వాల్సిందే. గతంలోని విరాళాల మొత్తాన్ని 5 నుంచి 10 రెట్లు పెంచుతూ విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నగదు/స్థలం ఇవ్వడం, భవనాలు నిర్మించడం ద్వారా సర్కారు బడులకు దాతలపేర్లు పెట్టుకునేలా 2004లో అప్పటి ప్రభుత్వం జీఓ 162 జారీ చేసింది. ఆ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వరసగా రూ. 5 లక్షలు, రూ. 7.5 లక్షలు, రూ. 10లక్షలు నగదు లేదా సమానమైన స్థలం ఇస్తే చాలు. దాన్ని తాజాగా వరసగా రూ. 25 లక్షలు, రూ. 50లక్షలు, రూ.కోటికి పెంచారు.

పెద్ద పులి కనిపించింది..

- జంతుగణనలో ప్రత్యక్షంగా చూసిన వలంటీర్లు
- పెరిగిన మాంసాహార జంతు సంపద

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ అటవీ ప్రాంతాల్లో మాంసాహార జంతువుల సంఖ్య పెరుగుతోంది. జాతీయ జంతుగణనలో భాగంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా సర్వే ప్రకారం మాంసాహార జంతువుల్లో వృద్ధి కన్పిస్తోందని అటవీ శాఖ అధికారులు చెప్పారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులితో పాటు చిరుతలు, ఎలుగుబంట్లు, తోడేళ్లు, రేసుకుక్కలు ప్రత్యక్షంగా కన్పించాయని, పలుచోట్ల వాటి ఆనవాళ్లు పెద్దసంఖ్యలో కన్పించాయని తెలిపారు. కదంబ అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్ వెళుతుండగా పెద్దపులి కనిపించిందని, పులి రోడ్డు దాటి అడవిలోకి వెళ్లే వరకు డ్రైవర్ బస్సు ఆపినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. పెద్దపులుల సంరక్షణ ప్రాంతాలైన అమ్రాబాద్, కవ్వాల్ అభయారణ్యాల్లో పెద్దపులుల అడుగుల గుర్తులతో పాటు వాటి ఆవాస ప్రాంతాల్ని గుర్తించామన్నారు. అమ్రాబాద్ దట్టమైన అడవుల్లో మల్లయ్యలొద్దిలో సర్వేలో పాల్గొన్న వలంటీర్లకు పెద్దపులి కనిపించింది. ప్రత్యక్షంగా కనిపించనిచోట జంతువుల కాలిగుర్తులు, విసర్జితాలు, కళేబరాలు, చెట్లపై కాలిగోర్ల గుర్తుల ఆధారంగా ఏ రకమైన జంతువు ఎక్కడ సంచరిస్తుందన్న వివరాల్ని ఈసర్వేలో నమోదు చేస్తున్నారు. మొత్తంగా 14 అటవీ బీట్లలో చిరుతపులుల సంచారం ఉన్నట్లు అటవీశాఖ గుర్తించింది. 22 నుంచి మొదలైన జంతుగణనలో మాంసాహార జంతువుల నమోదు 24తో పూర్తయింది. 27 నుంచి 29 వరకు శాకాహార జంతువుల లెక్కింపు జరగనుంది.

మేడారంలో 'క్యూ మానిటరింగ్' వ్యవస్థ

రద్దీ నియంత్రణ కోసం ఏర్పాటు

ఈనాడు, వరంగల్: మేడారం మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. ఈసారి జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జాతర జరగనుంది. జాతరకు వచ్చే భక్తులకు వరుసల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా రద్దీని నియంత్రించేందుకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడనున్నారు. ఇందుకోసం పోలీసు యంత్రాంగం 'క్యూ మానిటరింగ్' వ్యవస్థను ఏర్పాటు చేసి 6 సీసీ కెమెరాలను ప్రత్యేకంగా బిగించారు. సాధారణ సీసీ కెమెరాలకన్నా ఇవి భిన్నంగా పనిచేస్తాయి. మనుషుల తలలను స్కాన్‌చేసి లెక్కించే విధంగా ఇవి పనిచేయనున్నాయి. దీంతో జాతరకు వచ్చే భక్తుల సంఖ్య 80 శాతం వరకు కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉందని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ భాస్కరన్ తెలిపారు.

కిరణాల ద్వారా లెక్కింపు..: మేడారంలో గద్దెల వద్ద వరుసల్లో, ప్రముఖుల ప్రవేశద్వారం, బయటకు వెళ్లే దారి... ఇలా ఆరుచోట్ల క్యూ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా ఏర్పాటు చేసిన కెమెరాలు భక్తులసంఖ్యను లెక్కిస్తాయి. వీటిలో నుంచి వెలువడే కిరణం(రే) మనిషి తలను పసిగడుతుంది. ఒక వేళ భక్తులెవరైనా రెండుసార్లు దర్శనానికి వచ్చినా ఈ కెమెరా ఆ వ్యక్తిని ఒకేసారి పసిగడుతుంది. ఈ కెమెరాల ద్వారా భక్తుల సంఖ్యను గంటగంటకు పర్యవేక్షించి, గద్దెల వద్ద సామర్థ్యానికి మించి భక్తులుంటే పరిస్థితి అదుపు చేసి రద్దీని నియంత్రించడానికి ఈ వ్యవస్థ ఉపకరించనుంది.

పాతగుట్టలో బ్రహ్మోత్సవాలు ఆరంభం

యాదగిరిగుట్ట,న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం శాస్త్రోక్త పూజలతో మొదలయ్యాయి. తొలిరోజు విష్వక్సేన పూజతో ఆచారాలను నిర్వహించి శుద్ధి పర్వాలను చేపట్టారు. ఉదయం ఆలయంలోని మూలవర్యులకు ప్రత్యేక అభిషేకం, అర్చన నిర్వహించి వేడుకలకు తెరదీశారు. రాత్రి వైష్ణవ ఆచారంగా అంకురార్పణ జరిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.